

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



ఆదివారం | 21-9-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 174 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం; తిథి: అమావాస్య రా.1:23 తదుపరి పాడ్యమి; నక్షత్రం: పుబ్బ ఉ.9.32 తదుపరి ఉత్తర; వర్జ్యం: సా.5.17-7.01; దుర్ముహూర్తం: సా.4.32-5.20; అమృతఘడియలు: తె.3.38-5.21; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.07; సూర్యాస్తమయం: 6.08 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru






ఎంగిలిపూల బతుకమ్మ ఉయ్యాలో!

నేటి నుంచి బతుకమ్మ పండుగ

ఆడపడుచుల ఔన్నత్యానికి ప్రతీక

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 11



తిరుమల బ్రహ్మోత్సవాలు సందర్భముగా 21 సెప్టెంబర్ 2025, ఆదివారం ఆంధ్రజ్యోతి అనుబంధాన్ని బ్రహ్మోత్సవాల ప్రత్యేక సంచికగా అందుకోండి.

-మేనేజింగ్ డైరెక్టర్

కొత్త జిల్లాల్లో కోర్టు భవనాలు నిర్మించండి 13

సిబ్బందిని నియమించండి

హైకోర్టు సీజే జస్టిస్ అపరేష్‌కుమార్‌సింగ్

సీజేతో సీఎం రేవంత్ భేటీ



స్థానిక ఎన్నికలపై ముందుకెలా?

2 రోజుల్లో ప్రభుత్వం కీలక నిర్ణయం

బీసీ రిజర్వేషన్లు, స్థానిక సమరంపై మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ

జీవో ఇచ్చి ఎన్నికలకు వెళ్దామన్న కొందరు.. పార్టీ పరంగా వెళ్దామన్న మరికొందరు

42% పై జీవో ఇవ్వడంపైనా చర్చ

తుది నిర్ణయం ముఖ్యమంత్రిదే

దీనిపై రేపు సీఎస్ కీలక సమావేశం!

హైదరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. ఎన్నికల నిర్వహణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో ఏ విధంగా ముందుకెళ్లాలనే అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి శనివారం సాయంత్రం అందుబాటులో ఉన్న మంత్రులతో బంజారాహిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమావేశమయ్యారు. తమ ముందున్న మూడు రకాల అవకాశాలపై చర్చించారు. ఈ సందర్భంగా

మిగతా 13వ పేజీలో...

ట్రంప్ నిర్ణయంతో తెలుగు టెకీల ఆవేదన

కేంద్రం అమెరికాతో చర్చలు జరపాలి: రేవంత్ 13

• డాలర్ డ్రీమ్స్ ఢమాల్!

హెచ్ 1 బాంబు!

వీసా దరఖాస్తు రూ.90 లక్షలు.. భారతీయ ఐటీ నిపుణులపై ట్రంప్ అంకుశం

అధ్యక్ష హోదాలో ఉత్తర్వుపై సంతకం

అమెరికాకు రూ.90 లక్షల కోట్ల ఆదాయం

హెచ్1బీ లబ్ధిదారుల్లో 71% భారతీయులే

సగటు జీతమే లక్ష డాలర్లు ఉండదు

ఏడాదికోసారి లక్ష డాలర్లు చెల్లించాలి

హెచ్1బీ కోసం కంపెనీ అంత భరిస్తుందా?

గ్రీన్‌కార్డు దరఖాస్తు తర్వాతా చెల్లించాల్సిందే

హెచ్1బీ ముగిసిందంటే గుండెల్లో రైళ్లే

కంపెనీకి బరువనిపిస్తే ఉపాధికే ఎసరు

నేటి నుంచే అమల్లోకి వీసా రుసుము

విదేశాల్లో ఉన్న వాళ్లు అమెరికాకు పరుగులు

భారత్‌కు పండగల ప్రయాణాలూ రద్దు

వీసా స్టాంపింగ్‌కు వచ్చిన వాళ్లు లక్ష డాలర్లు కట్టినట్లు రుజువు చూపాల్సిందే

కంపెనీ చెల్లించకపోతే భవిత గల్లంతే

అత్యంత పనిమంతులకే అవకాశం

అమెరికా వాణిజ్య మంత్రి వ్యాఖ్య

తెలుగు రాష్ట్రాల నుంచే 35 వేల మంది

స్టూడెంట్ వీసాదారులపైనా తీవ్ర ప్రభావం

హెచ్1బీ ఇప్పటికే కష్టం.. ఇకపై అసాధ్యమే!



వాషింగ్టన్, సెప్టెంబరు 20: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతీయ ఐటీ నిపుణులపై ఆటంబాంబు పేల్చారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల మధ్య తరగతి కుటుంబాల్లో భారీ సంక్షోభం సృష్టించారు. అమెరికాలో ఐటీ, ఇతర ప్రత్యేక నైపుణ్య ఉద్యోగాలు చేయడానికి అవసరమైన హెచ్1బీ వీసాలకు కొత్తగా లక్ష డాలర్ల ఫీజును ప్రకటించారు. అంటే, దాదాపు 90 లక్షల రూపాయలు. ప్రస్తుతం హెచ్1బీ దరఖాస్తుకు చెల్లిస్తున్న రెండు వేల డాలర్ల నుంచి ఐదు వేల డాలర్ల ఫీజుకు ఇది అదనం. ప్రస్తుతం అమెరికాలో భారతీయుల సగటు వేతనమే లక్ష డాలర్లు లేదు. అలాంటి కొలువు కోసం ప్రతీ హెచ్1బీ దరఖాస్తుతో పాటు లక్ష డాలర్లు చెల్లించాల్సిందే. అదీ అభ్యర్థిని ఎంచుకుని హెచ్1బీకి స్పాన్సర్ చేస్తున్న కంపెనీయే చెల్లించాలి. లక్ష డాలర్ల ఫీజును జత చేయనిదే హెచ్1బీ దరఖాస్తును పరిశీలించరు. ఏటా లక్షడాలర్లు చెల్లిస్తేనే హెచ్1బీ బతికి ఉంటుంది. ఈ మేరకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉత్తర్వుపై

మిగతా 2వ పేజీలో...

మన అతిపెద్ద శత్రువు.. 13

ఇతర దేశాలపై ఆధారపడటమే!

ఆత్మనిర్భరతే ఏకైక పరిష్కారం

చిప్స్ నుంచి షిప్స్ వరకు స్వదేశీ ఉత్పత్తులకు పెద్దపీట వేయాల్సిందే

గుజరాత్ పర్యటనలో మోదీ

అమెరికాతో సంప్రదింపులు 2

సమస్య పరిష్కారానికి కసరత్తు

అక్కడి ఐటీ కంపెనీలూ సర్కారుతో చర్చలు జరుపుతున్నాయి: కేంద్రం

వాణిజ్య చర్చల కోసం అమెరికాకు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

మళ్లీ చెబుతున్నా.. మోదీ

బలహీన ప్రధాని!

భారతీయుల ప్రయోజనాల్ని కాపాడలేకపోతున్నారు: రాహుల్

ప్రియమిత్రుడి నుంచి మోదీకి అందిన బర్త్‌డే గిఫ్ట్: ఖర్గే

తన గొంతు తానే నులుముకుంటున్న అమెరికా 2


ఆవిష్కరణల కేంద్రంగా బెంగళూరు

హైదరాబాద్: అమితాబ్‌కాంత్

ట్రంప్ నిర్ణయం భస్మాసురహస్తం

అమెరికా చట్టసభల సభ్యులు





మోహన్‌లాల్‌కు దాదాసాహెబ్ ఫాల్కే

40 ఏళ్ల సినీ ప్రస్థానం

400కు పైగా చిత్రాల్లో నటన

2001లో పద్మశ్రీ, 2019లో పద్మభూషణ్ 14

యూరప్‌లో ప్రధాన ఎయిర్‌పోర్ట్‌లపై సైబర్ దాడి 14

చెక్-ఇన్, బోర్డింగ్ ఆలస్యం

లండన్, బెర్లిన్, బ్రసెల్స్ సహా పలుచోట్ల విమానాల ఆలస్యం

ప్రయాణికులకు ఇబ్బందులు

కోర్టు కేసుల పర్యవేక్షణకు

కేంద్రీకృత వ్యవస్థ

ప్రయోగాత్మకంగా రెవెన్యూ, హోం, విద్యాశాఖల్లో అమలు!

ఆ తర్వాత అన్ని శాఖల్లో.. 11

రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

విద్యార్థిపై గంజాయి బ్యాచ్ దాడి!

దారిలో అడ్డగించి డబ్బులివ్వాలని డిమాండ్ 11

ఇవ్వకపోవడంతో మూకుమ్మడి దాడి.. దెబ్బతిన్న ప్లీహం

పాలమూరు జిల్లాలో ఘటన

4 రోజులైనా నిందితుల్ని అరెస్టు చేయని పోలీసులు



మళ్లీ చెబుతున్నా.. మోదీ బలహీన ప్రధాని!



» రాహుల్ గాంధీ విమర్శలు

న్యూఢిల్లీ, న్యూయార్క్, సెప్టెంబరు 20: "మోదీ అత్యంత బలహీన ప్రధాని" అంటూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి విమర్శలు గుప్పించారు. హెచ్-1బీ వీసాకు లక్ష డాలర్ల రుసుము విధిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయం తీసుకున్న అనంతరం రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. 2017లో ప్రధానిని బలహీనుడు అంటూ చేసిన పోస్టునే తిరిగి 'ఎక్స్'లో రాహుల్ గాంధీ పోస్టు చేశారు. విదేశాల్లో భారతీయుల ఆకాంక్షలను నిలబెట్టలేకపోతున్నారని దుయ్యబట్టారు. దీంతోపాటు హెచ్-1బీ వీసా నిర్ణయంపై వచ్చిన కథనాన్ని ఆయన ఈ పోస్టుకు జత చేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే కూడా మోదీపై విమర్శల వర్షం కురిపించారు. "మీ ప్రియ మిత్రుడి (ట్రంప్) నుంచి అందిన పుట్టిన రోజు రిటర్న్ గిఫ్ట్ (హెచ్-1బీ వీసా రుసుము) చూశాక భారతీయులు చాలా బాధ పడ్డారు" అని ఖర్గే వ్యాఖ్యానించారు.కాగా, హెచ్-1బీ వీసాల రుసుమును లక్ష డాలర్లకు పెంచేయడంతో అమెరికా ఆవిష్కరణల రంగాన్ని స్వయంగా ఆ దేశ ప్రభుత్వమే గొంతు నొక్కినట్లైందని నీతి ఆయోగ్ మాజీ సీఈఓ అమితాబ్ కాంత్ వ్యాఖ్యానించారు. 'ప్రపంచ దేశాల్లోని ప్రతిభ తమ దేశంలోకి రాకుండా అమెరికా తలుపులు మూసుకుంది. తద్వారా వచ్చేతరం ల్యాబ్‌లు, పేటెంట్లు, ఆవిష్కరణలు, స్టార్టప్‌లను హైదరాబాద్, బెంగళూరు, పుణె, గుర్గావ్‌లకు మళ్లించింది. అమెరికా నష్టం.. భారత్‌కు లాభం' అంటూ ఎక్స్‌లో అమితాబ్ కాంత్ పోస్టు చేశారు. ట్రంప్ నిర్ణయంపై పలువురు అమెరికా చట్టసభల సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆ నిర్ణయం అత్యంత నిర్లక్ష్యపూరితమైనదని, దాని వల్ల అమెరికా ఐటీ పరిశ్రమ తీవ్రంగా దెబ్బ తింటుందని హెచ్చరించారు. అంతర్జాతీయ ప్రతిభను ఆకర్షించేందుకు ఇతర దేశాలు పోటీ పడుతున్న తరుణంలో అమెరికా వలస విధానాన్ని మరింత పటిష్ఠ పర్చాలే గానీ, బలహీన పర్చొద్దని హితవు పలికారు.

అమెరికాతో సంప్రదిస్తున్నాం: కేంద్రం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 20: హెచ్-1బీ వీసాలపై ట్రంప్ ప్రభుత్వం తాజాగా విధించిన ఆంక్షలతో అనేక కుటుంబాల మీద ప్రభావం పడుతుందని విదేశాంగశాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సమస్యపై అమెరికా అధికారులు దృష్టి పెడతారని ఆశిస్తున్నామని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. ట్రంప్ నిర్ణయం కలిగించే ప్రభావంపై అన్ని కోణాల్లో పరిశీలిస్తున్నామని, భారత పరిశ్రమలు తదితర భాగస్వామ్యపక్షాలను కూడా సంప్రదిస్తున్నామని వెల్లడించారు. కాగా.. ముందుకెళ్లే మార్గంపై అమెరికా ప్రభుత్వంతో, ఐటీ పరిశ్రమకు చెందిన ప్రతినిధులతో చర్చలు కొనసాగుతున్నాయని కేంద్రప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

వాణిజ్య చర్చల కోసం అమెరికాకు గోయల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 20: అమెరికాతో ఈ నెల 22న వాణిజ్య చర్చల నిమిత్తం కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం ఆ దేశానికి వెళ్లనుంది. పరస్పరం ప్రయోజనకరమైన వాణిజ్య ఒప్పందాన్ని వీలైనంత త్వరగా ముగించే లక్ష్యంతో చర్చలను ముందుకు తీసుకెళ్లాలని ప్రతినిధి బృందం యోచిస్తోందని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ శనివారం పేర్కొంది. చర్చల నిమిత్తం న్యూయార్క్ వెళ్లనున్న కేంద్ర మంత్రితో ప్రత్యేక కార్యదర్శి రాజేష్ అగర్వాల్, ఇతర అధికారులు ఉంటారు. ఈనెల 16న అమెరికా వాణిజ్య ప్రతినిధి కార్యాలయం నుంచి అధికారుల బృందం భారత్‌ను సందర్శించిన సందర్భంగా వివిధ అంశాలపై సానుకూల చర్చలు జరిగాయి. ఈ చర్చల కొనసాగింపుగా కేంద్ర వాణిజ్య మంత్రి నేతృత్వంలోని ప్రతినిధుల బృందం అమెరికాకు వెళ్తోంది.

హెచ్1 బాంబు!

(మొదటి పేజీ తరువాయి)



శుక్రవారం సాయంత్రం(అమెరికా కాలమానం ప్రకారం) సంతకం చేశారు. అది ఈ నెల 21 నుంచి ఏడాది పాటు అమల్లో ఉంటుంది. ఆ తర్వాత దాన్ని పొడిగించాలా? వద్దా అన్నది అప్పటికి సమీక్షించి, నిర్ణయిస్తారు. అన్నింటికన్నా ముఖ్యమైన విషయం ఇప్పటికే హెచ్1బీ వీసా పొంది అమెరికాలో ఉద్యోగం చేస్తూ వీసా రెన్యువల్ కోసం అమెరికా గడ్డను దాటి స్వదేశం వచ్చిన వాళ్లు న్యూయార్క్ కాలమానం ప్రకారం సెప్టెంబరు 20 అర్ధరాత్రి 12 గంటలు దాటిన తర్వాత అమెరికా గడ్డమీద తర్వాత అడుగు పెట్టాలంటే వాళ్లు పని చేస్తున్న కంపెనీ లక్ష డాలర్లు హెచ్1బీ వీసా ఫీజు చెల్లించాల్సిందే. లేదంటే ఇంటికి వెళ్లాల్సిందే. ఇమ్మిగ్రేషన్‌లో దాన్ని పరిశీలించి కానీ లోపలికి వదలరు. హెచ్1బీ వీసాదారుల జీవిత భాగస్వాములకు, పిల్లలకు హెచ్4 వీసా ఇస్తారు. కొత్తగా వీసా స్టాంపింగ్ చేయించుకున్న వాళ్లు సెప్టెంబరు 21 తర్వాత అమెరికా వెళ్లాలి అన్నా ఇమ్మిగ్రేషన్ వద్ద భర్త/తండ్రి పని చేస్తున్న కంపెనీ లక్ష డాలర్ల ఫీజు చెల్లించినట్లుగా ఆధారం చూపించాలి. చూపించలేకపోతే ఆపేస్తారు. వ్యాలిడ్ వీసా ఉన్నప్పటికీ కొత్త ఆదేశాల నేపథ్యంలో ఇమ్మిగ్రేషన్ వద్ద గందరగోళానికి అవకాశం ఉంటుంది కాబట్టి, చాలా కంపెనీలు తమ ఉద్యోగులను అమెరికా వదిలి వెళ్లొద్దని చెబుతున్నాయి. తాజాగా ట్రంప్ ఆదేశం వెలువడగానే 29 గంటల డెడ్‌లైన్‌ను ఉపయోగించుకొని విదేశాల్లో ఉన్న తమ ఉద్యోగులను ఏదో ఒక మార్గంలో తిరిగి వచ్చేయాలని అత్యవసర సందేశాలు పంపాయి. దాంతో విమానాశ్రయాల వద్ద రద్దీ భారీగా పెరిగింది. ఈ నేపథ్యంలో సక్రమ వీసాలు ఉన్నవారిని ఆపేది లేదని, కొత్తగా వీసా రెన్యువల్ చేసుకొని వచ్చే వాళ్లకే లక్ష డాలర్ల నిబంధన వర్తిస్తుందని అమెరికా ప్రభుత్వం వివరణ ఇచ్చింది. అమెరికాలో ఉంటున్న ఇతర దేశాల హెచ్1బీ ఉద్యోగులకు దేశంలో ఉన్నంతకాలం కొత్త ఫీజు భారం ఉండదు. మూడేళ్ల గడువు పూర్తయి హెచ్1బీ రెన్యువల్‌కు వెళితే మాత్రం మళ్లీ ఏటా లక్ష డాలర్ల ఫీజు భారం తప్పదు. హెచ్1బీ ఆరేళ్లు పూర్తయి గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వాళ్లకు కంపెనీలు హెచ్1బీ పొడిగిస్తున్నపుడు ఏటా లక్ష డాలర్ల భారం తప్పదు.

హెచ్1బీల దుర్వినియోగం

ఉత్తర్వు మీద సంతకం చేస్తూ ట్రంప్ మాట్లాడారు. హెచ్1బీలను కంపెనీలు దుర్వినియోగం చేస్తున్నాయన్నారు. తమకు గొప్ప పనివాళ్లు కావాలని, తక్కువ స్థాయి జీతాలతో పనిచేసే సామాన్య వ్యక్తుల కోసం అమెరికా ప్రజల ఉద్యోగాలను పణంగా పెడుతున్న కంపెనీలకు చెక్ చెప్పాల్సిందేనని స్పష్టం చేశారు. వాణిజ్య కార్యదర్శి హోవర్డ్ లుట్నిక్ మాట్లాడుతూ, అమెరికాలో ఏటా 2,81,000 మంది ఉద్యోగాల ద్వారా గ్రీన్‌కార్డులు పొందుతున్నారని చెప్పారు. వారి సగటు వార్షిక ఆదాయం 66,000 డాలర్లని తెలిపారు. దాంతో సాధారణ ప్రజల కన్నా వీరు ప్రభుత్వ పథకాల సహాయాన్ని అభ్యర్థించే అవకాశం ఐదు రెట్లు ఎక్కువగా ఉందని చెప్పారు. తమకు అమెరికా ఉద్యోగాలు దొంగిలించే వారికన్నా అమెరికాలో ఉద్యోగాలు సృష్టించే గొప్ప వ్యక్తులు కావాలని అన్నారు. తాజా పథకంతో అమెరికా ఖజానాకు ఏటా లక్ష కోట్ల డాలర్ల (రూ.90 లక్షల కోట్లు) ఆదాయం సమకూరుతుందన్నారు.

కంపెనీల విధానాల్లో మార్పులు

ట్రంప్ నిర్ణయం తర్వాత కంపెనీలు తన వ్యూహాలను మార్చుకుంటాయని భావిస్తున్నారు. జీతాల్లో కోతలతో లాభాలు పెంచుకోవడం లాంటి అడ్డదారుల నుంచి విరమించుకోవచ్చు. ఆటోమేషన్, విదేశాలకు పనిని అవుట్ సోర్స్ చేయడం, అమెరికన్ల నైపుణ్యాలు పెంచడం మీద దృష్టి సారించే అవకాశం ఉంది. విదేశీ నిపుణులు అమెరికాను వదిలి వేరే దేశాలను వెతుక్కుంటారని భావిస్తున్నారు. హెచ్1బీ గడువు ముగిసిన ప్రతీ ఉద్యోగి తాను కంపెనీకి అవసరమని నిరూపించుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. నిపుణులను అమెరికాకు తెచ్చుకోవడానికి హెచ్1బీ కాకుండా ఓ-1, ఈబీ-1ఏ లాంటి ప్రత్యామ్నాయ మార్గాలను కంపెనీలు చూసే అవకాశం ఉంది.

కోర్టుల్లో నిలబడుతుందా?

ట్రంప్ ఉత్తర్వు కోర్టుల ముందు నిలబడుతుందా? అన్న అనుమానం కూడా ఉంది. గత ఉత్తర్వుల లాగే దీనిపైనా కోర్టులు స్టేలు విధిస్తాయని భావిస్తున్నారు. అలాంటి ఫీజులను విధించే అధికారం కాంగ్రెస్‌కే కానీ, అమెరికా అధ్యక్షుడికి లేదని పలువురు న్యాయవాదులు వ్యాఖ్యానించారు. వీసా ఫీజులు వాటి ప్రాసెసింగ్‌కు అయ్యే ఖర్చును వసూలు చేసే విధంగా ఉండాలి కానీ దాని నుంచి లాభాలను గడించే విధంగా ఉండరాదని చెబుతున్నారు.

భారతీయుల జీతం ఎంత?

అమెరికాలో సగటు భారతీయ ఐటీ ఉద్యోగి వార్షిక వేతనం 95 వేల డాలర్లు ఉంటుంది. నివసించే ప్రాంతాన్ని బట్టి వేతనం మారుతుంది. కొత్తగా ఉద్యోగంలో చేరిన వారికి 60 వేల నుంచి 80 వేల డాలర్లు ఉంటుంది. ఐదేళ్ల సీనియారిటీ ఉన్న వాళ్లకు లక్ష డాలర్ల నుంచి లక్షన్నర డాలర్ల వరకు ఉంటుంది. ఉన్నత స్థాయి ఉద్యోగులకు రెండు లక్షల డాలర్ల వరకు ఉంటుంది. హెచ్1బీ లబ్ధిదారుల్లో 71% భారతీయులే కావడం విశేషం.

పది లక్షల డాలర్లకు 'ట్రంప్ గోల్డ్ కార్డు'

వాషింగ్టన్, సెప్టెంబరు 20: హెచ్-1బీ వీసాలపై రుసుములు భారీగా పెంచిన ట్రంప్.. విదేశీయులు అమెరికాలో శాశ్వత నివాసం పొందేందుకు మరో కొత్త పథకాన్ని అమలులోకి తెచ్చారు. అమెరికా ప్రగతికి దోహదపడే అసాధారణ ప్రతిభావంతులైన విదేశీయుల కోసమంటూ "ట్రంప్ గోల్డ్ కార్డు" అనే పథకాన్ని శనివారం ప్రారంభించారు. పది లక్షల డాలర్లు(దాదాపు రూ.9కోట్లు) అమెరికా ఖజానాకి చెల్లించిన వారికి 'ట్రంప్ గోల్డ్ కార్డు' ఇచ్చి అమెరికాలో శాశ్వతంగా నివసించే అవకాశం(గ్రీన్ కార్డు తరహాలో) కల్పిస్తామని ప్రకటించారు. అలాగే, కార్పొరేట్ల కోసం ప్రత్యేకంగా 'ట్రంప్ కార్పొరేట్ గోల్డ్ కార్డు'ను ప్రారంభించారు. 20 లక్షల డాలర్లు(దాదాపు రూ.18 కోట్లు) అమెరికా ఖజానాకు చెల్లించిన కార్పొరేట్ సంస్థలకు ఈ కార్పొరేట్ గోల్డ్ కార్డులు జారీ చేస్తారు. కార్పొరేట్ సంస్థలు ఈ కార్డు సాయంతో తమకు నచ్చిన ఓ విదేశీ ఉద్యోగిని శాశ్వత నివాసి కోటాలో అమెరికాకు పంపవచ్చు. అంతేకాక, తమ అవసరాలకు అనుగుణంగా ఆ వ్యక్తిని వెనక్కు రప్పించి ఆ స్థానంలో మరొకరిని పంపవచ్చు. ఈ బదిలీ ప్రక్రియకు కొంత రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఈ గోల్డ్ కార్డులకు దరఖాస్తులు స్వీకరణకు ప్రత్యేక వెబ్‌సైట్‌ను ప్రారంభించిన ట్రంప్.. అమెరికాకు లబ్ధి చేకూర్చే పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తల కోసమే ఈ విధానాన్ని తీసుకొచ్చినట్టు తెలిపారు. దరఖాస్తుల పరిశీలన, డీహెచ్ఎస్(డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ) పరిశీలన తర్వాత ఎంపికైన దరఖాస్తుదారులు గోల్డ్ కార్డుకు డబ్బు జమ చేయాలి. జమ చేసిన డబ్బు వెనక్కి తిరిగి ఇవ్వరు. కాగా, 50 లక్షల డాలర్లకు ఇచ్చే ట్రంప్ ప్లాటినమ్ కార్డును త్వరలో అందుబాటులోకి తెస్తామని ట్రంప్ ప్రకటించారు. ప్లాటినమ్ కార్డు కలిగిన వారు ఓ ఏడాదిలో 270 రోజుల పాటు అమెరికాలో ఉండవచ్చు.



మేము ఇంటికి వెళ్లం బాబోయ్!

» స్వదేశానికి ప్రయాణాలను రద్దు చేసుకున్న భారతీయులు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 20: హెచ్-1బీ వీసా రుసుము పెంపు పేరిట అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేల్చిన బాంబుతో అమెరికాలోని విమానాశ్రయాల్లో శుక్రవారం ఒక్కసారిగా కలకలం రేగింది. చాలా మంది తమ ప్రయాణాలను అప్పటికప్పుడు రద్దు చేసుకున్నారు. కుటుంబసభ్యులతో కలిసి దసరా, దీపావళి పండుగలు జరుపుకునేందుకు, ఇతర పనుల మీద స్వదేశానికి వచ్చే ప్రణాళికల్లో ఉన్న భారతీయులు కూడా తమ ప్రయాణాలను వెంటనే రద్దు చేసుకున్నారు. మరోపక్క, అమెరికా నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిన హెచ్-1బీ వీసాదారులు కూడా తిరిగి అమెరికాకు పరుగులు పెడుతున్నారు. హెచ్-1బీ వీసా రుసుము లక్ష డాలర్లకు పెంపు నిర్ణయం సెప్టెంబరు 21 అర్ధరాత్రి తర్వాత నుంచి అమలు కానుండడమే ఇందుకు కారణం. కాగా, శాన్‌ఫ్రాన్సిస్కో విమానాశ్రయంలో ఓ ఎమిరేట్స్ విమానంలో ఎక్కి కూర్చున్న ప్రయాణికుల్లో హెచ్-1బీ వీసాదారులు ట్రంప్ ప్రకటన తెలుసుకుని హుటాహుటిన విమానం దిగిపోయారంటూ మసూద్ రాణా అనే వ్యక్తి ఎక్స్‌లో పోస్టు చేశాడు. శాన్‌ఫ్రాన్సిస్కో విమానాశ్రయం నుంచి బయలుదేరడానికి సిద్ధంగా ఉన్న ఓ విమానంలో పెద్ద సంఖ్యలో ఉన్న భారతీయులు తాము విమానం దిగిపోతామంటూ సిబ్బందిని వేడుకోవడం తనను బాధపెట్టిందంటూ మరో వ్యక్తి ఎక్స్‌లో పోస్టు చేశారు. మరోపక్క, భారత్ నుంచి అమెరికాకు నేరుగా వెళ్లే విమాన సర్వీసుల టికెట్ల ధరలు కూడా శనివారం ఒక్కసారిగా పెరిగిపోయాయి. న్యూఢిల్లీ నుంచి న్యూయార్క్ వెళ్లే విమానంలో ఎకనమి క్లాస్ టిక్కెట్ ధర సాధారణ రోజుల్లో అటుఇటుగా రూ.37,000 వరకు ఉంటుంది. కానీ, ట్రంప్ ప్రకటన వెలువడిన రెండు గంటల తర్వాత అదే టిక్కెట్(శనివారం ప్రయాణానికి) ధర రూ.80,000కు పెరిగిపోయింది. శనివారం శంషాబాద్ విమానాశ్రయం అమెరికా ప్రయాణికులు, వారి కుటుంబసభ్యులతో కిక్కిరిసిపోయింది

ఇప్పటికే కష్టం.. ఇకపై అసాధ్యమే!

హెచ్ 1బీ వీసాలు, గ్రీన్‌కార్డుల కోసం ఇప్పటికే భారతీయుల ఇబ్బందులు..ఫీజు పెంపుతో మరింత సమస్య

న్యూఢిల్లీ, సెప్టెంబరు 20: అమెరికా హెచ్1బీ వీసాలు, గ్రీన్‌కార్డుల (శాశ్వత నివాస అనుమతి) విషయంలో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న భారతీయులకు.. భారీగా వీసా ఫీజుల పెంపు అశనిపాతంగా మారింది. అమెరికా ఏటా 85వేల హెచ్1బీ వీసాలు ఇస్తుంటే.. అందులో 70శాతానికిపైగా భారతీయ ఉద్యోగులకే దక్కుతూ వస్తున్నాయి. ఇతర దేశాల వారితో పోల్చితే మంచి నైపుణ్యం ఉండటం, తక్కువ వేతనాలకే పనిచేయడమే దీనికి కారణం. కానీ ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక పెడుతున్న నిబంధనలు, గ్రీన్‌కార్డుల కోసం పెరిగిపోయిన క్యూతో హెచ్1బీ వీసాల కోసం దరఖాస్తులు తగ్గిపోతున్నాయి. అందులోనూ భారతీయుల నుంచి దరఖాస్తులు బాగా పడిపోతున్నాయి. మొత్తంగా 2024లో 7,80,884 దరఖాస్తులురాగా.. 2025లో 4,70,342 దరఖాస్తులే వచ్చాయి. ఇక గ్రీన్‌కార్డుల కోసమైతే దశాబ్దాల పాటు ఎదురుచూడాల్సిన పరిస్థితి. హెచ్1బీ వీసాల జారీలో దేశాల వారీగా పరిమితి ఏదీ లేకపోవడంతో భారతీయులకు ఎక్కువ దక్కుతున్నా.. గ్రీన్‌కార్డులకు మాత్రం గరిష్ఠంగా ఏడు శాతం పరిమితి ఉంది. దీనితో హెచ్1బీ వీసాదారుల్లో అత్యధికంగా ఉండే భారతీయులకు గ్రీన్‌కార్డు లభించడం కష్టంగా మారింది. గ్రీన్‌కార్డుల కోసం వేచి ఉన్నవారి సంఖ్య 18 లక్షలు అయితే.. అందులో 11 లక్షల మంది భారతీయ ఉద్యోగులే. కొన్ని దేశాలకు చెందినవారు వేల మంది కూడా ఉండరు. అమెరికా ఏటా లక్షా 40వేల గ్రీన్‌కార్డులు ఇస్తుంది. అందులో గరిష్ఠంగా ఒక్కో దేశం నుంచి 9,800 మందికి మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన ఏటా 9,800 మంది భారతీయులకు గ్రీన్‌కార్డు ఇచ్చినా.. లక్ష మందికి అందేందుకే పదేళ్లు దాటిపోతుంది. మిగతా వారికి రావాలంటే దశాబ్దాలు పడుతుంది. దానికితోడు అన్నేళ్లు వాళ్లు అమెరికాలో ఉద్యోగం చేస్తూ ఉండాల్సిందే. ఇప్పుడు హెచ్1బీ వీసా ఫీజును లక్ష డాలర్ల (రూ.88 లక్షలు)కు పెంచడం పిడుగుపాటుగా మారింది.

ఆ వీసాలకూ పదేళ్ల వెయిటింగ్..

హెచ్1బీ వీసాల జారీ కంపెనీల ఆఫర్ ఆధారంగా జరుగుతుంది. అంటే ఫలానా వ్యక్తికి ఉద్యోగం ఇచ్చామని, అతడికి హెచ్1బీ వీసా ఇవ్వాలని కంపెనీలు దరఖాస్తు చేస్తాయి. అలాకాకుండా ప్రత్యేక రంగాల్లో ఉన్నతస్థాయి కోర్సులు చేసిన, నైపుణ్యమున్నవారు నేరుగా ఈబీ-2, ఈబీ-3 వీసాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. వీటి కోసం భారీగా వెయిటింగ్ ఉంది. ఇటీవల అమెరికా విదేశాంగ శాఖ విడుదల చేసిన నివేదిక ప్రకారం.. ప్రస్తుతం 2012 జనవరిలో దరఖాస్తు చేసుకున్నవారికి ఈబీ-2 వీసాలు, 2013 మేలో దరఖాస్తు చేసుకున్నవారికి ఈబీ-3 వీసాలు మంజూరు అవుతున్నాయి.

ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌తో మాజీ సీజేఐ ఎన్వీ రమణ భేటీ



న్యూఢిల్లీ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌తో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ భేటీ అయ్యారు. ఢిల్లీలోని ఉపరాష్ట్రపతి నివాసంలో ఈ సమావేశం జరిగింది. ఇటీవలి ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో విజయం సాధించినందుకు ఆయన రాధాకృష్ణన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఓ పుస్తకాన్ని కూడా బహూకరించారు.

మావోయిస్టు పోస్టర్ల కలకలం

» వార్షికోత్సవ వారోత్సవాన్ని నిర్వహించాలంటూ పిలుపు



సరిహద్దులో మావోయిస్టుల పేరిట వెలసిన పోస్టర్

చింతూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దులో ఆదివారం నుంచి ఈ నెల 27 వరకు మావోయిస్టుల వార్షికోత్సవ వారోత్సవాన్ని నిర్వహించండి అంటూ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ పేరిట శనివారం పోస్టర్లు వెలిశాయి. ఈ నేపథ్యంలో అక్కడి పోలీసులు అప్రమత్తమయ్యారు. ఓ వైపు ఇటీవల కాలంలో మావోయిస్టు అగ్ర నాయకత్వం పేరిట భిన్నాభిప్రాయాలతో కూడిన లేఖలు వెలువడటంతో ఒకింత గందరగోళం ఏర్పడింది. ఆ పోస్టర్లలో పార్టీని, పీఎల్‌జీఏను, ఐక్య సంఘటన్, విప్లవోద్యమాన్ని కాపాడుకుందామని, విప్లవ కగార్ యుద్ధాన్ని విఫలం చేసేందుకు విశాల ప్రజారాశులను వర్గ పోరాటంలో గెరిల్లా యుద్ధంలో సమీకరిద్దామని పిలుపునిచ్చారు. దీంతో మావోయిస్టు పార్టీ ప్రభావ రాష్ట్రాల్లో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది.

వ్యర్థాలతో విద్యుదుత్పత్తి చేసే ప్లాంట్లకు రూ.1.67 కోట్ల కేంద్ర సాయం

హైదరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వ్యర్థాలతో విద్యుదుత్పత్తి చేసే ప్రాజెక్టులకు భారీగా సహాయం అందించాలని కేంద్రం నిర్ణయించింది. రోజుకు రెండు టన్నుల వ్యర్థాలతో విద్యుదుత్పత్తి చేస్తూ... స్థాపిత సామర్థ్యంలో 80 శాతం మేర వ్యర్థాలను వినియోగించి, విద్యుదుత్పత్తి చేసే ప్లాంట్‌కు రూ.1.67 కోట్ల సహాయం అందనుంది. ఈ మేరకు కేంద్ర పునరుద్ధరణీయ విద్యుత్ మంత్రిత్వశాఖ శనివారం జాతీయ బయో ఎనర్జీ కార్యక్రమంలో భాగంగా మార్గదర్శకాలు జారీ చేసింది. గరిష్ఠంగా రోజుకు 33 టన్నుల వ్యర్థాలను వినియోగించి... విద్యుదుత్పత్తి చేసే ప్లాంట్‌కు రూ.10 కోట్ల దాకా కేంద్రం సహాయం అందించనుంది. దీనికోసం 24 గంటల పాటు ఉత్పత్తి చేసే డేటాను అందించాల్సి ఉంటుంది.

యోగా, ధ్యానంతో ఒత్తిడిని అధిగమించవచ్చు

» పోలీసు సిబ్బందికి డీజీపీ జితేందర్ సూచన

హైదరాబాద్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): విధినిర్వహణలో ఎదురయ్యే ఒత్తిడి, సవాళ్లను ఎదుర్కొనేందుకు పోలీసులు క్రమం తప్పకుండా యోగా, ధ్యానం చేయాలని డీజీపీ జితేందర్ సూచించారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో డీజీపీ కార్యాలయ సిబ్బందికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జితేందర్ మాట్లాడుతూ ధ్యానం ద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుందని చెప్పారు. శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపరుచుకోవడమే లక్ష్యంగా సాధన చేయాలన్నారు. ఆధునిక జీవన శైలిలో ఒత్తిడి అనివార్యం అయిందని యోగా, ధ్యానంతో ఒత్తిడి నియంత్రించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ ప్రతినిధి విశాల్ ఆర్య, అదనపు డీజీపీ అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆఫ్రికాలో అనుభవంతో ఆంధ్రాలో లిక్కర్ స్కాం

» ఆ దేశాల్లో అనిల్ రెడ్డి మద్యం వ్యాపారం

» జగన్ సోదరుడి ఇళ్లు, ఆఫీసుల్లో కీలక ఆధారాలు

» చెన్నై, మధురై, హైదరాబాద్‌లో ముగిసిన సిట్ సోదాలు

అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరిగిన వేల కోట్ల మద్యం కుంభకోణంలో రోజు రోజుకు కొత్త విషయాలు వెలుగుచూస్తున్నాయి. ఆఫ్రికాలో మద్యం వ్యాపారం చేసి, అక్కడి అనుభవాన్ని ఆంధ్రప్రదేశ్‌లో అన్న వైఎస్ జగన్‌తో సోదరుడు వైఎస్ అనిల్ రెడ్డి అమలు చేయించినట్లు సిట్ దర్యాప్తులో వెల్లడైంది. అనిల్ రెడ్డి నివాసాలు, వ్యాపార సంస్థల్లో ప్రత్యేక దర్యాప్తు బృందాలు చేపట్టిన సోదాలు శనివారం మధ్యాహ్నంతో ముగిశాయి. చెన్నై, మధురై, హైదరాబాద్‌ల్లోని 10 చోట్ల రెండ్రోజుల పాటు జరిపిన తనిఖీల్లో ఏపీ లిక్కర్ స్కామ్‌కు సంబంధించి కీలక ఆధారాలు లభించినట్లు సమాచారం. అనిల్ రెడ్డి మాజీ ముఖ్యమంత్రి జగన్ పెదనాన్న జార్జిరెడ్డి కుమారుడన్న విషయం తెలిసిందే. అన్నకు నమ్మకస్తుడిగా ఉంటూ ఆ అన్న తరఫున ఆర్థిక లావాదేవీలు నిర్వహించడం, వైసీపీ కోసం నిర్వహించే సర్వేల ఖర్చులన్నీ భరించడం, ఆ పార్టీ అభ్యర్థులకు ఎన్నికల్లో ఫండ్ సమకూర్చడం తదితర వ్యవహారాలన్నీ అనిల్ రెడ్డి చూసేవారని సిట్ సోదాల్లో స్పష్టమైంది. కాగా, ఆంధ్రప్రదేశ్‌లో 2019 నుంచి 2024వరకూ మద్యం సరఫరా చేసిన వ్యాపారుల నుంచి తీసుకున్న ముడుపులు అనిల్ రెడ్డి కంపెనీల్లోకి మళ్లినట్లు సిట్‌కు సమాచారం అందింది. ఆ సమాచారంతో అనిల్ రెడ్డి వ్యక్తిగత సహాయకుడు దేవరాజులును ఇటీవల మూడు రోజుల పాటు ప్రశ్నించింది. చిత్తూరు జిల్లాలోని శాంతిపురం మండలానికి చెందిన దేవరాజులు చెన్నైలో ఉంటూ చాలాకాలంగా అనిల్ రెడ్డి పీఏగా పనిచేస్తున్నాడు. లిక్కర్ కేసు నిందితులైన మిథున్ రెడ్డి(ఏ-4), విజయ సాయిరెడ్డి(ఏ-5), కృష్ణమోహన్ రెడ్డి(ఏ-32), ధనుంజయ్ రెడ్డి(ఏ-31)తో పాటు శాంతిపురం మండలానికి చెందిన బాలాజీ గోవిందప్ప(ఏ-33)తో తరచూ జరిపిన ఫోన్ సంభాషణ వెనుక అనిల్ రెడ్డికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలు ఉన్నట్లు స్పష్టమైన ఆధారాలు లభించాయి. దీంతో చెన్నై, హైదరాబాద్‌ల్లోని అనిల్ రెడ్డి నివాసాలు, వ్యాపార కేంద్రాలకు సంబంధించి 10 చోట్ల ఏకకాలంలో సిట్ బృందాలు సోదాలు చేశాయి. ఈ కేసులో సిట్ మొదటిసారి జగన్ రెడ్డి రక్త సంబంధీకుడి ఇల్లు, వ్యాపార సంస్థల్లో సోదాలు చేపట్టడం సంచలనం సృష్టించింది. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి చెన్నై, హైదరాబాద్‌లో మొదలైన సోదాలు శనివారం ఉదయం వరకూ కొనసాగాయి. చెన్నైలోని మైలాపూర్, టీ-నగర్, పెరుంగుడిలోని అనిల్ రెడ్డి కంపెనీలతోపాటు ఆళ్వార్‌పేట, ఇజంబాకంలోని ఆయన నివాసాల్లోనూ సిట్ అధికారులు సోదాలు జరిపారు. మధురైలోని అరక్కు కొట్టై ప్రాంతంలోని శ్రీ గోవిందరాజ మిల్స్‌లో శనివారం మధ్యాహ్నం వరకు తనిఖీలు కొనసాగాయి. వైసీపీ పాలనలో అనిల్ రెడ్డి ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన కీలక డాక్యుమెంట్లు, డిజిటల్ వివరాలు సిట్ సేకరించింది. అనిల్ రెడ్డికి చెందిన మొత్తం ఎనిమిది కంపెనీలు.. సిలోహ్ ఇన్‌ఫ్రా, ఖన్నా ఎగ్జిమ్, సిలోహ్ ఇండస్ట్రీస్, ఫోర్రైస్ ఇంపెక్స్, ఇండో రాక్స్ వర్క్స్ ఈజీ స్పేస్, శ్రీ గోవింద రాజ మిల్స్, ట్రాన్సెల్ బయోలాజిక్స్‌లో కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. మరోవైపు చెన్నైలోని రెండు నివాసాల్లో వైసీపీకి సంబంధించిన ఆర్థిక వ్యవహారాలు, అభ్యర్థులకు పంపిణీ చేసిన డబ్బుల వివరాలు, సర్వే నివేదికలకు సంబంధించిన డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. వాటన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి, డిజిటల్ ఆధారాలను ల్యాబ్‌కు పంపి నివేదికలు వచ్చిన తర్వాత మరింత ముందుకు వెళ్లే అవకాశం ఉందని తెలుస్తోంది.

127 ఖాతాల్లోంచి రూ.16 కోట్లు గాయబ్!

» 2 ఏళ్లలో నిధులను దారిమళ్లించిన బ్యాంకు ఉద్యోగి

» ఫిక్స్‌డ్, వృద్ధుల, మృతుల ఖాతాలే లక్ష్యంగా కుట్ర

» ముంబైలో ఘటన.. అహ్మదాబాద్‌లో నిందితుడి అరెస్టు

ముంబై, సెప్టెంబరు 20: అతడు మహారాష్ట్ర రాజధాని ముంబైలో బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీవోఐ) ఉద్యోగి. పేరు హితేశ్ సింగ్లా (32). తాను పనిచేస్తున్న శాఖలో ఫిక్స్‌డ్, వృద్ధులు, మృతుల, లావాదేవీలు లేకుండా స్తబ్దుగా ఉన్న ఖాతాలే లక్ష్యంగా చేసుకొని మొత్తంగా 127 అకౌంట్ల నుంచి రూ.16కోట్లు దారిమళ్లించాడు. ఆ మొత్తాన్ని రెండేళ్లలో విడతలవారీగా తన ఖాతాకు మళ్లించుకున్నాడు. 2023 మే నెల నుంచి 2024 జూలై మధ్య ఇలా దర్జాగా నిధులను మళ్లించాడు. ఉన్నతాధికారులు మోసాన్ని గుర్తించి.. పోలీసులకు ఫిర్యాదు చేసేలోపు హితేశ్ పరారయ్యాడు. గత ఆగస్టు 6న కేసును ఈడీకి అప్పగించారు. అప్పటి నుంచి అతడిని పట్టుకునేందుకు ఈడీ అధికారులు వేట కొనసాగిస్తున్నారు. అయితే ఉజ్జయిని-వెరావల్ ఎక్స్‌ప్రెస్ రైల్లో హితేశ్ ప్రయాణిస్తున్నాడని సమాచారం అందడంతో అలర్ట్ అయ్యారు. 13 గంటలపాటు అతడి కదలికలపై కన్నేశారు. నిందితుడు పోలీసులకు దొరక్కుండా ఉండేందుకు ఆ రైల్లో కోచ్‌లు, సీట్లు మారుతున్నా పకడ్బందీగా వ్యవహరించి బుధవారం తెల్లవారుజామున అహ్మదాబాద్‌లో రైల్లోనే అరెస్టు చేశారు. నిందితుడిని ముంబైలోని ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్‌ఏ) కోర్టులో ఈడీ అధికారులు హాజరుపరిచారు. దారిమళ్లించిన డబ్బులో కొంత మొత్తాన్ని హితేశ్ షేర్ మార్కెట్లో పెట్టినట్లు భావిస్తున్నారు.

రేవంత్‌కు కిషన్‌రెడ్డి ఫోబియా

'ఓట్ చోరీ' అంటూ రాహుల్ భయాందోళనల సృష్టి

కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై సీబీఐ విచారణ కోరాలి

జూబ్లీహిల్స్ ఎన్నికపై త్వరలో బీజేపీ ఎన్నికల కమిటీ

మీడియాతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



హైదరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌కు ఇప్పటికే బీజేపీ ఫోబియా ఉండగా, తాజాగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఫోబియా కూడా పట్టుకుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి రేవంత్.. కిషన్‌రెడ్డిని, కేంద్ర ప్రభుత్వాన్ని నిందిస్తున్నారని విమర్శించారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాంచందర్‌రావు మీడియాతో చిట్‌చాట్ చేశారు. బోగస్ ఓట్ల తొలగింపు బాధ్యత ఎన్నికల సంఘానిదే అని ఆయన స్పష్టం చేశారు. బోగస్ ఓట్ల సృష్టికర్త ఎంఐఎం పార్టీ అని, దానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ మద్దతు ఇస్తున్నాయని మండిపడ్డారు. దేశంలో ఓటు చోరీ అన్న అంశమే లేదని, చాలా మందికి రెండు ప్రాంతాల్లో ఓట్లు ఉన్నాయని తెలిపారు. 'ఓటు చోరీ వేరు, బోగస్ ఓట్లు వేరు. అసలు ఓటు చోరీ అన్న అంశమే ఉత్పన్నం కాదు. ఎందుకంటే, ఓటును ఎలా చోరీ చేస్తారు..? ఓటు హక్కు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. కానీ ఓటు తొలగింపు మాత్రం ఆన్‌లైన్‌లో సాధ్యం కాదని ఎన్నికల సంఘమే స్పష్టం చేసింది' అని వివరించారు. ఓటు చోరీ జరిగిందంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ దేశంలో భయాందోళనలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన నష్టానికి సంబంధించి మాత్రమే కాకుండా ఆ ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై సీబీఐ విచారణ కోరాలని రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ తర్వాత రాజకీయ నాయకులను ఎందుకు అరెస్టు చేయలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించి త్వరలో బీజేపీ ఎన్నికల కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు రాంచందర్‌రావు తెలిపారు. ఆ కమిటీయే అభ్యర్థిని ఖరారు చేస్తుందని చెప్పారు. మావోయిస్టులతో చర్చలు జరిపే ప్రసక్తేలేదని రాంచందర్‌రావు అన్నారు. ఉగ్రవాదం, వామపక్ష తీవ్రవాదం రెండూ ఒక్కటేనని స్పష్టం చేశారు. 'అప్పులు, అవినీతి, నిరుద్యోగంలో తెలంగాణ రైజింగ్' అని రాంచందర్‌రావు విమర్శించారు.

'సిందూర్'తో ఉగ్ర సంస్థల్లో భయం!

» స్థావరాలను మార్చుకుంటున్న జైషే, హిజ్బుల్

» పీవోకే నుంచి ఖైబర్ పఖ్తున్‌ఖ్వా ప్రావిన్స్‌కు..

» అఫ్ఘాన్ సరిహద్దు సమీపంలో కొత్త అడ్డా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 20: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'తో ఉగ్ర సంస్థలు తోక ముడుస్తున్నాయి. పాకిస్థాన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఉగ్రవాద సంస్థలు జైషే మహ్మద్, హిజ్బుల్ ముజాహిద్దీన్ తమ స్థావరాలను పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) నుంచి ఖైబర్ పఖ్తున్‌ఖ్వా ప్రావిన్స్‌కు మార్చుకోవడాన్ని ప్రారంభించాయని రక్షణ, సైనిక వర్గాలు వెల్లడించాయి. పీవోకే భారత్ దాడులకు తీవ్రంగా ప్రభావితయ్యే అవకాశం ఉందని భావిస్తున్న ఆ సంస్థలు.. వ్యూహాత్మకంగా భారత్ సరిహద్దుకు దూరంగా, అఫ్గానిస్థాన్ సరిహద్దుకు సమీపంలో ఉండే ఖైబర్ పఖ్తున్‌ఖ్వాకు తమ స్థావరాలను మార్చుకొనే నిర్ణయం తీసుకున్నాయని తెలిపాయి. పూర్తి అవగాహన, పాక్ ప్రభుత్వ సహకారంతోనే తాజా చర్యలు చేపట్టాయని పేర్కొన్నాయి. ఇటీవల పాకిస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో పోలీసుల రక్షణలో జేషే మహ్మద్ సమావేశాలు నిర్వహించడం, జమాయిత్ ఉలేమా ఇ-ఇస్లాం (జేయూఐ) వంటి రాజకీయ-మత సంస్థల ప్రమేయాన్ని ప్రస్తావించాయి. ఖైబర్ పఖ్తున్‌ఖ్వా ప్రావిన్స్‌లోని మన్సేహ్రా జిల్లా గర్హి హబీబుల్లా పట్టణంలో ఈనెల 14న జేషే ఒక రిక్రూట్‌మెంట్ డ్రైవ్ చేపట్టిందని పేర్కొన్నాయి. జేఈఎం, జేయూఐ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జైషే సీనియర్ నేత, మసూద్ అజార్‌కు సన్నిహితుడు ముఫ్తీ మసూద్ కాశ్మీరీ హాజరయ్యారని, ఆయన భారత వాంటెడ్ లిస్టులో ఉన్నాడని వెల్లడించాయి. ముఫ్తీ మసూద్ హాజరైన పబ్లిక్ ర్యాలీకి ఆయుధాలతో జేఈఎం క్యాడర్, స్థానిక పోలీసులు రక్షణ కల్పించారని, ఇది జైషే మహ్మద్‌కు పాక్ ప్రభుత్వ మద్దతును ప్రస్ఫుటం చేస్తోందని రక్షణ వర్గాలు తెలిపాయి.

ఆంక్షల కారణంగా 'జైషే' పేరు మార్పు!

ఆంక్షల కారణంగా నిధుల సేకరణలో ఇబ్బందులు కారణంగా నిషేధిత ఉగ్ర సంస్థ జైషే మహ్మద్ తన పేరును పాకిస్థాన్ వరకు 'అల్-మురాబితున్'గా మార్చుకోనుందని నిఘా వర్గాలు వెల్లడించాయి. 'అల్-మురాబితున్' అంటే అరబిక్‌లో 'ఇస్లాం రక్షకులు' అని అర్థం. వచ్చే వారం నిర్వహించనున్న జైషే వ్యవస్థాపకుడు మసూద్ అజార్ సోదరుడు యూసఫ్ అజార్ స్మారక కార్యక్రమం సందర్భంగా ఈ పేరును ఉపయోగించనున్నట్లు తెలిపాయి. 2001లో భారత్ పార్లమెంట్‌పై దాడి, 26/11 ముంబై దాడులు, జమ్మూకశ్మీర్‌లోని ఉరీ, పుల్వామాలో సైన్యంపై దాడులకు బాధ్యత వహించిన ఈ గ్రూపు.. ఆంక్షల కారణంగా నిధుల సేకరణ ఎదురవుతున్న ఇబ్బందుల కారణంగా 'జైషే మహ్మద్' పేరు నుంచి సంబంధం వదులుకోవాలని భావిస్తున్నట్లు తెలిపాయి. అయితే ఈ పేరు మార్పు అనేది కేవలం దాని పాకిస్థాన్‌లోని కార్యకలాపాలకు మాత్రమే ఉంటుందని భావిస్తున్నారు. కాగా, ఆపరేషన్ సిందూర్ దాడుల్లో మరణించిన మసూద్ అజార్ సోదరుడు యూసఫ్ అజార్ స్మారక కార్యక్రమాన్ని ఈనెల 25న నిర్వహించేందుకు జైషే మహ్మద్ ప్లాన్ చేసిందని నిఘా వర్గాలు వెల్లడించాయి. పెషావర్‌లో జరిగే ఈ కార్యక్రమానికి జైషే సీనియర్ కమాండర్లు, సభ్యులు హాజరుకానున్నారు.



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతిపత్రం ఇస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

ఎంబీబీఎస్, బీడీఎస్ కౌన్సెలింగ్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం

» జీఓ 550 ప్రకారం అడ్మిషన్లు చేపట్టాలి

» డిప్యూటీ సీఎం భట్టికి ఆర్.కృష్ణయ్య వినతి

రాంనగర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎంబీబీఎస్, బీడీఎస్ కౌన్సెలింగ్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లలో అన్యాయం జరుగుతోందని, దీనిపై చర్యలు తీసుకోవాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య కోరారు. ఈమేరకు శనివారం బీసీ సంఘాల ప్రతినిధులతో కలిసి ఆయన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ జీవో నంబర్ 550ను అధికారులు సక్రమంగా అమలు చేయడంలేదన్నారు. దీంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఏటా 200 నుంచి 300 వరకు ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లను కోల్పోతున్నారన్నారు. మెరిట్ వచ్చి ఓపెన్ కాంపిటీషన్‌లో వచ్చిన అభ్యర్థులను రిజర్వేషన్లలో చేర్చి ఆ వర్గాలకు రావాల్సిన కోటాను తగ్గిస్తున్నారని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం జీవో నంబర్ 500ను 2004లో జారీ చేసి అమలు చేశారన్నారు. 2021 నుంచి ఆ జీవో పక్కనపెట్టి కొత్త జీవో 144 తెచ్చి కాలేజీ ఆప్షన్ పేరు మీద బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అన్యాయం జరుగుతోందన్నారు. జీవో 550 ప్రకారం ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్లు చేపట్టాలని కోరారు. స్పందించిన డిప్యూటీ సీఎం జీవో 550 అమలుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.

సీపీఐలో 75ఏళ్ల వయోపరిమితి!

» ఈ అంశంపై జాతీయ మహాసభల్లో చర్చిస్తాం: సీపీఐ నేత నారాయణ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): సీపీఐలో 75ఏళ్ల వయోపరిమితి, యువత భాగస్వామ్యాన్ని పెంచడంపై పార్టీ జాతీయ మహాసభల్లో చర్చిస్తామని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ చెప్పారు. దేశ యువత రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. పొరుగు దేశాలైన నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంకలో అవినీతి, నిరుద్యోగం పెరగడంతో అక్కడి యువత ప్రభుత్వాలపై తిరుగుబాటు చేసి పడగొట్టారని గుర్తు చేశారు. శనివారం, తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నారాయణ మాట్లాడారు. సీపీఐ జాతీయ మహాసభలు చండీగఢ్‌లో ఆదివారం నుంచి ప్రారంభం అవుతాయని, ఐదు రోజుల పాటు జరుగుతాయని చెప్పారు. 11 ఏళ్లుగా బీజేపీ దేశంలో నీచ రాజకీయాలకు పాల్పడుతోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్డీయే ప్రభుత్వం దేశంలోని అన్ని వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకొందని ఆరోపించారు. అదానీ గ్రూప్‌కి సెబీ క్లీన్‌చిట్ ఇవ్వడమే ఇందుకు నిదర్శనమన్నారు.

ముంబై నుంచి థాయ్‌లాండ్ వెళుతున్న విమానానికి బాంబు బెదిరింపు రావడంతో అత్యవసరంగా చెన్నైలో దింపారు. 176 మంది ప్రయాణికులతో శుక్రవారం బయలుదేరిన ఈ విమానంలో బాంబు లు పెట్టామని, ఆగంతుకుడు ముంబై విమానాశ్రయ అధికారులకు ఫోన్ చేశాడు. అప్రమత్తమైన అధికారులు చెన్నైలో అత్యవసరంగా దింపి, తనిఖీ చేయించారు. అందులో బాంబు లేదని తేల్చారు. ఈ వ్యవహారంలో ఇద్దరు యువకులను అరెస్టు చేశారు.

ఇజ్రాయెల్‌కు అమెరికా మరోసారి భారీ సాయం!

52వేల కోట్ల ఆయుధాల విక్రయానికి ట్రంప్ యోచన

వాషింగ్టన్, సెప్టెంబర్ 20: ఇజ్రాయెల్‌కు ఆరు బిలియన్ డాలర్ల విలువైన ఆయుధాలను విక్రయించేందుకు ట్రంప్ ప్రభుత్వం కాంగ్రెస్‌కు(పార్లమెంట్) ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. ఇందులో 30 ఏహెచ్-64 అపాచీ హెలికాప్టర్లు, మందు గుండు సామగ్రి, యుద్ధ వాహనాలు ఉన్నాయి. ఈ మేరకు వాల్‌స్ట్రీట్ జర్నల్ ఓ కథనాన్ని ప్రచురించింది. అయితే, ఈ ఆయుధాలన్నీ ఇజ్రాయెల్‌కు అప్పగించేందుకు 2-3 సంవత్సరాలు పట్టనున్నట్లు సమాచారం. గాజాపై ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో ఆయుధాల కొనుగోళ్లు నిలిపివేయాలంటూ ఇజ్రాయెల్‌పై అంతర్జాతీయ ఒత్తిడి కొనసాగుతోంది. యూకే, టర్కీ, ఇటలీ దేశాలు ఇప్పటికే ఆ దేశ చర్యలపై అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. ఆయుధాల ఒప్పందంపై అమెరికన్ డెమొక్రటిక్ పార్టీ సెనేటర్లు కూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇలా, అంతర్జాతీయంగా ఒంటరితనాన్ని ఎదుర్కొంటున్న ఇజ్రాయెల్‌కు అగ్రరాజ్యం అమెరికా మాత్రం తమ మద్దతు కొనసాగిస్తోంది. ట్రంప్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆ దేశానికి 12 బిలియన్ డాలర్ల విలువైన మిలిటరీ సాయాన్ని ప్రకటించారు. తాజాగా, జూన్‌లో మరో 500 మిలియన్ల విలువ గల ఆయుధ సరఫరాకు ఆమోదం తెలిపారు. అయితే, ఈ అంశంపై స్పందించడానికి అమెరికా విదేశాంగ శాఖ నిరాకరించింది.

భారత్, కెనడా సంబంధాల్లో కొత్త అధ్యాయం

భద్రతా సలహాదారుల భేటీపై విదేశాంగశాఖ ప్రకటన

న్యూఢిల్లీ, సెప్టెంబరు 20: అంతర్జాతీయ నేరాలు, ఉగ్రవాదంపై పోరు సహా ద్వైపాక్షిక సంబంధాల్లో కొత్త అధ్యాయం దిశగా సమష్టి వైఖరిని అవలంబించేందుకు భారత్, కెనడా అంగీకరించాయని విదేశాంగ మంత్రిత్వశాఖ తెలిపింది. 2023లో సిక్కు వేర్పాటువాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య అనంతరం ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాల్లో ఏర్పడిన కలతలను సరిదిద్దే లక్ష్యంతో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దొబాల్, కెనడా భద్రతా సలహాదారు నతాలీ డ్రోయిన్ గురువారం ఢిల్లీలో విస్తృతస్థాయి చర్చలు జరిపారు. ఆ చర్చల ఫలితాలను విదేశాంగ మంత్రిత్వశాఖ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. 'ద్వైపాక్షిక సంబంధాల్లో కొత్త అధ్యాయం దిశగా సమష్టి వైఖరి అవలంబించాలని ఇరుపక్షాలూ అంగీకరించాయి' అని తెలిపింది. కాగా, జూన్‌లో జీ7 సదస్సు సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కెనడా ప్రధాని మార్క్ కార్నీతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఇరుదేశాల సంబంధాల్లో స్థిరత్వాన్ని పునరుద్ధరించేందుకు నిర్మాణాత్మకంగా అడుగులు వేయాలని ఇరువురు ప్రధానులు అంగీకరించారు. ఆ చర్చల కొనసాగింపులో భాగంగానే తాజాగా దొబాల్, నతాలీ సమావేశమయ్యారని విదేశాంగశాఖ తెలిపింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ఆర్కే RK

కేసీఆర్ అయినా, నేడు రేవంత్ రెడ్డి అయినా తమ సొంత ఆస్తులు అమ్మి పథకాలను అమలుచేయడం లేదు – చేయరు! ఈ ఇరువురు కూడా అప్పులు చేసి పథకాలను అమలు చేయాల్సిందే. అప్పు దొరికితే సరేసరి, లేనప్పుడే తంటా అంతా! గత కొన్నేళ్లుగా అమలవుతున్న పథకాలను తమ హక్కుగా ప్రజలు భావిస్తున్నారు. అందుకే సంక్షేమ పథకాలు అమలు చేసినంత మాత్రాన అధికారం నిలబెట్టుకోవచ్చునని అనుకోవడానికి లేదు. అయినా రేసులో వెనుకబడి పోకూడదని రాజకీయ పార్టీలు పోటీ పడుతున్నాయి. అప్పు చేసి పప్పు కూడు తింటున్నామా? అంటే అది కూడా లేదు! ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు ఏమాత్రం మెరుగుపడ్డం లేదు. రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. కర్ణాటకలో రోడ్లు గుంతల మయంగా ఉన్నాయని, అవి మెరుగుపడే అవకాశం కూడా కనపడటం లేదని, అంచేత తాము మరో రాష్ట్రానికి తరలిపోవాలని ఆలోచిస్తున్నట్టు 'బ్లాక్ బక్' కంపెనీ వ్యాఖ్యానించింది. కర్ణాటకకు అయినా, తెలంగాణకు అయినా, ఆంధ్రప్రదేశ్‌కు అయినా ఇంతకన్నా తలవంపు ఏమి ఉంటుంది?

సంక్షేమమా... సంక్షోభమా?

'మింగ మెతుకు లేదు– మీసాలకు సంపెంగ నూనె' అన్నది ఒక సామెత! ప్రస్తుతం ఉభయ తెలుగు రాష్ట్రాల పరిస్థితికి ఈ సామెత అచ్చుగుద్దినట్టు సరిపోతుంది. అప్పు చేయనిదే పూట గడవని పరిస్థితి ఉన్నప్పటికీ రెండు రాష్ట్రాల ప్రభుత్వాల మాటలు మాత్రం కోటలు దాటుతున్నాయి. తెలుగు రాష్ట్రాలకు ఈ దుస్థితి ఎందుకు వచ్చింది? ఇందుకు ఎవరు కారణం? 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు తెలంగాణ ధనిక రాష్ట్రమని, రాష్ట్రం రెవెన్యూ మిగులులో ఉందని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. అదే సమయంలో విభజిత ఆంధ్రప్రదేశ్ రూ.20 వేల కోట్లకు పైగా రెవెన్యూ లోటుతో ఏర్పడింది. 11 ఏళ్లు గడిచేసరికి ధనిక రాష్ట్రమైన తెలంగాణ కూడా అప్పుల కుప్పగా మారింది. అప్పు కోసం వెళితే దొంగను చూసినట్టు చూస్తున్నారని ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసలు వాస్తవాన్ని బయటపెట్టారు. అంతే, తెలంగాణ పరువు తీస్తావా? అని భారత రాష్ట్ర సమితి నాయకులు ఆయనపై విరుచుకుపడ్డారు. ఇక ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే... ఆ రాష్ట్ర పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్టుగా ఉంది. రాష్ట్రం అప్పులు పది లక్షల కోట్లు దాటాయి. అటు ధనిక రాష్ట్రం, ఇటు రెవెన్యూ లోటుతో ఏర్పడిన రాష్ట్రం కూడా కుదేలవడానికి కారణం ఏమిటి? రాజకీయ పార్టీలు బాధ్యతను విస్మరించి అధికారం కోసం పోటీపడుతూ... అపర దానకర్ణుల వలె ప్రజాధనాన్ని పప్పూ బెల్లాల్లా పంచిపెట్టడానికి పోటీపడటంతో రెండు రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి. సంక్షేమ పథకాలకు కూడా అప్పులు చేయవలసి వస్తోంది. ప్రభుత్వ ఆస్తులను కుదువ పెట్టడమే కాకుండా, భవిష్యత్ ఆదాయాలను కూడా తాకట్టు పెట్టి అప్పులు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయడం వల్లనే తెలుగు నాట ప్రస్తుత దుస్థితి దాపురించింది. ఏదో ఒక రాజకీయ పార్టీ అధికారంలోకి రావడం కోసం లేదా ఎవరో ఒకరు ముఖ్యమంత్రి కావడం కోసం సంక్షేమం పేరిట అలవి కాని పథకాలను ప్రకటిస్తూ తెలుగు రాష్ట్రాలను దివాలా తీయిస్తున్నారు. కొంతమేరకు భారతీయ జనతా పార్టీని మినహాయిస్తే, మిగతా ప్రధాన రాజకీయ పార్టీలన్నింటికీ ఈ పాపంలో భాగం ఉంది. వివిధ ప్రభుత్వ శాఖలలో చేపట్టిన పనులకు చెల్లించాల్సిన బకాయిలు ఒక్కో రాష్ట్రంలో లక్ష కోట్లు దాటాయి. చివరికి పరిస్థితి ఎంతవరకూ వెళ్లిందంటే, నిర్దిష్టంగా నిధుల లభ్యత ఉన్న పనులకు మినహా మిగతా పనులు చేపట్టడానికి ప్రభుత్వాలు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. దీంతో ప్రజలకు మౌలిక సదుపాయాలు కరువై అల్లాడుతున్నారు. ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందని తెలిసి కూడా కొత్త పథకాల ప్రకటనలో రాజకీయ పార్టీలు తగ్గేదేలే అన్నట్టుగా పోటీ పడుతున్నాయి.

తెలంగాణ తీరు ఇలా...

11 ఏళ్ల క్రితం నిజంగానే రెవెన్యూ మిగులుతో ధనిక రాష్ట్రంగా ఉండిన తెలంగాణలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కేసీఆర్ అనేక సరికొత్త సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి అమలు చేశారు. దీంతో అభివృద్ధి పనులకు అప్పులు చేయాల్సిన పరిస్థితిలోకి తెలంగాణ వెళ్లింది. ఎన్నికల్లో ప్రయోజనం పొందడమే పరమావధిగా సంక్షేమ పథకాలను జనంలోకి వదిలారు. హుజూరాబాద్‌కు జరిగిన ఉప ఎన్నికలో ఈటల రాజేందర్‌ను ఓడించేందుకు కేసీఆర్ 'దళితబంధు' పథకానికి రూపకల్పన చేశారు. ఈ పథకం కింద ఎంపిక చేసిన దళిత కుటుంబాలకు పది లక్షల రూపాయల వంతున పంచిపెట్టారు. అయినా ఆ ఉప ఎన్నికలో అధికార బీఆర్ఎస్ ఓడిపోయి ఈటల రాజేందర్ గెలిచారు. ఆ తర్వాత 'దళిత బంధు' పథకం కూడా అటకెక్కింది. దళితులకేనా 'బంధు'... మాకివ్వరా? అని మిగతా వర్గాల ప్రజలు అలకబూనారు. దీంతో కేసీఆర్ పరిస్థితి ఉభయ భ్రష్టత్వం అయింది. అభివృద్ధి పనులకు అవసరమైన నిధుల కోసం హైదరాబాద్‌లోని ప్రభుత్వ భూములను కూడా ఎడా పెడా అమ్మేశారు. అయినా రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతూనే ఉంది. ఈ దశలో ఎన్నికలు రావడం, ఎలాగైనా అధికారంలోకి రావాలన్న పట్టుదలతో కాంగ్రెస్ పార్టీ కూడా గ్యారెంటీల పేరుతో సరికొత్త హామీలు ఇచ్చింది. కారణాలు ఏమైనా, 2023 ఎన్నికల్లో కేసీఆర్ పార్టీ ఓడిపోయి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్నాక రేవంత్ రెడ్డికి తత్వం బోధపడటం మొదలైంది. రైతు రుణ మాఫీ కోసం దాదాపు పాతిక వేల కోట్ల రూపాయలు పంచిపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ ప్రయోజనం పొందకపోగా... కేసీఆర్ ప్రారంభించిన పథకాలకు నిధులు సమకూర్చలేక గుడ్లు తేలేసింది. దీంతో ప్రభుత్వం అప్పుల వేటకు బయలుదేరింది.

ఏపీలో ఆపసోపాలు...

తోటి వాడు తొడ కోసుకుంటే తాను మెడ కోసుకున్నట్టుగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా సంక్షేమ పథకాల జాతరకు తెర లేపారు. అప్పట్లో ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణలో ప్రారంభమైన అనేక పథకాలను ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమలు చేసేందుకు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఆపసోపాలు పడ్డారు. మొత్తానికి ముక్కుతూ మూలుగుతూ ఐదేళ్ల కాలం పూర్తయింది. ఎన్నికలు వచ్చి పడటంతో వృద్ధాప్య పింఛన్లను చంద్రబాబు రెండు వేలకు పెంచారు. అంతటితో ఆగకుండా 'పసుపు కుంకుమ' పేరిట డ్వాక్రా మహిళలకు పదివేల రూపాయల వంతున పంచిపెట్టారు. చంద్రబాబు అధికారం కోల్పోకుండా ఇలాంటి పథకాలు అడ్డుకోలేక పోయాయి. 2014లో తాము అధికారంలోకి వచ్చి నట్టేనన్న అతి విశ్వాసంతో ఉండి బోర్లాపడిన జగన్మోహన్ రెడ్డి... 2019 ఎన్నికల్లో మాత్రం చాన్స్ మిస్ కాకూడదని భావించి 'నవరత్నాలు' పేరిట సరికొత్త పథకాలను ప్రకటించారు. అనూహ్యంగా 151 సీట్లతో అధికారంలోకి వచ్చారు. ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి ఆయన ఎన్నో పిల్లిమొగ్గలు వేశారు. ఐదేళ్లలో సంక్షేమ పథకాల పేరిట దాదాపు రెండున్నర లక్షల కోట్లు పంచారు. ఈ డబ్బు సమకూర్చుకునేందుకు భవిష్యత్తులో వచ్చే ప్రభుత్వ ఆదాయాన్ని తాకట్టు పెట్టారు. ప్రభుత్వ ఆస్తులను, కార్యాలయాలను కూడా కుదువ పెట్టి అప్పు చేశారు. తన చేతికి ఎముక లేదని, తాను పేదల పెన్నిధినని, అపర దానకర్ణుడినని చెప్పుకొచ్చారు. ఐదేళ్లు గడచిపోయాయి. అన్ని సంక్షేమ పథకాలు అమలు చేసినా, బటన్లు నొక్కినా 2024 ఎన్నికల్లో జగన్‌రెడ్డికి 11 సీట్లు మాత్రమే వచ్చాయి. తెలంగాణలో కేసీఆర్‌ను గానీ, ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌రెడ్డిని గానీ సంక్షేమ పథకాలు కాపాడలేదు. ఈ వాస్తవాన్ని విస్మరించిన ఆంధ్రప్రదేశ్ ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2024లో 'సూపర్ సిక్స్' పేరిట సరికొత్త హామీలు ఇచ్చారు. 'అమ్మ ఒడి' స్థానంలో తీసుకు వచ్చిన 'తల్లికి వందనం' పథకం కింద ఒక కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ సాలీనా 15 వేల రూపాయల వంతున పంచుతామని ప్రకటించారు. వృద్ధాప్య పెన్షన్ల మొత్తాన్ని ఏకంగా నాలుగు వేలకు పెంచారు. దేశంలో మరే రాష్ట్రంలో కూడా, ఆర్థికంగా అంతో ఇంతో పటిష్ఠంగా ఉన్న తమిళనాడులో కూడా పెన్షన్లు నాలుగు వేలు లేవు. ఇదే కాకుండా మహిళలకు ఏటా 15 వేల వంతున ఇస్తామన్నారు. ఇది ఇంకా అమలు కాలేదు. అమలు అవుతుందన్న గ్యారెంటీ కూడా లేదు. సూపర్ సిక్స్‌లో మిగతా వాటిని ముక్కీ మూలిగి అమలు చేస్తున్నారు. ఆటో డ్రైవర్లకు ఏటా 15 వేల వంతున పంచుతామంటున్నారు. జగన్‌రెడ్డి లిక్కర్ భవిష్యత్ ఆదాయాన్ని కుదువపెట్టగా, చంద్రబాబు అదే బాటలో గనుల ఆదాయాన్ని కుదువపెట్టారు. తమాషా ఏమిటంటే, కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెడుతున్నారని కాంగ్రెస్ పార్టీ ఆరోపించగా, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తోందని బీఆర్ఎస్ విమర్శిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా నాడు జగన్మోహన్ రెడ్డి పది లక్షల కోట్లు అప్పులు చేశారని తెలుగుదేశం పార్టీ విమర్శించగా, ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేస్తున్న అప్పులు చూసి జగన్ అండ్ కో గుండెలు బాదుకుంటున్నారు. ప్రభుత్వాలకు ఆదాయం ఇబ్బడి ముబ్బడిగా పెరిగి నిధులు మూలుగుతుంటే ప్రజలకు పంచిపెట్టడంలో తప్పు లేదు. అభివృద్ధి చెందిన కొన్ని దేశాలలో పన్ను చెల్లింపుదారులు సీనియర్ సిటిజన్లయ్యాక వారు చెల్లించిన సొమ్ములో కొంత మొత్తాన్ని వృద్ధాప్యంలో పెన్షన్ రూపంలో తిరిగి చెల్లిస్తారు. మన దేశంలో ఈ వెసులుబాటు లేదు. ఏదైనా కంపెనీ లాభాలు గడిస్తే పన్నులు చెల్లిస్తూనే ఉండాలి. అదే కంపెనీ కర్మకాలి నష్టాల్లోకి వెళితే ప్రభుత్వాలు గానీ, ఆర్థిక సంస్థలు గానీ ముఖం కూడా చూడవు. వ్యక్తిగతంగా ఆదాయపు పన్ను చెల్లించిన వారిని కూడా వృద్ధాప్యంలో ప్రభుత్వాలు ఆదుకోవు. పన్ను చెల్లింపుదారుల జాబితాలో ఉన్నందువల్ల ప్రభుత్వాలు అమలు చేస్తున్న పెన్షన్ వంటి సంక్షేమ పథకాలు కూడా వారికి వర్తించవు.

> **ఒక్కొక్కరికి వంద– రెండు వందలతో మొదలైన పంపకం ఇప్పుడు వేలకు చేరింది. గతంలో పేదలకు మాత్రమే డబ్బు పంచేవారు. ఇప్పుడు మొత్తం ఓటర్లకు పంచాల్సి వస్తోందట! అనేక చోట్ల భూస్వాములు, వ్యాపారులు, ఇతర ధనవంతులు, ప్రభుత్వ అధికారులు కూడా సిగ్గు లేకుండా డబ్బు తీసుకుంటున్నారు.**

రేషన్ బియ్యమే దిక్కా?

ఇప్పుడు మళ్లీ తెలుగు రాష్ట్రాల విషయానికి వద్దాం! ఇటు తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపథంలో దూసుకుపోతున్నాయని ఆయా ప్రభుత్వాలు ప్రకటిస్తున్నాయి. అలాంటప్పుడు పేదరికం తొలగిపోవాలి కదా? అయితే మన రాజకీయ పార్టీల స్వార్థం వల్ల పేదల సంఖ్య కూడా ఎప్పటికప్పుడు పెరుగుతోంది. ఎన్టీఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ), ఫీజు చెల్లింపు వంటి పథకాలకు తెల్ల రేషన్ కార్డుతో ముడిపెట్టడం ప్రభుత్వాలు చేస్తున్న అతి పెద్ద తప్పిదం. ఈ కారణంగా ప్రభుత్వ ఉద్యోగులు మినహా మిగతా వారందరూ తెల్ల రేషన్ కార్డులు సొంతం చేసుకుంటున్నారు. ఆహార భద్రత కార్డులు పొందడానికి కేంద్ర ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలను రెండు తెలుగు రాష్ట్రాలలో అమలు చేయడం లేదు.



తెలంగాణ జనాభా మూడున్నర కోట్లు కాగా ఆహార భద్రతా కార్డులు, అంటే తెల్ల రేషన్ కార్డుల వల్ల లబ్ధి పొందుతున్న వారి సంఖ్య 3 కోట్ల 25 లక్షలు. ఇప్పుడు తెలంగాణలో 1,01,22,324 తెల్ల కార్డులు ఉన్నాయి. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మరో రెండున్నర లక్షల కార్డులు జారీ చేయబోతున్నది. దీంతో తెల్ల రేషన్ కార్డుల లబ్ధిదారుల సంఖ్య 3 కోట్ల 35 లక్షలకు పెరుగుతుంది. అంటే, రాష్ట్రంలో 15 లక్షల మంది మాత్రమే దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్నట్టా? ప్రభుత్వ ఉద్యోగులే పది లక్షల మంది ఉన్నారు కదా? రాష్ట్రంలో కార్ల సంఖ్య 25 లక్షలకు పైగా ఉంది. కాంట్రాక్టర్లు, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు, ఆదాయపు పన్ను చెల్లిస్తున్న ప్రైవేటు ఉద్యోగులు, వివిధ వృత్తుల్లో స్థిరపడిన వారి మాటేమిటి? ఒక్క మాటలో చెప్పాలంటే 15 లక్షల మందిని తీసేస్తే మిగతా ప్రజలంతా దారిద్ర్యంలో ఉన్నట్టే! ఇంతకంటే దారుణం ఉంటుందా? తెలంగాణలో తెల్ల రేషన్ కార్డుల లబ్ధిదారులకు కిలో రూపాయి వంతున పంపిణీ చేస్తున్న సన్నబియ్యం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై సాలీనా దాదాపు 15 వేల కోట్ల రూపాయల భారం పడుతోంది. 1983లో కిలో రెండు రూపాయలకు బియ్యం పథకాన్ని ఎన్టీఆర్ ప్రవేశపెట్టినప్పుడు సంక్షేమ రంగంలో అదొక విప్లవంగా చెప్పుకొన్నారు. నాలుగు దశాబ్దాల తర్వాత కిలో బియ్యం రూపాయికే ఇవ్వడం సంక్షేమం అవుతుందా? రాజకీయ పార్టీల బాధ్యతారాహిత్యం అవుతుందా? ఈ అరాచక ధోరణుల వల్లనే తెలుగు రాష్ట్రాలు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోవడం నిజం కాదా? ఇక... ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 1 కోటి 70 లక్షల కుటుంబాలు ఉండగా, అందులో 1 కోటి 45 లక్షల కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. ఈ రాష్ట్రంలో కూడా బియ్యంపై ఏటా 15 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నారు. తమాషా ఏమిటంటే, రాష్ట్రంలో మొబైల్ కనెక్షన్ల సంఖ్య 8 కోట్ల 20 లక్షలు. ద్విచక్ర వాహనాల సంఖ్య 1 కోటి 22 లక్షలకు పైగా ఉంది. రాష్ట్ర తలసరి ఆదాయం 2 లక్షల 66 వేలు అని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తోంది. ఆదాయపు పన్ను చెల్లిస్తున్న వారి సంఖ్య దాదాపు 40 లక్షల వరకు ఉంది. అన్ని రకాల సంక్షేమ పథకాలకు తెల్ల రేషన్ కార్డుతో ముడిపెట్టడం వల్లనే వాటి కోసం జనం ఎగబడుతున్నారు. ఈ కార్డు కింద పంపిణీ చేస్తున్న బియ్యం రీ సైకిల్ అవుతున్న విషయం బహిరంగ రహస్యం. కుటుంబాల సంఖ్యను మించి తెల్ల రేషన్ కార్డులు ఉంటున్నాయని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ వంటి వారు పలు సందర్భాలలో చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా ఈ విషయం తెలుసు. అయితే, తెల్ల రేషన్ కార్డుల ఏరివేతకు పూనుకుంటే రాజకీయంగా మూల్యం చెల్లించ వలసి వస్తుందని ఏ రాజకీయ పార్టీ కూడా అందుకు సాహసించడం లేదు. రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉండి వుంటే, పోతే పోనీలే ప్రజలే కదా లబ్ధి పొందుతున్నది అని సరిపెట్టుకోవచ్చు. కానీ... ఆ పరిస్థితి లేదు కదా!

విద్య, వైద్యం ముఖ్యం కాదా...

ప్రైవేటు విద్యా సంస్థలలో చదువుకుంటున్న విద్యార్థులకు ఫీజుల చెల్లింపు పథకం కింద ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు వేల కోట్లకు చేరుతున్నాయి. ఎన్టీఆర్ వైద్య సేవ (ఆరోగ్యశ్రీ) పథకం కింద ప్రైవేటు ఆస్పత్రులకు చెల్లించాల్సిన బకాయిలు వేల కోట్లలో పేరుకుపోతున్నాయి. దాదాపు రెండు దశాబ్దాలుగా అమలులో ఉన్న ఈ రెండు పథకాలకు అవసరమైన నిధులు సమకూర్చకుండా మరింత ఆర్థిక భారం పడే కొత్త పథకాల అమలుకు పూనుకొనే అధికారం రాజకీయ పార్టీలకు ఎవరిచ్చారు? విద్య, వైద్యం విషయంలో అనేక దేశాలలో ప్రభుత్వాలే ఖర్చు భరిస్తుంటాయి. అయితే, అందులో అనేక పరిమితులు ఉన్నాయి. మన దేశంలో, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలలో అర్హత లేకపోయినా అన్ని పథకాలనూ అందరికీ అందిస్తున్నారు. ఇంజనీరింగ్ విద్యనే తీసుకుందాం. ప్రభుత్వమే ఫీజు చెల్లిస్తోంది కదా అని తగిన అర్హతలు లేని వారు కూడా ఇంజనీరింగ్ కళాశాలల్లో చేరుతున్నారు. వీళ్లు రేపటి నిరుద్యోగులుగా మిగులుతున్నారు. మన దేశంలోనే కాదు, తెలుగునాట కూడా ఒకప్పుడు సిద్ధాంత ప్రాతిపదికన ఎన్నికలు జరిగేవి. ఆ తర్వాత తాము అధికారంలోకి వస్తే ఫలానా అభివృద్ధి పథకం ప్రారంభిస్తామని హామీ ఇచ్చేవారు. ఆ తర్వాత కాలంలో ప్రజలకు డబ్బు పంచడం మొదలైంది. ఇప్పుడది ఆ దశ దాటి ప్రభుత్వ సొమ్ము, అంటే ప్రజల నుంచి ముక్కు పిండి వసూలు చేస్తున్న సొమ్మును సంక్షేమం పేరిట పంచుతామని చెప్పి ఎన్నికల్లో పోటీచేస్తున్నారు.

> **ఇప్పుడు తెలంగాణలో 1,01,22,324 తెల్ల కార్డులు ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం మరో రెండున్నర లక్షల కార్డులు జారీ చేయబోతున్నది. దీంతో తెల్ల రేషన్ కార్డుల లబ్ధిదారుల సంఖ్య 3 కోట్ల 35 లక్షలకు పెరుగుతుంది. అంటే, రాష్ట్రంలో 15 లక్షల మంది మాత్రమే దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్నట్టా? ప్రభుత్వ ఉద్యోగులే పది లక్షల మంది ఉన్నారు కదా? రాష్ట్రంలో కార్ల సంఖ్య 25 లక్షలకు పైగా ఉంది. కాంట్రాక్టర్లు, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు, ఆదాయపు పన్ను చెల్లిస్తున్న ప్రైవేటు ఉద్యోగులు, వివిధ వృత్తుల్లో స్థిరపడిన వారి మాటేమిటి? ఒక్క మాటలో చెప్పాలంటే 15 లక్షల మందిని తీసేస్తే మిగతా ప్రజలంతా దారిద్ర్యంలో ఉన్నట్టే! ఇంతకంటే దారుణం ఉంటుందా? తెలంగాణలో తెల్ల రేషన్ కార్డుల లబ్ధిదారులకు కిలో రూపాయి వంతున పంపిణీ చేస్తున్న సన్న బియ్యం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై సాలీనా దాదాపు 15 వేల కోట్ల రూపాయల భారం పడుతోంది. 1983లో కిలో రెండు రూపాయలకు బియ్యం పథకాన్ని ఎన్టీఆర్ ప్రవేశపెట్టినప్పుడు సంక్షేమ రంగంలో అదొక విప్లవంగా చెప్పుకొన్నారు. నాలుగు దశాబ్దాల తర్వాత కిలో బియ్యం రూపాయికే ఇవ్వడం సంక్షేమం అవుతుందా? రాజకీయ పార్టీల బాధ్యతారాహిత్యం అవుతుందా? ఈ అరాచక ధోరణుల వల్లనే తెలుగు రాష్ట్రాలు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోవడం నిజం కాదా?**

ఆ దారిలోనే అందరూ...

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఆర్థిక పరిస్థితిపై అవగాహన లేకుండా హామీలు ఇచ్చింది. ఇప్పుడు సదరు హామీలను అమలు చేయలేక దిక్కులు చూస్తోంది. దీంతో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై విరుచుకుపడుతున్నారు. అయితే, ఈ విషయంలో ఆ పార్టీని తప్పు పట్టాల్సింది కూడా లేదు. నాడు కేసీఆర్ అయినా, నేడు రేవంత్ రెడ్డి అయినా తమ సొంత ఆస్తులు అమ్మి పథకాలను అమలు చేయడం లేదు – చేయరు! ఈ ఇరువురు కూడా అప్పులు చేసి పథకాలను అమలు చేయాల్సిందే. అప్పు దొరికితే సరేసరి, లేనప్పుడే తంటా అంతా! గత కొన్నేళ్లుగా అమలవుతున్న పథకాలను తమ హక్కుగా ప్రజలు భావిస్తున్నారు. అందుకే సంక్షేమ పథకాలు అమలు చేసినంత మాత్రాన అధికారం నిలబెట్టుకోవచ్చునని అనుకోవడానికి లేదు. అయినా రేసులో వెనుకబడి పోకూడదని రాజకీయ పార్టీలు పోటీ పడుతున్నాయి. అప్పు చేసి పప్పు కూడు తింటున్నామా అంటే అది కూడా లేదు! ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు ఏమాత్రం మెరుగుపడ్డం లేదు. రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. కర్ణాటకలో రోడ్లు గుంతలమయంగా ఉన్నాయని, అవి మెరుగుపడే అవకాశం కూడా కనపడటం లేదని, అంచేత తాము మరో రాష్ట్రానికి తరలిపోవాలని ఆలోచిస్తున్నట్టు 'బ్లాక్ బక్' కంపెనీ వ్యాఖ్యానించింది. కర్ణాటకకు అయినా, తెలంగాణకు అయినా, ఆంధ్రప్రదేశ్‌కు అయినా ఇంతకన్నా తలవంపు ఏమి ఉంటుంది? పెట్టుబడులను ప్రోత్సహిస్తామంటున్న పాలకులు బ్లాక్ బక్ కంపెనీకి ఏమి సమాధానం చెబుతారు? విద్యుత్ సరఫరా గురించి చెప్పేది ఏముంది? ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణాలకు నిధులు ఉండవు. సంక్షేమ వసతి గృహాల మెస్ బిల్లులు కూడా సకాలంలో చెల్లించరు. దీంతో ఆహార నాణ్యత లోపిస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రులలో సిబ్బంది కొరత ఉండనే ఉంది. అత్యవసరమైన మందులు ఉండవు. ఇలా చెప్పుకొంటూ పోతే అంతుండదు. ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు కూడా పేరుకుపోతున్నాయి. పదవీ విరమణ సందర్భంగా ఉద్యోగులకు చెల్లించాల్సిన మొత్తాలను చెల్లించలేక పదవీ విరమణ వయసు పెంచుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇవే పరిస్థితులు. సూపర్ సిక్స్ అమలు చేస్తావా? చస్తావా? అని ముఖ్యమంత్రి చంద్రబాబుపై మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ఒత్తిడి తెస్తున్నారు. ఇవాళ కాకపోతే రేపు సూపర్ సిక్స్ అమలవుతాయి. నిన్నటిదాకా జగన్‌రెడ్డి అప్పులు చేయడం, తాకట్టు పెట్టడం చేశారు. ఇప్పుడు చంద్రబాబు అదే పని చేస్తారు. అంతిమంగా మునిగిపోయేది రాష్ట్రమే. చంద్రబాబు కంపెనీలుగానీ, జగన్‌రెడ్డి కంపెనీలుగానీ ఆ భారాన్ని భరించవు కదా! రెండు రాష్ట్రాలలోనూ ప్రభుత్వాలు చెల్లించాల్సిన బకాయిలు లక్షల కోట్లకు చేరాయి. చిన్నా చితకా పనులు చేసిన వారు సకాలంలో బిల్లులు పొందలేక నలిగిపోతున్నారు. ఇదే అదనుగా గతంలో లేని విధంగా, బిల్లులు చెల్లించాలంటే 'నాకేంటి' అని అడగడం మొదలైంది. ఇదివరకు పనులు కేటాయించినందుకే కమీషన్లు తీసుకొనేవారు. ఇప్పుడు బిల్లులు చెల్లించడానికి కూడా కమీషన్లు తీసుకోవడం ప్రారంభించారు. దీంతో పనుల అంచనాలు పెరుగుతున్నాయి. కోటి రూపాయలతో పూర్తయ్యే పనికి రెండు కోట్లతో అంచనాలు రూపొందిస్తున్నారు. ఇక్కడ కూడా ప్రజలే బాధితులు. ఒకవైపు సంక్షేమం పేరిట పంపకాలకు పాల్పడుతూ మరో వైపు అవినీతికి గేట్లు ఎత్తుతున్నారు. ఈ అవినీతి సొమ్ములో కొంత మొత్తాన్ని ఎన్నికల సమయంలో ప్రజలకు పంచుతున్నారు. ఒక్కొక్కరికి వంద– రెండు వందలతో మొదలైన పంపకం ఇప్పుడు వేలకు చేరింది. గతంలో పేదలకు మాత్రమే డబ్బు పంచేవారు. ఇప్పుడు మొత్తం ఓటర్లకు పంచాల్సి వస్తోందట! అనేక చోట్ల భూస్వాములు, వ్యాపారులు, ఇతర ధనవంతులు, ప్రభుత్వ అధికారులు కూడా సిగ్గు లేకుండా డబ్బు తీసుకుంటున్నారు. ఇదంతా ఒక విష వలయంగా మారింది.

ఆగేది ఎప్పుడు.. ఆపాల్సింది ఎవరు?

సంక్షేమ పథకాల ప్రకటనలో దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి కొంత బాధ్యతగా వ్యవహరించారు. రైతులకు ఉచిత విద్యుత్, ఫీజు చెల్లింపులు, ఆరోగ్యశ్రీ వంటి పథకాలు అమలు చేసినా... 2009 ఎన్నికల్లో గట్టెక్కేందుకు మరికొన్ని పథకాలు ప్రకటించాలని సన్నిహితులు సూచించగా, 'రాష్ట్ర ఆర్థిక పరిస్థితి నాకు తెలుసు. ఇంతకంటే ఎక్కువ చేయలేం. గెలిస్తే గెలుస్తాం లేదంటే లేదు' అని కరాఖండిగా చెప్పారట! ఈ విషయంలో ఆయనను అభినందించాల్సిందే. ఈ నేపథ్యంలో పిల్లి మెడలో ఎవరు గంట కట్టాలన్నది ప్రశ్నగా మన ముందు ఉంది. వరాల జల్లు కురిపించడంలో వెనుకబడకూడదని అన్ని రాజకీయ పార్టీలూ భావిస్తున్నాయి. సంక్షేమ పథకాల పేరిట డబ్బు పంచిపెట్టినంత మాత్రాన ప్రజలు మళ్లీ మళ్లీ గెలిపిస్తున్నారా? అంటే అదీ లేదు! ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలూ ప్రజలకు డబ్బు పంచుతున్నాయి. అయితే, ప్రజలు మాత్రం తాము అనుకున్న వారికే ఓటు వేస్తున్నారు. ఇరు పార్టీలు డబ్బు ఇచ్చాయి కదా అని సగం ఓట్లు ఒకరికి, మిగతా సగం ఓట్లు మరొకరికీ వేయడం లేదు. ఈ డబ్బు పంపకంలో రాజకీయ పార్టీలు అలసిపోయే రోజు ఎంతో దూరంలో లేదు. అలాగే సంక్షేమ పథకాల రేసుకు ఎక్కడో ఒక చోట ఫుల్ స్టాప్ పడకపోతే పథకాలు పొందని ప్రజలు, పన్నులు చెల్లిస్తున్న వారు ఏదో ఒక రోజు రోడ్ల మీదకు వస్తారు. తెలుగు రాష్ట్రాలు రాజకీయ పార్టీల సొంతం కాదు. భావి తరాలకు ఇక్కడ మంచి భవిష్యత్తు ఉండాలి. అలా జరగాలంటే రాజకీయ పార్టీలను కట్టడి చేయడానికి ప్రజలే పూనుకోవాలి. ముఖ్యమంత్రులు వస్తుంటారు – పోతుంటారు. నష్టపోయేది రాష్ట్రాలు– అక్కడ నివసించే ప్రజలే! సో.. పౌర సమాజమే చొరవ తీసుకొని హద్దులు మీరుతున్న సంక్షేమ పథకాల అమలుకు నిరసనగా ప్రజలను చైతన్య పరచాలి. లేని పక్షంలో రెండు తెలుగు రాష్ట్రాలు కోలుకోలేని విధంగా అప్పుల ఊబిలో కూరుకుపోతాయి!

వెన్నయతో కాకతీయ వంశోద్భవం


కాకతీయ వంశ ఆదిపురుషుడు 'గుండన' అనీ, నందిగామ మండలం మాగల్లు సమీపంలోని కాకర్తి గ్రామం 'ఆ వంశ ఆద్యుడు' జన్మస్థలమంటూ ఈనెల 15న ప్రచురితమైన వార్తాకథనానికి స్పందన ఇది.

బయ్యారం చెరువు శాసనం, జనగామ జిల్లా పాలకుర్తి దగ్గరలో గల గూడూరు శాసనం సాక్షిగా... కాకతీయ వంశ మూలపురుషుడు గుండన కాదు 'వెన్నయ'. ఇది నేను చెబుతున్నది కాదు. కాకతీయుల చరిత్రను పరిశోధించేందుకు జీవితకాలం కృషి చేసిన పి.వి పరబ్రహ్మ శాస్త్రి లోకానికి చాటిన విషయాల్లో ఇదొకటి.

కాకతీయ వంశవృక్షంలో, క్షత్రియులు తరచుగా పేర్కొనే చారిత్రక పురుషుడు దుర్జయుడు కనిపిస్తాడు. ఆ తర్వాత కాకతీయ వంశస్థాపకుడిగా 'వెన్నయ' కనిపిస్తాడు. ఆ క్రమాన్ని తన 'కాకతీయులు' గ్రంథంలో పరబ్రహ్మ శాస్త్రి ఇలా వివరించారు. 1. కాకతీ వెన్నయ (750–768). 2. మొదటి గుండన (768–824). 3. రెండవ గుండన (824–870). 4. మూడవ గుండన (870–895). 5. ఎర్రయ నాయకుడు (895–940). 6. నాల్గవ గుండన (కాకర్త్య గుండన) (950–995)... ఇలా కాకతీయ వంశకర్త వెన్నయ నాయకుడి నుంచి 14వ తరం వాడైన గణపతిదేవుని వరకు వరుసగా బయ్యారం శాసనం పేర్కొంటున్నది. ఈ సమగ్ర శాసనాన్ని గణపతిదేవ చక్రవర్తి సోదరి అయిన మైలాంబ బయ్యారం చెరువు తవ్వించి, తన స్వహస్తాలతో అక్కడ ప్రతిష్ఠించింది.

కాకతీయ వంశ చరిత్రకు సంబంధించి ఇదొక ఆయువుపట్టు లాంటి శాసనం. కాకతీయులకు సంబంధించిన అనేకానేక శాసనాల్లో ఇంత సమగ్ర శాసనం మరొకటి లేదు! కాకతీయ వంశ మూలపురుషుడైన వెన్నయ నాయకుడు, రాష్ట్రకూట చక్రవర్తి అయిన దంతి దుర్గుని రాజ్య నిర్మాణానికి సహకరించాడు.

వెన్నయనే కాకతీయ వంశ స్థాపకుడని ఆ శాసనం ఇలా పేర్కొన్నది– "తదన్వయే వెన్న నృపో భభూవ ఖ్యాతస్సదా సన్నతవైరి భూపయా కాకతిస్థ పృథివీం శశాస తేనాస్య వంశ్యా అపి కాకతీశా." అదేవిధంగా చాళుక్య గాంగ కుమార సోమేశ్వరుడు 1124 లో వేయించిన గూడూరు శాసనంలో కూడా "వెన్నడను సంభవుడైయ్యనది ప్రసిద్ధుడై వినుతి విరోధి మాండలిక వెన్నడు వెన్నుడై వోలె" అంటూ ఆ శాసనంలో వెన్నయ ప్రస్తుతి కనిపిస్తుంది. ఈ వెన్నయ కక్కిరాలపల్లి, కత్రియాల, పంతిని గ్రామాల మధ్యలో ఒకప్పుడు ఉండిన కాకతీపురానికి అధిపతి! రాష్ట్రకూటుల సామంతునిగా ఈ కాకతీ పురాధిపతిగా ఉన్న ఈ ప్రాంతం ప్రస్తుతం ఉన్న ఓరుగల్లు కోటకు కూతవేటు దూరంలోనే ఉంది!



కాకర్త్య గుండనగా పేర్కొంటున్న అతనికి ముందు... వెన్నయ తర్వాత మరో ముగ్గురు గుండనలు ఉన్నారు. ఈ కాకర్త్య గుండనను పిండి గుండన అని కూడా అంటారు అంతే కాదు, ఓరుగల్లు స్థానిక చరిత్రకారులు ఆయనను 'పెండ్లి గుండన' అని కూడా అంటారు. అదెలాగంటే ఈ గుండన కాకతీ ఎర్రయ్య రాజుకు అల్లుడిగా రావడం వల్ల పెండ్లి గుండనగా పిలవబడ్డాడు.

ఇక కాకతీపురం విషయానికొస్తే అది ఎక్కడో దూరంగా లేదు. ఓరుగల్లు కోటకు దగ్గరలోనే ఇందాక చెప్పుకున్నట్టు కక్కిరాలపల్లి, కత్రియాల, పంతిని గ్రామాల మధ్య ఉంది. అది ఎలాగంటే కాకతీయులకు సంబంధించిన శాసనాలు 88 దాకా ఈ చుట్టుపక్కలే దొరికాయి. ఈ శాసనాలు దొరికిన ప్రదేశాల్ని కలుపుతూ ఒక వృత్తంలాగా గీసుకుంటూ పోతే వృత్త కేంద్రంలో పురాతన కాకతీపుర శిథిలాలు ఉన్న ప్రదేశం మనకు కనిపిస్తుంది!! ఈ ప్రదేశంలోనే ఎనిమిదవ శతాబ్దంలో కాకతీయ వంశ స్థాపకుడు అయిన వెన్నయ ఈ ప్రాంతంలో కాకతీపురాన్ని నిర్మించి పరిపాలన సాగించాడు.

కాకర్త్య గుండనగా చెప్పబడుతున్న ఈ నాలుగవ గుండన తర్వాత వచ్చిన కాకతీయ పాలకుడైన బేతరాజు శాసనాలు 1051 నాటివి, పూర్వ కరీంనగర్ జిల్లాలో భాగమైన శనిగరంలో లభించాయి. 1053 నాటి కాకతీయ మొదటి ప్రోలరాజు శాసనం, కాకతీయ దుర్గరాజు వేయించిన కాజీపేట శాసనం అనుసరించి హనుమకొండను మొదటి ప్రోలరాజు శాసనబద్ధంగా పొందటాన్ని బట్టి చూస్తే కాకతీయుల పూర్వ నివాస స్థానం కాకతీపురం ఎక్కడో మైళ్ళ దూరంలో ఉన్నదని చెప్పచూడడం హాస్యాస్పదం!

మొదటి తరం, రెండవ తరం కాకతీయులు ఎవరిని తీసుకున్నా ఆనాటి పాలకులు వేయించిన శాసనాలన్నీ మనకు తెలంగాణలోనే ఎక్కువ శాతం కనిపిస్తాయి. ఆంధ్ర ప్రాంతంలో తక్కువ! రుద్రమదేవి గుడిమెట్ల కృష్ణా నది తీరంలో నిద్ర చేయడానికి గల కారణం ఆమె తండ్రి అయిన గణపతిదేవ చక్రవర్తి రాజ్య విస్తరణలో భాగంగా నిడదవోలు పాలకుడైన చాళుక్య వీరభద్రుడికి రుద్రమదేవినిచ్చి పెళ్లి చేశాడు. దురదృష్టవశాత్తు చాళుక్య వీరభద్రుడి అకాల మరణం వల్ల ఆమె, ఆ ప్రాంతంలో నిద్ర చేయాల్సి వచ్చింది. కోస్తాంధ్ర ప్రాంతంతో పాటు తమిళనాడులోని కంచి వరకు కాకతీయ సామ్రాజ్యమే కనుక అన్నిచోట్ల అక్కడక్కడ వాళ్ళ శాసనాలు నేటికీ కనిపిస్తుంటాయి! అంత మాత్రాన ప్రతి చోట కాకతీపుర అవశేషాలు వెలికితీయడం కోసం ప్రయత్నాలు చేయాలనుకోవడం వృథా ప్రయాస!!

◆ డా. అంబటి శ్రీనివాస్ రాజు
(మన కాకతీయులు గ్రంథకర్త)

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి



రావమ్మా.. బతుకమ్మా!

నేటి నుంచే పూల జాతర

- పూలను దేవతలుగా కొలిచే అపురూపమైన పండుగ
- తెలంగాణ విశిష్ట సంస్కృతికి నిలువెత్తు ప్రతీక
- 9 రోజుల పాటు ఆడిపాడనున్న మహిళా లోకం
- ఆడపడుచుల సందడితో ఇంటింటా ఆనందం
- తొలి రోజు వేయిస్తంభాల గుడిలో బతుకమ్మకు శ్రీకారం
- పాల్గొననున్న మంత్రులు సురేఖ, సీతక్క, జూపల్లి కృష్ణారావు

హనుమకొండ కల్చరల్/వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): 'బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో..' అంటూ మహిళలు గొంతెత్తి పాడుకుంటూ ఆటలాడుకునే తొమ్మిది రోజుల పూల జాతరకు ఆదివారం శ్రీకారం చుట్టనున్నారు. చిన్న పెద్దా అనే భేదం లేకుండా మహిళలు ముఖ్యంగా పెళ్లైన మహిళలు పుట్టింటిలో ఉండి సంప్రదాయబద్ధంగా జరుపుకునే బతుకమ్మ సంబరాలు అశ్వయుజ శుద్ధ అమావాస్య ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. పల్లె, పట్నం తేడా లేకుండా ప్రతీచోట పూల పరిమళాలు గుబాళించనున్నాయి. మహిళలంతా అందంగా పేర్చిన పూల బతుకమ్మలతో ఒక చోట చేరి సరదాగా కబుర్లు, చిన్ననాటి జ్ఞాపకాలను వల్లె వేసుకుంటూ 'ఒక్కేసి పువ్వేసి చందమామ.. ఒక్కజాములాయే చందమామా..' అంటూ ఆడి పాడనున్నారు.

'బంగారు పూవులా.. బతుకమ్మలని పేర్చి.. రంగు గుమ్మడి పూవులు.. గౌరమ్మ రాశిగా అర్పింతురు..' అన్న బతుకమ్మ పాటలో ఈ విశిష్ట పర్వదిన సంప్రదాయం తొణికిసలాడుతుంది. హనుమకొండలోని చారిత్రక వేయిస్తంభాల దేవాలయం తొలినాటి బతుకమ్మ పండగ వేడుకలకు 1948 నుంచి వేదికగా నిలుస్తోంది. చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత, విశాలమైన మైదానం కలిగిన ఈ ఆలయ ప్రాంగణానికి గతంలో చుట్టూరా గోడలు లేకపోవడంతో ఊరంతా ఇక్కడికే తరలివచ్చి ఆటలాడుకునే వారని, మారుతున్న కాలానుగుణంగా ఆలయం అభివృద్ధి చెందిన క్రమంలో మహిళలు అదే ఆనవాయితీని కొనసాగిస్తున్నారు.

ప్రత్యేక ఆకర్షణగా పాటలు

బతుకమ్మ పాటల్లో లక్ష్మీ, సీత, అనసూయ, శశిరేఖ, సత్యభామ తదితర పుణ్య స్త్రీల గాథలు విరివిగా ఉన్నాయి. పూలనే దేవతలుగా కొలిచే అపురూప పండుగ ఇది. నగరంలోని భద్రకాళి, వేయిస్తంభాల ఆలయాలు బతుకమ్మ ఆటలకు వేదికగా నిలువనుండగా, చివరి రోజు జరుపుకునే సద్దుల బతుకమ్మ వేళ మాత్రం చెరువుగట్ల వద్దకు పోయి ఆటలాడి, వాయినాలందించుకొని బతుకమ్మలను నిమజ్జనం చేయటం ఆచారంగా బాసిల్లుతోంది. మహిళల చేతులే సాధనాలుగా చప్పట్లే గుండె చప్పుళ్లుగా అందంగా పూలను అలంకరించి వినసొంపైన జానపదాలతో తెలంగాణ బతుకమ్మ సంబరం ఆవిష్కృతం కానుంది. భద్రకాళి అమ్మవారి జన్మదినం కూడా సద్దుల పండుగ రోజే కావడంతో అమ్మవారి మాడవీధుల ప్రాంగణం, మైదానంలో లక్ష మంది మహిళలతో సద్దుల బతుకమ్మ వేడుకను నిర్వహించడానికి ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. అలాగే వరంగల్‌లోని ఉర్సు రంగలీల మైదానం, కాశిబుగ్గ శివాలయం వద్ద, ఓసిటీ మైదానంలో, కట్టమల్లన్న దేవాలయం వద్ద, పోతన ఆడిటోరియం వద్ద, శ్రీరామలింగేశ్వరాలయం, ఆకారపు వారి గుడి, కొత్తవాడ మైదానం, రంగశాయిపేట మైదానం, దేశాయిపేట వడ్డెపల్లి చెరువు ప్రాంతం, ఖిలా వరంగల్ ప్రాంతంలో వేడుకలు జరుగుతాయి.

నవరాత్రులకు ముందు పితృపక్షాలు..

అమావాస్య రోజున పితృ తర్పణం నిర్వహించే సమయానికి ముందే ఇళ్లల్లో మహిళలు బతుకమ్మను పేరుస్తారు. దేవుళ్ల పటాల వద్ద పెట్టి పసుపుతో అమ్మవారిని (మిగతా 6వ పేజీలో)

నేడు ముగ్గురు మంత్రుల రాక

ఆదివారం బతుకమ్మ సంబరాల ప్రారంభ వేడుకలకు చారిత్రక వేయిస్తంభాల ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. పర్యాటకశాఖ, సాంస్కృతిక మంత్రి జూపల్లి కృష్ణారావు, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క బతుకమ్మ ఆరంభ వేడుకల్లో పాల్గొననున్నారు. కాగా, వేయిస్తంభాల ఆలయంలో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ శనివారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి, డీసీపీ షేక్ సలీమా, ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ, ఏసీపీ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కాళోజీ క్షేత్రంలో నేడు నృత్య సౌరభం

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రం వేదిక గా రాష్ట్ర ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో తొలిసారిగా నిర్వహిస్తున్న కాకతీయ నృత్య నాటకోత్సవాన్ని ఆదివారం సాయంత్రం 5గంటలకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రారంభిస్తారని సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య పుంజల తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా ఇన్‌చార్జి మం త్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, వరంగల్ ఎంపీ కడియం కావ్య తదితర అనే క మంది ప్రముఖులు పాల్గొంటారని ఆమె చెప్పారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ విశేష నృత్య కళాసౌరభాన్ని ప్రదర్శింపజేయనున్నట్లు, ఓరుగల్లు కళాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆమె కోరారు.

'దసరా ఉత్సవం'పై ముదురుతున్న వివాదం

- డోలాయమానంలో కాశిబుగ్గ సమితి
- ఎక్కడ, ఎలా నిర్వహించాలనే విషయమై మల్లగుల్లాలు
- ఉత్సవాలను తామే నిర్వహిస్తామంటున్న 14వ డివిజన్ నాయకులు
- వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ప్రోత్సాహంతో ముందుకు..

7

ఓ-పాజిటివ్‌కు బదులు బి-పాజిటివ్..

- రక్తం ఎక్కించడంలో వైద్య సిబ్బంది తప్పిదం
- రోగి పరిస్థితి విషమం.. ఎంజీఎంలో కలకలం

7


ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైద్యుడు

నేటి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా నిలిచిపోయిన ఆరోగ్యశ్రీ సేవలు పునఃప్రారంభం కానున్నాయి. ప్రయివేట్ నెట్‌వర్క్ హాస్పిటల్స్ యాజమాన్యాలు చేపట్టిన సమ్మెను విరమించడం ద్వారా వేలాది మంది పేదరోగులకు మళ్లీ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మూడు రోజులుగా ప్రభుత్వానికి, హాస్పిటల్స్ యాజమాన్యానికి వారధిగా పనిచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో నేరుగా చర్చలు జరిపి ఫోన్ ద్వారా సమస్యను పరిష్కరించే దిశగా ప్రభుత్వానికి స్పష్టత ఇచ్చారు. ఈ చర్చల అనంతరం నెట్‌వర్క్ హాస్పిటల్స్ సమ్మె విరమించేందుకు సిద్ధమయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పలువురు వైద్యులు పుష్పగుచ్ఛం అందించారు.

ఆదివాసీల సంప్రదాయాలను గౌరవిస్తాం..

- మేడారంలో అభివృద్ధి పనులకు టెక్నికల్ కమిటీని ఏర్పాటు చేయాలి
- సమీక్ష సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి
- 23న మేడారంలో పర్యటన


హైదరాబాద్‌లో మంత్రులతో కలిసి సమీక్షిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ములుగు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మేడారం జాతర పనుల కోసం టెక్నికల్ కమిటీని ఏర్పాటు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మేడారం అభివృద్ధి ప్రణాళికపై హైదరాబాద్‌లోని సచివాలయంలో శనివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. పూజారుల కోరిక మేరకు ఆలయ విస్తరణ పనులను చేపడతామన్నారు. సమ్మక్క-సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలను యధాతథంగా ఉంచి ఆదివాసీల సంప్రదాయాలను తప్పకుండా గౌరవిస్తామన్నారు. గిరిజన సంప్రదాయాలు ఉట్టిపడేలా స్వాగత తోరణం డిజైన్లను రూపొందించాలని అన్నారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో ఆ ప్రాంత సంప్రదాయ వృక్షాలు ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి సీతక్క, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్, సీఎం సలహాదారు వేం నరేందర్, ఎంపీ బలరాంనాయక్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ తదితరులు పాల్గొన్నారు.

23న మేడారానికి సీఎం

సీఎం రేవంత్‌రెడ్డి ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారానికి రానున్నారు. ఈనెల 23న ఆయన పర్యటించనున్నారు. మేడారం అభివృద్ధిపై క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేయనున్నారు. అలాగే మేడారం అభివృద్ధిపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి డిజైన్లను ఖరారు చేయనున్నారు.

రేపటి నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

- భద్రకాళి సన్నిధిలో వైభవంగా వేడుకలు
- 2న విజయదశమి దసరా మహాదర్శనం
- 3న భద్రకాళి భద్రేశ్వరుల కల్యాణోత్సవం



మీడియా సమావేశంలో పాల్గొన్న ఈవో, ధర్మకర్తలు

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రసిద్ధ భద్రకాళి ఆలయంలో ఈ నెల 22 నుంచి అక్టోబరు 3 వరకు కొనసాగనున్న శ్రీదేవీ శరన్నవ రాత్రి మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈవో రామాల సునిత తెలిపారు. శనివారం దేవాల య ప్రాంగణంలో ఆమె మీడియా సమావేశంలో మా ట్లాడుతూ.. అన్ని శాఖల సమన్వయంతో ఉత్సవాలు నిర్వహిస్తామని, భక్తులకు క్యూలైన్లు, అన్న ప్రసాదం, తాగునీటి వసతి ఏర్పాటు చేశామని అన్నారు. ప్రధానార్చకుడు భద్రకాళి శేషు మాట్లాడుతూ.. 22న సోమవారం భేరీ పూజ, ధ్వజారోహణం, కలశ స్థాపన, నవరాత్రి వ్రతారంభంతో అమ్మవారికి పూజలు కొనసాగుతాయని తెలిపారు. ధర్మకర్త ఓరుగంటి పూర్ణచందర్ మాట్లాడుతూ.. ఆలయంలో రంగులు, యాగశాల పనులు పూర్తయ్యాయని, భక్తులందరికి దర్శనం జరిగేలా మూడంచెల క్యూలైన్లతో దర్శనం ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు గాదె శ్రవణ్‌కుమార్‌రెడ్డి, కటకం రాములు, తొనుపునూరి వీరన్న, తొగరు క్రాంతి, బింగి సతీష్, మోత్కూరి మయూరి, జారతి వెంకటేశ్వర్లు, అనంతుల శ్రీనివాసరావు, మూగ శ్రీనివాసరావు, పాలడుగుల ఆంజనేయులు, గాండ్ల స్రవంతి, నార్ల సుగుణ, పి. నర్సింహమూర్తి, కూచన హరినాథ్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ మళ్లీ పోటీ చేసేది లేదు..

- గత అసెంబ్లీ ఎన్నికలే నా చివరి ఎన్నికలు
- ఇప్పటికే రూ.1,025 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టా..
- అభివృద్ధి జరగలేదనే వారు పశువులతో సమానం
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



6

ఫిరాయింపులు జరగలేదనడం సిగ్గుచేటు

- కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నది సీఎంకు కనబడటం లేదా?
- రాజ్యాంగంపై గౌరవం ఉంటే కడియం రాజీనామా చేయాలి..
- మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ధ్వజం



6

నేటి నుంచి చండీఘడ్‌లో సీపీఐ జాతీయ మహాసభలు

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

న్యూశాయంపేట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ 25వ జాతీయ మహాసభలు ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు చండీఘడ్‌లో ప్రారంభమవుతున్నట్లు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 21న చండీఘడ్‌లోని మొహాలీలో బహిరంగ సభతో మహాసభ ప్రారంభం అవుతుందని తెలిపారు. దేశవ్యాప్తంగా 29రాష్ట్రాల నుంచి 800కుపైగా ప్రతినిధులు మహాసభల్లో పాల్గొంటున్నారని, తెలంగాణ నుంచి 82 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ మహాసభల్లో దేశంలో పెరిగిపోతున్న ఆర్థిక అసమానతలు, మతోన్మాదం, దేశానికి వామపక్షాల అవసరం, వామపక్షాల బలోపేతం కార్యాచరణపై చర్చ ఉంటుందన్నారు. ప్రజాపోరాటాల ద్వారానే ఆర్థిక అసమానతలు, మతోన్మాదం, దేశసమగ్రత, ఐక్యత సాధన సాధ్యమని, దీనికి దేశంలో బలమైన వామపక్ష ఉద్యమం అవసరం అన్నారు. కమ్యూనిస్టు పార్టీలన్నీ ఐక్యం కావాలని, మతోన్మాదం ముక్త్‌భారత్ దిశగా ఐక్య పోరాటాలు అవసరమని, దీనిపై మహాసభల్లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

అంతర్జాతీయ క్రీడా సదస్సులో డీవైఎస్‌వో



మలేషియాలో సదస్సులో పాల్గొన్న అశోక్ కుమార్

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మలేషియా దేశంలో ఈనెల 18 నుంచి 20వరకు నిర్వహించిన అంతర్జాతీయ క్రీడా సదస్సుకు డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్ హాజరయ్యారు. శనివారం మలేషియా షాఆలంలోని యూనివర్సిటీ టెక్నోలోగి మారాలో నిర్వహించిన సదస్సులో ఏకేస్ స్టడీ ఇమ్యూనేట్ ఇంటర్నేషనల్ రెజ్లింగ్ స్పోర్ట్స్ పర్సనాలిటీ ఠాకూర్‌దేవ్‌సింగ్ అనే అంశంపై అశోక్‌కుమార్ పత్రం సమర్పించి పలువురి మన్ననలను పొందారు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం రతిరాంతండాకు చెందిన అశోక్‌కుమార్.. ప్రస్తుతం హనుమకొండ జిల్లా యువజన, క్రీడల (గ్రేడ్1)అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న అశోక్‌కుమార్‌కు జిల్లాలోని పలు క్రీడా అసోసియేషన్ల బాధ్యులు, డీఎస్‌ఏ కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

మళ్లీ మళ్లీ పోటీ చేసేది లేదు..

గత అసెంబ్లీ ఎన్నికలే నా చివరి ఎన్నికలు : స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి


కల్యాణలక్ష్మి చెక్కులు తీసుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గత అసెంబ్లీ ఎన్నికలే తనకు చివరి ఎన్నికలని, మళ్లీ మళ్లీ పోటీ చేసేది లేదని, 21నెలల పాలనలో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి రూ.1025.64 కోట్ల అభివృద్ధి పనులు తీసుకు వచ్చానని, రానున్న మూడేళ్లలో మరో రూ.2000 కోట్ల నిధులు తీసుకు వచ్చి అభివృద్ధి చేస్తానని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌లోని రైతు వేదికలో స్టేషన్‌ఘన్‌పూర్, చిలుపూరు, జఫర్‌గడ్ మండలాలకు చెందిన 35 మంది లబ్ధిదారులకు రూ.34 లక్షల విలువైన కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన అందించారు. అనంతరం మాట్లాడుతూ 21 నెలల పాలనలో తాను తీసుకువచ్చిన పనులకు సంబంధించి అభివృద్ధి డాక్యుమెంట్‌ను రూపొందించడం జరిగిందన్నారు. డాక్యుమెంట్‌లో ఏ ఒక్కటైనా తప్పని నిరూపిస్తే దేనికైనా సిద్ధమని తేల్చి చెప్పారు. అనేక అభివృద్ధిపనులు జరుగుతుంటే కొందరు మూర్ఖులు కంటికి ఏమీ కనిపించడం లేదని మాట్లాడుతున్నారని వారిని పట్టించుకోవలసిన అవసరం లేదన్నారు. తాను నియోజకవర్గ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నానని, ప్రతిపక్షంలో ఎమ్మెల్యేగా ఉంటే ఏమీ పని చేయలేనని, దీంతో నియోజకవర్గం నష్టపోతుందని వెల్లడించారు. రాజకీయం కోసం వ్యక్తిగతంగా దూషణలకు, కుటుంబ సభ్యులను వదిలి పెట్టకుండా నీచస్థాయికి వెళ్లి మాట్లాడడం మంచిదేనా? అని ప్రశ్నించారు.

తప్పు చేయను... తలదించను...

తప్పు చేయను తల వంచను, చిలిపి చేష్టలు లేవు.. చిల్లర పనులు చేయను, ఎవరింటికైనా వెళ్లితే 'నాటుకోడి కోస్తావా..' అని అడిగేది లేదని కడియం వ్యంగ్యంగా అన్నారు. 'బ్లాక్ లేబుల్ పెడుతావా..'అని అడిగేది లేదు, 'మిగిలింది నా టిఫిన్ బాక్స్‌లో పెడుతావా..' అని అడిగేది లేదు అంటూ ఎద్దేవా చేశారు. ఒకప్పుడు ఘన్‌పూర్ పేరు చెప్పుకోవడానికి సిగ్గుపడేది, ఇవ్వాల ఘన్‌పూర్ అంటే అభివృద్ధి చెందుతున్న నియోజకవర్గంగా పేరు తెచ్చుకుంటున్నామని తెలిపారు. 'ఏమీ జరగడం లేదని మాట్లాడే వాళ్లు మనుషులైతే చెప్పవచ్చు.. కానీ పశువు లక్షణాలు ఉన్న వాళ్లకి ఏమీ చెప్పగలం..' అంటూ విమర్శించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ లావణ్య రెడ్డి, ఆర్డీవో వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఏవో చంద్రశేఖర్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు జూలకుంట్ల శిరీష్ రెడ్డి, అంబటి కిషన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

శంభునిపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రంగశాయిపేటలో గల సోషల్ వెల్ఫేర్ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో హిస్టరీ బోధించేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వి.రాధిక శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు హిస్టరీలో పీజీలో 60 శాతం మార్కులతో పాటు పీహెచ్‌డీ అర్హత కలిగి ఉండాలని, బయోడేటాతో కూడిన దరఖాస్తును సెప్టెంబరు 5 లోగా కళాశాలలో అందించాలని, అభ్యర్థులకు 7వ తేదీన ధ్రువపత్రాల పరిశీలన, రాత పరీక్ష, ఇంటర్వ్యూ, డెమో ద్వారా ఎంపిక చేస్తామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఉపాధి కార్యాలయంలో 23న జాబ్‌మేళా

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబర్20(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ములుగురోడ్‌లోని ప్రభుత్వ ఐటీఐ బాలుర క్యాంపస్ ప్రాంగణంలో ఉన్న జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 23వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పనాధికారి ఎం.మల్లయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి నుంచి డిగ్రీ, పీజీ చేసి 18 నుంచి 35 ఏళ్ల వయసు కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు జాబ్‌మేళాకు హాజరుకావచ్చని తెలిపారు.

హనుమకొండ, వరంగల్‌లో ఉన్న ఆదర్శ మోటార్స్ విన్ మోటార్స్ తదితర కంపెనీలలో టెలీ కాలర్స్, ఎగ్జిక్యూటివ్స్, హెచ్‌ఆర్ రిక్రూటర్స్, ఏఎస్ఎం, జీఎన్ఎస్, నర్సింగ్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులు బయోడేటాతో ఈనెల 23వ తేదీన జాబ్‌మేళాకు హాజరుకావాలని, మరిన్ని వివరాలకు 7893394393 నెంబర్‌లో సంప్రదించాలని మల్లయ్య ఆ ప్రకటనలో కోరారు.

గెజిటెడ్ ఉద్యోగుల సంఘం నోటిఫికేషన్ ఇవ్వాలి

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం నోటిఫికేషన్ విడుదల చేయాలని కేయూ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం నేతలు డాక్టర్ ఎస్.సుజాత, డాక్టర్ హబీబుద్దీన్‌లు కోరారు. ఈ మేరకు శనివారం కేయూ పరిపాలన భవనం రిజిస్ట్రార్ చాంబర్‌లో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంను కలిసి వినతిపత్రాన్ని అందచేశారు కేయూ ప్రస్తుత గెజిటెడ్ ఉద్యోగుల సంఘం పదవీ కాలం పూర్తయిందని, కొత్త కమిటీ ఎంపిక నోటిఫికేషన్‌ను ఇవ్వాలని వినతి పత్రంలో రిజిస్ట్రార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం బాధ్యులు సుజాత, ఎల్.రాము, కె.శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ఫిరాయింపులు జరగలేదనడం సిగ్గుచేటు

మాజీ ఎమ్మెల్యే టి. రాజయ్య ధ్వజం


ఎమ్మెల్యే కడియం రూపొందించిన అభివృద్ధి పనుల స్టేట్‌మెంట్‌ను కాల్చివేస్తున్న రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నా సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేల ఫిరాయింపులు జరగలేదని మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి హనుమకొండలో శుక్రవారం మీడియా సమావేశంలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలతో రూపొందించిన స్టేట్‌మెంట్స్ పత్రాలు చిత్తుకాగితంతో సమానమంటూ వాటిని మీడియా సమావేశంలోనే రాజయ్య కాల్చివేశారు. శనివారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాజయ్య మాట్లాడుతూ.. రూ.1,025కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కడియం చెప్పడం సుద్ద అబద్ధమన్నారు. 21నెలల కాంగ్రెస్ ప్రభుత్వంలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులపైన కడియం శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. నియోజకవర్గానికి వచ్చిన అభివృద్ధి పనులను కడియం బినామీలే చేస్తూ ఆయనకు పర్సంటేజీలు ఇస్తున్నారని, నియోజకవర్గానికి వచ్చిన రూ.30కోట్ల సీసీ రోడ్డు పనులను నాణ్యత లేకుండా బినామీలు చేస్తున్నారని ఆరోపించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే 90శాతం మేర దేవాదుల పనులు పూర్తయ్యాయని, ప్రస్తుతం ఒక్క పైసా కూడా దేవాదులకు ప్రభుత్వం ఖర్చు చేయలేదన్నారు. ఓటు చోరీ నినాదంతో పర్యటిస్తున్న రాహుల్‌గాంధీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఎత్తుకెళ్లిన రేవంత్ రెడ్డి పెద్ద ఓటు దొంగ అని ఆయనపై ముందుగా చర్యలు తీసుకోవాలని రాహుల్‌గాంధీని డిమాండ్ చేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్ రాజ్యాంగ బద్దంగా వ్యవహరించకుంటే స్పీకర్ విషయాన్ని న్యాయస్థానంలో తేల్చుకుంటామని స్పష్టం చేశారు. కడియంకు రాజ్యాంగంపై చిత్తశుద్ధి ఉంటే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కడియం వర్గీయులు తనను కించపరిచేలా, వ్యక్తిగత ప్రతిష్ఠకు ఇబ్బంది కలిగేలా ప్రదర్శనలు చేశారని, సంబంధిత క్లిప్పింగ్‌లు ఉన్నాయని వారిపైన పరువునష్టం దావా కేసు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసును పెట్టవచ్చు కాని అలా చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ మారపాక రవి, నాయకులు మాచర్ల గణేష్, ఆకుల కుమార్, పసునూరి మహేందర్ రెడ్డి, జనగాం యాదగిరి, కేశిరెడ్డి రాకేష్ రెడ్డి, భాగ్యలక్ష్మి, తాటికొండ సురేష్, ఒగ్గు రాజు, గుండె మల్లేషం, బత్తుల రాజన్‌బాబు, గొడుగు సంజీవ, ప్రసాద్, అశోక్, నారగోని రాజు, కుంభం కుమార్ పాల్గొన్నారు.

దేశ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయమే వెన్నెముక

వ్యవసాయంలో సాంకేతికతను రైతులు అందిపుచ్చుకోవాలి : ఎస్ఆర్ యూనివర్సిటీ వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ జి.భూపాల్‌రాజ్



శిక్షణా తరగతులలో మాట్లాడుతున్న డాక్టర్ జి. భూపాల్‌రాజ్

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయమే వెన్నెముక అని వ్యవసాయంలో సాంకేతికతలను రైతులు అందిపుచ్చుకోవాలని ఎస్ఆర్ యూనివర్సిటీ వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ జి.భూపాల్ రాజ్ అన్నారు. శనివారం వరంగల్‌లోని పల్లం కన్వెన్షన్ హాల్‌లో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర శిక్షణా తరగతులలో అధిక దిగుబడులకు రైతులు పాటించాల్సిన ఆధునిక సాంకేతిక పద్ధతులు, మెళకువలు అనే అంశంపై డీన్ డాక్టర్ జి.భూపాల్‌రాజ్ మాట్లాడారు. జనాభా పెరుగుతున్నకొద్ది రైతులు ఎక్కువ ఆహారాన్ని ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. వ్యవసాయ సాంకేతికత అంటే పంటల ఉత్పత్తి, రక్షణ, నిల్వ, మార్కెటింగ్‌లో శాస్త్రీయ జ్ఞానం, యంత్రాలు, డిజిటల్ పద్ధతులు, కొత్త విధానాల వినియోగం అని అన్నారు. ఇప్పటి వ్యవసాయంలో సాంకేతికత చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తోందన్నారు. వాతావరణ మార్పులు, నీటి కొరత, కార్మిక సమస్యలు, ఖర్చులు పెరగడం వంటి సవాళ్లు రైతులను ఇబ్బంది పెడుతున్నాయని అన్నారు. ఈ పరిస్థితులలో రైతులు ఖర్చును ఆదా చేస్తూ అధిక దిగుబడులు తీసురావడంలో డ్రిప్ ఇరిగేషన్, డ్రోన్లు, మొబైల్ యాప్‌లు, సెన్సార్లు, యాంత్రీకరణ యంత్రాలతో పనిని సులభతరం చేస్తున్నాయని అన్నారు. సమయానికి నీరు, ఎరువులు అందుతున్నాయని, పురుగులదాడిని ముందుగానే గుర్తించి నియంత్రించవచ్చన్నారు. భవిష్యత్తులో రైతులు సాంకేతికతలను వాడి మరింత లాభదాయకంగా వ్యవసాయం కొనసాగించాలని, టెక్నాలజీని అంగీకరించే రైతు విజయవంతమైన రైతు అవుతారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్, డి.బాల్‌రెడ్డి, బాలరాజ్‌గౌడ్, సత్యనారాయణ, సోమయ్య, హరిబండి ప్రసాదరావు, నర్సింహారెడ్డి, జంగారెడ్డి, రమేష్, కృష్ణారెడ్డి, ఇసంపెల్లి బాబు, కుమారస్వామి, ఎం. చుక్కయ్య, వంశీ, కృష్ణారెడ్డి, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రావమ్మా.. బతుకమ్మా!

(5వ పేజీ తరువాయి)

తయారు చేసి బతుకమ్మపై పెట్టి స్వాహారూపంలో ఉన్న అమ్మవారిని బతుకమ్మగా తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలను నిర్వహిస్తారు. దీంతో బతుకమ్మ పర్వదినం ప్రారంభమవుతుంది.

నగరమంతా తంగేడు మయం

గ్రామీణ ప్రాంతాల నుంచి తరలివచ్చిన తండేడు, గునుగుపూలతో నగరమంతా తంగేడు మయమైంది. మహిళలు బతుకమ్మలను పేర్చేందుకు ప్రధానంగా తంగేడు పూలనే వాడటం ఆనవాయితీగా వస్తున్న క్రమంలో వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో విరివిగా తంగేడు పూల అమ్మకాలు జోరందుకున్నాయి. వీటితోపాటు ఇతర పూల అమ్మకాలు కూడా ఊపందుకోగా, చామంతి రేటు రెండింతలు పెంచి అమ్మకాలు చేపట్టారు. హనుమకొండ చౌరస్తా, టైలర్‌స్ట్రీట్, వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సెంటర్, చౌరస్తా, పోచమ్మ మైదాన్, కాశిబుగ్గ, పాపయ్య పేట చమన్, అండర్ బ్రిడ్జి ఇతర ప్రదేశాల్లో పూల అమ్మకాలు జోరుగా కొనసాగాయి.

విద్యారంగాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వం

పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకట్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మొగిలి వెంకట్‌రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరిస్తోందని, హామీలు తప్ప ఆచరణ లేదని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకట్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని జార్జిరెడ్డి భవన్‌లో శనివారం నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం సిగ్గుచేటన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యారంగాన్ని తీర్చిదిద్దుతానని విద్యాశాఖను తనవద్దనే పెట్టుకుని పట్టించుకోవడం లేదన్నారు. నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.8వేల కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకుండా విద్యార్థులను మోసగిస్తున్నాడని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు సొంత భవనాలు, సరిపడా ఉపాధ్యాయులు, లెక్చరర్లు, తరగతి గదులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కనీస సౌకర్యాలైన తాగునీరు, మరుగుదొడ్ల లాంటి సమస్యలు విద్యార్థులను వేధిస్తున్నాయన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సాంబ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా నెలకొని ఉన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.సతీష్, ఆర్.రంజిత్, సహాయ కార్యదర్శి మిశ్రిన్ సుల్తానా, కె.గణేష్, రాష్ట్ర నాయకులు వంశీకృష్ణ, అర్జున్, జె.గణేష్, రాజు, సుమన్, సైదులు, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ కమిషన్ ఏర్పాటు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న గోపు జైపాల్‌రెడ్డి

జూలైవాడ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈడబ్ల్యూఎస్ కమిషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర రెడ్డి సంఘం అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. పోస్టల్ కాలనీలోని రెడ్డి సంఘం కార్యాలయంలో శనివారం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్ అధ్యక్షతన ఓసీ అగ్రకుల సంఘ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అర్చక సమాఖ్య అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ, గోపు జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ఓసీ ఉద్యమాల ద్వారానే హక్కులు కాపాడు కోగలుగుతామని, పోరాటాల ఫలితంగా సంధించుకున్న 10శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై జరుగుతున్న కుట్రలను తిప్పి కొట్టాలన్నారు. ఈడబ్ల్యూఎస్ కమిషన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో అక్టోబరు నెలలో వరంగల్ పట్టణంలో అగ్రకుల పేద సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు ఓసీ కుల బాంధవులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రెడ్డి, వెలమ, కమ్మ, బ్రాహ్మణ, వైశ్య, మార్వాడి కుల నాయకులు నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు, తిరువరంగం ప్రభాకర్, జగన్‌మోహన్‌శర్మ, చకిలం రాజేశ్వర్ రావు, ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, వెంకటేశ్వర్‌రావు, చౌదరి, నరసింహారెడ్డి, శ్రీనివాస్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

రెండు ఏసీలు నొక్కి.. బాధితులకు టోపీ..

● చిట్టీ డబ్బులు నొక్కిన మోసగాడితో చేతులు కలిపిన సీఐ ● సెంట్రల్ జోన్ పరిధిలో ఓ ఇన్‌స్పెక్టర్ నిర్వాకం



వరంగల్ క్రైం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బాధితుల పక్షాన నిలబడి న్యాయం చేయాల్సిన ఓ పోలీస్ ఇన్‌స్పెక్టర్.. మోసగాడితో చేతులు కలిపి బాధితులకు టోకరా పెట్టాడు. ఫలితంగా రెండు ఏసీలను బహుమానంగా కొట్టేసి ఇంటికి గుట్టుగా తరలించి ఏమి ఎరగనట్టు నటిస్తున్నాడు. విశ్వసనీయమైన సమాచారం మేరకు...

వరంగల్ పోలీస్ కమిషనరేట్ సెంట్రల్ జోన్‌లోని ట్రైసిటీలో ఉన్న ఓ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసం ఉండే వ్యక్తి చిట్టీలు నడుపుతుంటాడు. ప్రజల నుంచి చిట్టీల పేరుతో డబ్బులు వసూలు చేశాడు. ఆపై చిట్టీ డబ్బులు ఇవ్వకుండా జాప్యం చేస్తూ వచ్చాడు. ఈ క్రమంలో సదరు వ్యక్తి.. ఇటీవల ఓ రోజున ఇంట్లో సామాన్లను డీసీఎంలో తరలించేందుకు సిద్ధపడుతుండగా బాధితులు కాపలాకాసి వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయితే.. తన దగ్గర డబ్బులు లేవు, కావాలంటే కేసు నమోదు చేయండి.. అని తేగేసి చెపాడు. దీంతో సదరు వ్యక్తితో డీల్ కుదుర్చుకున్న సీఐ.. వాహనంలోని సామాన్లను పరిశీలించాడు. వాహనంలో ఖరీదైన సామాన్లు ఉండటంతో డైనింగ్ టేబుల్, ఏసీలను తనకు గిఫ్ట్‌గా ఇవ్వాలని కోరాడు. డైనింగ్ టేబుల్ ఇవ్వడానికి సదరు వ్యక్తి నిరాకరించడంతో రెండు ఏసీలను సీఐ గుట్టుగా ఇంటికి తరలించినట్లుగా సమాచారం.

ఇదిలా ఉంటే.. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించిన సమయంలో ఈ సమస్య నుంచి గట్టెక్కేందుకు అధికారులకు కొంత ముడుపులు ముట్టజెప్పాలని చెప్పి బాధితుల్లోని ఒకరి బంధువు దగ్గర తన దగ్గర ఉన్న బంగారాన్ని కుదువపెట్టి రూ.5లక్షలు అప్పు తెచ్చాడని సమాచారం. ఆ ఐదు లక్షల్లో కొంత నగదును సీఐ ముట్టజెప్పినట్లుగా తెలుస్తోంది. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినప్పటికీ విచారణ పేరుతో చర్యలు తీసుకోవడంలో జాప్యం చేస్తున్నట్లుగా తెలుస్తోంది.



వేయిస్తంభాల గుడి వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చారిత్రక వేయిస్తంభాల ఆలయం వద్ద నిర్వహించే రాష్ట్రస్థాయి బతుకమ్మ వేడుకల ప్రారంభోత్సవ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ శనివారం పరిశీలించారు. ఆలయం వద్ద చేస్తున్న ఏర్పాట్లు, మునిసిపల్, పోలీసు, విద్యుత్, ఇతరశాఖల అధికారులతో కలెక్టర్ చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేసి ఎక్కడా కూడా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ దీపాలు, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. బతుకమ్మ ఉత్సవంలో పాల్గొనేందుకు మహిళలు అధికసంఖ్యలో పాల్గొననున్నందున మహిళా పోలీసులు ఎక్కువ సంఖ్యలో బందోబస్తులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి, డీసీపీ షేక్ సలీమా, ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ, ఏసీపీ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగి దుర్మరణం

- విద్యుత్ అధికారులపై కేసు

కరీమాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విధుల్లో నిర్లక్ష్యం వహించి ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి మృతి చెందడానికి కారణమైన విద్యుత్ అధికారులపై మిల్స్ కాలనీ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయపర్తి మండలం ఏకే తండాకు చెందిన మూడు సంధ్య కుమారుడు మూడు వినోద్‌తో పాటు తన స్నేహితులైన బానోత్ దేవేందర్, మునావత్ సంతోష్, భూక్య స్వామి బొంపెల్లి సంపత్‌రావు అనే కాంట్రాక్టర్ దగ్గర రెండు సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. పనుల్లో భాగంగా ఈ నెల 19వ తేదీన ఉర్సు ప్రాంతంలో మధ్యాహ్నం 12గంటలకు విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసే సమయంలో స్థానిక లైన్‌మెన్ కోడం సాంబయ్యను ఎల్‌సీ కోరారు. సాంబయ్య ఎల్‌సీ క్లియర్ కన్‌ఫర్మ్ అని బానోత్ దేవేందర్‌తో చెప్పాడు. ఈ క్రమంలో విద్యుత్ స్తంభం ఏర్పాటు పనిని ప్రారంభిస్తుండగా విద్యుత్ సరఫరా అవడంతో మూడు వినోద్‌తో పాటు, భూక్యా స్వామి అపస్మారక స్థితికి చేరుకున్నారు. వెంటనే వారిని దగ్గర్లో ఉన్న మెడికేర్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మూడ్ వినోద్(35) అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ప్రాణాపాయ స్థితిలోఉన్న స్వామిని మరో ఆసుపత్రికి తరలించారు. కాగా ఎల్‌సీ క్లియర్ అంటూ తప్పుడు సమాచారం ఇచ్చిన లైన్‌మెన్ కొడం సాంబయ్యతో పాటు విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఏడీ పి.చంద్రమౌళి, ఏఈ దేవరాయ సంపత్, లైన్‌ఇన్‌స్పెక్టర్ భద్రయ్యలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మృతుడు వినోద్ తల్లి సంధ్య మిల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో శనివారం కేసు నమోదు చేశారు.

ప్రకృతి పండుగకు పూలు కరువు

- కనిపించని తంగేడు, గునుగు పూల చెట్లు
- రసాయనిక మందులు, యంత్రాల వాడకమే కారణం
- మాయమైపోతున్న కంచెలు, బీడు భూములు
- బతుకమ్మ పండుగకు అతివల తిప్పలు
- రోడ్లపై కొనుగోలు చేస్తున్న వైనం
- రంగులద్ది అమ్ముతున్న వ్యాపారులు



తంగేడు పువ్వు



గునుగు పువ్వు

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిని పూజించే సంస్కృతి దేశ వ్యాప్తంగా కన్నా తెలంగాణ రాష్ట్రంలోనే ఎక్కువగా ఉంటుంది. దానికి నిదర్శనమే బతుకమ్మ పండుగ. ప్రకృతి ప్రసాదించిన పూలను ఎంతో అలంకార ప్రాయంగా పేర్చి, కూర్చి, అందులో పసుపు ముద్దను పెట్టి గౌరమ్మగా భావిస్తారు. వాటికి పూజలు చేయడంతో పాటు మహిళలంతా ఒక్కచోటచేరి పాటలు పాడుతూ నృత్యాలు చేస్తారు. ఇలాంటి సంస్కృతి దేశంలో మరెక్కడా కనిపించదు. అందుకే బతుకమ్మ పండుగ తెలంగాణ రాష్ట్ర పండుగగా కీర్తించబడుతోంది. కానీ, అదే ప్రకృతి పండుగకు పూలు కరువవడం ఒకింత బాధపడాల్సిందే.

కనిపించని తంగేడు, గునుగు..

బతుకమ్మ పండుగ అంటేనే పూల పండుగ. ప్రధానంగా తంగేడు, గునుగు పూలు లేనిది మహిళలు బతుకమ్మను పేర్చరు. ఎంత దూరమైనా, ఎంత ఖర్చయినా సరే తంగేడు, గునుగు పూలు పెట్టి బతుకమ్మను చేయాల్సిందే. ఆ పూలు ఉంటేనే బతుకమ్మకు అలంకారమనేది మహిళల ప్రగాఢ నమ్మకం. అలాంటి పూలు ఇప్పుడు గ్రామాల్లో కనిపించడం లేదు. గతంలో ఎక్కడ పడితే అక్కడ తంగేడు పూలు కనిపించేవి. పంట చేలల్లో, పొలం గట్ల వెంట గునుగు పూల చెట్లు నిగనిగ మెరిసేవి. కానీ, పూలను చూద్దామంటే కూడా కనిపించక పోవడంతో ఇక బతుకమ్మ పండుగకు పూల కరువు కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

రసాయనిక మందులు, యంత్రాల వాడకమే..

గతంలో వ్యవసాయాన్ని ఎక్కువగా సేంద్రీయ పద్ధతిలో చేసేవారు. దీనికి తోడు భూమిని దున్నాలంటే నాగళ్లతో పశువుల సహాయంతో దున్నేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి గ్రామాల్లో ఎక్కడా కనిపించడం లేదు. సేంద్రీయ వ్యవసాయం పక్కన పెట్టి ఇష్టానుసారంగా రసాయన మందుల వాడడంతో ప్రకృతి సిద్ధంగా పెరిగే తంగేడు, గునుగు పూల మొక్కలు కనిపించడం లేదు. దీనికి తోడు ఎక్కువగా గడ్డి మందును వాడడం సైతం ఈ మొక్కల పెరుగుదలకు ఆటంకం కలుగుతోందని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. పొలంలో, పొలం గట్ల వెంట, చేనుల్లో పెరిగే కొన్ని మొక్కలు సైతం యంత్రాల సహాయంతో దున్నడంతో భూమిలో కలిసిపోతున్నాయి. తద్వారా తంగేడు, గునుగు పూల చెట్లు కనుమరుగవుతున్నాయి.

రంగులద్ది అమ్ముతున్న వ్యాపారులు..

తంగేడు, గునుగు పూలు లభించక పోవడంతో కొంత మంది వీటిని రోడ్లపైకి తీసుకువచ్చి ప్రజలకు అమ్మకాలు జరుపుతున్నారు. వీటికి తోడు గునుగు పూలకు ఏకంగా రంగులద్ది అమ్ముతున్నారు. కట్టలుగా కట్టి తంగేడు, గునుగుతో పాటు బంతి, చామంతి, మందార లాంటి ఇతర పూలను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుతం బంతి పూలు కిలో రూ.150 ఉండగా, చామంతి పూలు రూ.400 వరకు పలుకుతున్నాయి. వీటికి తోడు తంగేడు కట్ట రూ.50 కాగా, గునుగు పూల కట్టకు రంగులద్ది ఇస్తే రూ.100 వరకు తీసుకుంటున్నారు.

మాయమైపోతున్న కంచెలు..

ఒకప్పుడు ప్రతి గ్రామంలోసైతం ఊరి చివరన కంచెలు ఉండేవి. వాటికి తోడు బీడు భూములు సైతం కనిపించేవి. వాటిల్లో తంగేడు, గునుగు పూల చెట్లు ఎక్కువగా పెరిగేవి. దాదాపు ఊరంతటికి సరిపోయేంత పూలు లభించేవి. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. జనాభా పెరుగుతుండడంతో కొద్ది భూములు సైతం సాగులోకి వచ్చేస్తున్నాయి. కంచెలు, బీడు భూములు ఏమున్నా మనిషి ఆధునిక పరికరాలతో సాగులోకి తెచ్చేస్తున్నాడు. తద్వారా పూల మొక్కలు కనుమరుగవుతున్నాయి. ప్రస్తుతం రోడ్లు, చెరువులు, కుంటల వెంట కొన్ని తంగేడు చెట్లు పెరగడంతో కొంతమందికి మాత్రమే పూలు లభిస్తున్నాయి. వాటిని కూడా కొందరు తెంపుకుని నగరాలకు తరలించి అమ్మేసుకుంటున్నారు. దీంతో గ్రామీణ ప్రాంత వాసులు కూడా రోడ్లపైకి వచ్చి కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది.

ఓ-పాజిటివ్‌కు బదులు బి-పాజిటివ్..

- రక్తం ఎక్కించడంలో వైద్య సిబ్బంది తప్పిదం
- రోగి పరిస్థితి విషమం.. ఎంజీఎంలో కలకలం

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో రోగులపై మరోసారి నిర్లక్ష్యం బయటపడింది. ఒక గ్రూపు రక్తం బదులు మరో గ్రూప్ రక్తాన్ని రోగికి ఎక్కించారు. రోగి ఆరోగ్యం విషమంగా మారడంతో గుట్టుచప్పుడు కాకుండా రోగికి చికిత్స అందిస్తున్నారు. ఎంజీఎం ఆస్పత్రిలోని ఫీమేల్ మెడికల్ వార్డులో జ్యోతి అనే రోగికి ఓ-పాజిటివ్ బ్లడ్‌కు బదులుగా బి-పాజిటివ్ బ్లడ్ ఎక్కించారు. రోగి వెంటనే అపస్మారక స్థితిలోకి వెళ్లింది. సీనియర్ వైద్యులు రంగంలోకి దిగి ఎందుకు ఇలా జరిగిందని ఆరా తీయగా.. మరో బ్లడ్ గ్రూప్ రక్తం ఎక్కించారని వెల్లడైంది. వెంటనే వైద్యులు గుట్టుచప్పుడు కాకుండా చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం జ్యోతి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. రోగి బంధువులు వైద్యులపై మండిపడుతున్నారు.

విచారణకు ఆదేశం

ఎంజీఎం ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంక్‌పై విచారణకు ఆదేశించినట్లు ఎంజీఎం ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ చిలుక మురళి తెలిపారు. రక్తం గ్రూప్ మారడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలిపారు. రోగి ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు స్పష్టం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామన్నారు. విచారణ కమిటీ నివేదిక అందగానే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

'దసరా ఉత్సవం'పై ముదురుతున్న వివాదం

- డోలాయమానంలో కాశిబుగ్గ సమితి
- ఎక్కడ, ఎలా నిర్వహించాలనే విషయమై మల్లగుల్లాలు
- ఉత్సవాలను తామే నిర్వహిస్తామంటున్న 14వ డివిజన్ నాయకులు
- వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ప్రోత్సాహంతో ముందుకు...



ఏనుమాముల మార్కెట్‌లో సమావేశమైన అన్ని పార్టీల నాయకులు

వరంగల్ సిటీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): 30 ఏళ్ల పాటు వైభవంగా దసరా ఉత్సవాలను నిర్వహించిన కాశిబుగ్గ దసరా ఉత్సవ సమితి నాయకుల పరిస్థితి ప్రస్తుతం 'ముందు నుయ్యి.. వెనుక గొయ్యి' అన్న చందంగా తయారైంది. 'కాశిబుగ్గ దసరాతో కొత్త చిక్కు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనంతో శనివారం వారు అత్యవసరంగా సమావేశమయ్యారు. 14వ డివిజన్‌కు చెందిన అన్నిపార్టీల నాయకులు 'మా డివిజన్‌లో మేమే దసరా ఉత్సవాలను నిర్వహించుకుంటాం' అంటూ తీర్మానం చేసుకున్నారు. దీంతో కాశిబుగ్గ దసరా ఉత్సవ సమితి ఏం చేయాలో తెలియని స్థితిలో పడిపోయింది. వారు కూడా వెంటనే సమావేశమై పరిస్థితిని సమీక్షించుకున్నారు. ఇప్పటికే చందాల విషయంలో అనేక ఆరోపణలు రావడం, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి ఈ విషయంలో మందలించడంతో ఉత్సవాలు నిర్వహిద్దామా.. వద్దా.. అని చర్చించారు. చివరికి కొన్ని ప్రతిపాదనలతో ముందుకు సాగాలని తీర్మానం చేసుకున్నట్లు తెలిసింది.

14వ డివిజన్‌కు చెందిన నాయకులతో మాట్లాడి ఉమ్మడిగా ఉత్సవాలను నిర్వహించుకునేలా ఒప్పించాలని, ఉత్సవాలు జరిగే స్థలం 14వ డివిజన్ కాదు, 20వ డివిజన్ కిందకే వస్తుందని చెప్పాలని, వర్ధన్నపేట శాసనసభ్యుడు కేఆర్ నాగరాజు, కొండా సురేఖ, మురళీధర్‌రావులను కలిసి ఉత్సవాలు నిర్వహించుకునేలా సహకరించాలని కోరాలని, గతంలో మాదిరిగా 'కుడా' పర్మిషన్ తీసుకుని ఓసిటీ స్టేడియంలో ఉత్సవాలు నిర్వహించాలని, లేదంటే దసరా ఉత్సవాలను 14వ డివిజన్ వారికి అప్పజెప్పాలని.. ఇలా అనేక అంశాలపై చర్చించినట్టు తెలిసింది. అలాగే దసరా పరపతి సంఘం సమావేశం ఏర్పాటుచేసి డబ్బుల లెక్కలు తీసి క్లియర్ చేయాలనే అంశంపైనా చర్చించినట్టు సమాచారం.

మా ఏరియాలో మీ పెత్తనమేంటి?

"మా నియోజకవర్గంలో మీ పెత్తనం ఏమిటి?" అంటూ కాశిబుగ్గ దసరా ఉత్సవ సమితి నాయకుడికి శనివారం వర్ధన్నపేట శాసనసభ్యుడు కేఆర్ నాగరాజు ఫోన్‌చేసి మందలించినట్లు తెలిసింది. మీ పరిధిలో మీరుండాలని, అంతకుమించి పోవద్దని సూచించినట్లు తెలిసింది. మరోవైపు 14వడివిజన్ నాయకులతో మాట్లాడి కొత్తగా కమిటీని ఏర్పాటు చేసుకోవాలని సూచించినట్లు సమాచారం. దీంతో అన్ని పార్టీల నాయకులతో ఉత్సవాలను నిర్వహించేందుకు సమావేశం ఏర్పాటు చేసుకున్నట్లు తెలిసింది.

ఉత్సవాలను మేమే నిర్వహించుకుంటాం..

'దసరాతో కొత్త చిక్కు' అన్న శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనంతో 14వ డివిజన్ నాయకులు ఆలోచనలో పడ్డారు. వెంటనే అఖిలపక్ష నాయకులు సమావేశమయ్యారు. ఈ సమావేశానికి స్థానిక కార్పొరేటర్ తూర్పాటి సులోచన సారయ్య అధ్యక్షత వహించారు. "మన డివిజన్ పరిధిలో జరుగుతున్న ఉత్సవాలకు మనల్ని ఆహ్వానించకుండా, మన ప్రమేయం లేకుండానే కాశిబుగ్గ దసరా కమిటీ ఉత్సవాలు నిర్వహించడం సరికాదు..' అంటూ ఖండించారు. ఏర్పాట్లన్నీ ప్రభుత్వ శాఖలే నిర్వహిస్తుండగా ఒక బొమ్మ మాత్రమే దసరా ఉత్సవ సమితి వాళ్లు ఏర్పాటు చేసి ఉత్సవాలను నిర్వహిస్తున్నారని, వాటిని మనమే ఘనంగా నిర్వహించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసుకున్నారు. ఈ మేరకు శాసనసభ్యుడు నాగరాజును కలిసి ఏర్పాట్లు చేయించాలని కోరాలని నిర్ణయించారు.



అత్యవసర సమావేశంలో పాల్గొన్న కాశిబుగ్గ దసరా ఉత్సవ సమితి నాయకులు

అన్నంత పని చేశాడు..

- మరణాన్ని కావాలనే ఆహ్వానించాడు..
- సురేందర్ ఆత్మహత్యతో రాంనగర్‌లో విషాదం
- స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించిన కుటుంబసభ్యులు

ఐనవోలు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కొన్ని రోజులుగా మానసిక వ్యథతో బాధపడుతూ అన్నంత పనిచేశాడు.. చావాలనిపిస్తోందని తనువు చాలించాడు. టీబీ నగర్‌లో ఆత్మహత్య చేసుకున్న బ్యాంక్ ఉద్యోగి ఉదంతం స్వస్థలం రాంగనర్‌లో కుటుంబసభ్యులు, బంధుమిత్రులు జీర్ణించుకోలేకపోతున్నారు.

ఐనవోలు మండలంలోని రాంనగర్ గ్రామానికి చెందిన బర్ల సోమయ్య - ఐలమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు సురేందర్, నాగరాజు, కూతురు లత ఉన్నారు. తండ్రి గతంలోనే చనిపోయాడు. బీద కుటుంబమైనప్పటికీ ఇద్దరు కుమారులు కష్టపడి ఉన్నత చదువులు చదివి బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగాలు చేస్తున్నారు. బర్ల సురేందర్(36) ఎంటెక్ విద్యను అభ్యసించాడు. కొన్నేళ్లుగా హెచ్‌డీఎఫ్‌సీలాంటి బ్యాంకుల్లో ఉద్యోగం చేశాడు. నెల కిందట నుంచి ఐసీఐసీఐ హైదరాబాద్ హైటెక్ సిటీ మాదాపూర్ బ్రాంచ్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రామంతాపూర్‌లో నివాసముంటున్న అతడికి భార్య సంధ్యరాణి, కుమారుడు సాకేత్ ఉన్నారు. అతడు శుక్రవారం డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లి టీబీనగర్ చెరువు కట్టపైకి వెళ్లాడు. తనను చావు పిలుస్తోందని కుటుంబసభ్యులకు వాట్సాప్ మేసేజ్ చేసి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం మృతదేహాన్ని గుర్తించి వెలికితీసి స్వగ్రామానికి తీసుకవచ్చి అంత్రక్రియలు నిర్వహించారు. అయితే అతడి మరణం అందరినీ ఆందోళనకు గురిచేసింది. తనకు మరణం తప్పదని కొంతకాలంగా కుటుంబసభ్యులు, బంధుమిత్రుల దృష్టికి తీసుకవచ్చినప్పటికీ ఆత్మహత్య వేదన అతడి మనుసును వీడలేదు.



సురేందర్(ఫైల్)

మానసిక వైద్యుడిని సంప్రదిస్తే బతికేవాడు..

సురేందర్ కొన్ని రోజులుగా చావాలనిపిస్తోందని కుటుంబసభ్యులకు చెబితే అతడికి ధైర్యం చెప్పే ప్రయత్నం చేశారు. ఉద్యోగంలో ఏమైనా ఇబ్బంది ఉందా?, ఆర్థిక సమస్యలు, కుటుంబసమస్యలు ఏమైనా ఇబ్బందిపెడుతున్నాయా? అని కుటుంసభ్యులు అడిగి తెలుసుకున్నారు. తనకు కుటుంబం, ఆర్థిక సమస్యలు లేవని చెప్పుతూనే కొత్త ఉద్యోగం చేయలేకపోతున్నానని ఒక మాట చెప్పాడట. ఉద్యోగం మానేసి పాత ఉద్యోగం చేయమని సలహాలు ఇచ్చారు తప్ప.. చనిపోయే ఆలోచన ఎందుకు వస్తోందని మానసిక వైద్యుడి వద్దకు తీసుకెళ్లలేదు. మానసిక వైద్యుడి దగ్గరకు తీసుకెళితే చావు తప్పేదని అతడి అంత్రక్రియల్లో పాల్గొన్న స్థానికులు, విద్యావంతులు విచారం వ్యక్తం చేశారు.

దామెర చెరువు అభివృద్ధికి చర్యలు

- అభివృద్ధి పనులకు రూ.2.50 కోట్లతో ప్రతిపాదనలు
- నీటిపారుదల శాఖ ఈఈ తోట కిరణ్‌కుమార్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కరీమాబాద్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఖిలావరంగల్ మండలంలోని జక్కలొద్ది సమీపంలో ఉన్న దామెర చెరువు పరిరక్షణ, అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని నీటిపారుదల శాఖ ఈఈ తోట కిరణ్‌కుమార్ తెలిపారు. 'దామెర చెరువుపై నిర్లక్ష్యమేల?' అనే శీర్షికతో శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' జిల్లా అనుబంధంలో కథనం ప్రచురితమైన విషయం విదితమే. పని చేయని తూములు, కుంగిన కట్ట, రెండు వైపులా పెరిగిన చెట్లు, నీటి పారకం కాల్వల దుస్థితి.. ఇలా చెరువు వద్ద నెలకొన్న దుస్థితిని కథనం కళ్లకు కట్టింది. ఈ నేపథ్యంలో ఈఈ కిరణ్‌కుమార్, డీఈ మధుసూదన్‌రెడ్డి శనివారం చెరువును సందర్శించారు. స్థానిక రైతు ప్రతినిధులతో కలిసి దాదాపు రెండు గంటలపాటు చెరువు సమస్యలను పరిశీలించారు. పాడైపోయిన రెండు తూములను స్వయంగా చూశారు. పలుచోట్ల కోతకు గురై కుంగిన కట్టను పరిశీలించారు. కట్టపైన పెద్దఎత్తున మొలిచిన చెట్లు, పొదలను తిలకించారు. రైతులతో కలిసి కట్టపైన అతికష్టమ్మీద నడిచారు. చెరువు వద్దకు వెళ్లే దారి బురదమయం కాగా, మసీదు బండ నుంచి కట్ట వరకు స్వయంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా రైతులు చెరువు సమస్యలను ఏకరువు పెట్టారు. ఇరిగేషన్ అధికారులు గత పదేళ్లుగా చెరువు నిర్వహణను పట్టించుకోలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తూములు తెరుచుకోక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ఇప్పటికే చెరువు నిండు కుండలా మారిందని, ఇంకా వర్షాలు పడుతున్నందున కట్టకు గండి పడితే రైతులకు, నగరవాసులకు తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. వెంటనే మరమ్మతులతో పాటు అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు.

రైతుల గోడును సావధానంగా విన్న అనంతరం ఈఈ తోట కిరణ్‌కుమార్ స్పందిస్తూ.. దామెర చెరువు అభివృద్ధి పనులకు రూ.2.50 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామని తెలిపారు. చెరువు పరిస్థితిపై వరంగల్ నిట్ నిపుణులతో అధ్యయనం చేయించామని, వారు ఇచ్చిన నివేదిక ఆధారంగా అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. మత్స్యశాఖ నుంచి ఈత నిపుణులను పిలిపించి తక్షణ చర్యగా తూముల పునరుద్ధరణ చేస్తామని తెలిపారు. అలాగే గట్టమ్మనుంచి చెరువుకట్ట వరకు రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో నీటి వినియోగదారుల సంఘం మాజీ అధ్యక్షుడు శెంకేశి శ్రీనివాస మూర్తి, స్విమ్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శేర్ల అనిల్‌కుమార్, స్థానిక రైతులు శెంకేశి వెంకటేశ్వర్లు, సత్యనారాయణ మూర్తి, సుధాకర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, దామెర చెరువు దుస్థితిని వెలుగులోకి తీసుకవచ్చిన 'ఆంధ్రజ్యోతి'కి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.



దామెర చెరువు కట్టను పరిశీలిస్తున్న నీటిపారుదల శాఖ ఈఈ తోట కిరణ్‌కుమార్‌తో స్థానిక రైతులు

పూజా మందిరాల నిర్మాణమెప్పుడు?

- మేడారంలో ఏడాది గడిచినా గుడి పనులకు కలగని మోక్షం
- టెండర్లు ముగిసి నెలలు గడుస్తున్నా ప్రారంభం కాని నిర్మాణాలు
- మరో కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించాలంటున్న పూజారులు



మేడారంలో సమ్మక్క పూజా మందిరం

తాడ్వాయి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల ఇలవేల్పుల పూజా మందిరాల నిర్మాణానికి నేటికి మోక్షం కలగడం లేదు. భక్తుల కల్పవల్లులుగా పేరొందిన ఆ తల్లుల గుడులు కట్టడంలో ఎందుకు ఇంత జాప్యం చేస్తున్నారని పలువురు పూజారులు, భక్తులు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమ్మక్క, సారలమ్మ గుడుల శాశ్వత నిర్మాణాలకు నిధులు మంజూరు చేసినా పనులు మాత్రం ఇంత వరకూ ప్రారంభం కాకపోవడం శోచనీయం. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క సారలమ్మల పూజా మందిరాల ఆధునీకరణ నిర్మాణ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.1.80 కోట్లు మంజూరు చేసింది.

2024 సెప్టెంబరు నెలలో ప్రణాళికలు రూపొందించి శిథిలావస్థలో ఉన్న మేడారం గ్రామంలో ఉన్న సమ్మక్క గుడికి రూ.90లక్షలు, కన్నెపల్లి గ్రామంలో ఉన్న సారలమ్మ గుడికి రూ.90 లక్షల నిధులతో శాశ్వత ప్రాతిపదికన రాతి కట్టడాలకు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. గుత్తేదారులను పిలిచి టెండర్లు తీసుకున్నారు. ఈ క్రమంలో మినీ జాతర, ఎమ్మెల్సీ ఎన్నికలు అడ్డు రావడంతో పనులు వాయిదా పడ్డాయి. మార్చిలో తిరిగి టెండర్లను అధికారులు విప్పి సదరు కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. కాగా పనులు నేటికి ప్రారంభానికి నోచుకోకపోవడంతో పూజారుల్లో అసంతృప్తి నెలకొంది. వర్షాకాలం గుడులు కురుస్తున్నాయని పూజారులు అంటున్నారు. వనదేవతల పూజా మందిరాల నిర్మాణ పనులు ప్రారంభమై మహా జాతర వరకు పూర్తవుతాయన్న పూజారుల ఆశలు ఆవిరయ్యేట్లు ఉన్నాయి.

కాంట్రాక్టర్ తీరుపై విమర్శలు..

ఏడాది గడుస్తున్నా మేడారం సమ్మక్క, సారలమ్మల మందిర నిర్మాణ పనులు చేపట్టకపోవడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రెండు గుడుల నిర్మాణానికి కాంట్రక్టర్ సముఖంగా ఉన్నాడా...? లేదా అనే చర్చ జరుగుతోంది. మేడారం దేవస్థానం గత కార్యనిర్వహణ అధికారి రాజేంద్రం సదరు కాంట్రాక్టర్‌కు నోటీసులు పంపినట్లు సమాచారం. అయినప్పటికీ స్పందించక పోవడం గమనార్హం. అధికారులు ఈ టెండర్‌ను రద్దు చేసి మరలా రీ టెండర్ వేస్తారా...? అనే అనుమానాలు ఉన్నాయి. ఇదిలా ఉండగా పూజారులు కాంట్రాక్టర్‌ను మార్చి పనులు వేగవంతం చేయాలని కోరుతున్నారు. మాస్టర్ ప్లాన్ కంటే ముందు పనులను అధికారులు కుంటుపడేశారని, పనులు చేపట్టడంలో జాప్యం జరుగుతుందని పూజారులు అంటున్నారు. ప్రణాళికలు రూపొందించిన నాటి నుంచి సమ్మక్క, సారలమ్మ గుడులపై అధికారులు చిన్నచూపుగా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. గతంలో మినీ జాతర అడ్డు వస్తే ఈ సారి మహా జాతర అడ్డు వస్తుందా...! అని మాట్లాడుతున్నారు. వెంటనే పనులు చేపట్టాలని పూజారులు కోరుతున్నారు.



ఆర్కిటెక్చర్లు రూపొందించిన మందిరాల డిజైన్



కన్నెపల్లిలో సారలమ్మ పూజా మందిరం

గుడి కురుస్తోంది..

- సిద్ధబోయిన మునీందర్, ప్రధాన పూజారి

వర్షం కురిస్తే సమ్మక్క గుడి కురుస్తోంది పునర్నిర్మాణం జరుగుతుందని ఆశ పడ్డాం. గుడి అభివృద్ధి జరగాలని గట్టి కోరిక ఉంది. దేవాదాయ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. కార్యనిర్వహణ అధికారి మారి పనులు కుంటుపడ్డాయి. పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క దృష్టి సారించి గద్దెల అభివృద్ధితో పాటుగా మేడారంలో ఉన్న సమ్మక్క గుడి, కన్నెపల్లిలో ఉన్న సారలమ్మల పూజా మందిరాలను అభివృద్ధి చేయాలి.

పెన్షన్లు పెంచాలని కార్పొరేటర్ కార్యాలయం ముట్టడి

న్యూశాయంపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు శనివారం వికలాంగుల హక్కుల పోరాట సమితి, చేయూత పెన్షన్‌దారుల హక్కుల పోరాట సమితి, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో న్యూశాయంపేటలోని 31వ డివిజన్ కార్పొరేటర్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా చేయూత పెన్షన్‌దారులకు రూ.4వేలు, వికలాంగులకు రూ.6వేలు పెంచే వరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. అనంతరం 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజుయాదవ్‌కు పెన్షన్లు పెంచే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకునే విధంగా కృషి చేయాలని డిమాండ్‌లతో కూడిన వినతిపత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంద రాజు మాదిగ, వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు దూడల శ్రీనివాస్, మాదిగ యువసేన నాయకులు చాతల్ల శివ మాదిగ, సోషల్ మీడియా ఇన్‌చార్జి మంద వర్ధన్ మాదిగ, చేయూత పెన్షన్‌దారుల హక్కుల పోరాట సమితి నాయకులు రాము, అంజయ్య, వస్కుల మూర్తి, పారునంది రాజయ్య, వస్కుల బాబు, స్వరూప, జ్యోతి, మమత తదితరులు పాల్గొన్నారు.

రావణాసుర వధను విజయవంతం చేయండి

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ పద్మాక్షి సిద్దేశ్వర ప్రాంగణంలో దసరా పర్వదినం రోజున నగర వాసులకు ఆహ్లాదం కలిగించే రీతిలో పెద్దఎత్తున నిర్వహించే రావణసుర వధ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వరంగల్‌పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి నగర వాసులను కోరారు. దీనికి సంబంధించిన ప్రచార కరపత్రాన్ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రావణసుర వధ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ రావుల సుదర్శన్‌తో కలిసి శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సాంబరాజు రాజ్‌కుమార్, పూలగందం రాజారాం, తోట పవన్ కుమార్, కనుకుంట్ల రవికుమార్, కోన శ్రీకర్, గంటా సంపత్ పాల్గొన్నారు.

హక్కులపై ట్రాన్స్‌జెండర్స్‌కు అవగాహన ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి నిర్మల గీతాంబ

వరంగల్ లీగల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌జెండర్స్ తమ హక్కులపై అవగాహన పెంచుకోవాలని, తద్వారా వేధింపుల నుంచి రక్షణ పొందగలుగుతారని వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ కం జిల్లా జడ్జి నిర్మల గీతాంబ సూచించారు. శనివారం ట్రాన్స్‌జెండర్ హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయసేవా సదన్ భవన్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి జిల్లా జడ్జి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. సమాజంలో వివిధరకాల వ్యక్తుల వేధింపుల నుంచి న్యాయపరంగా రక్షణ పొందేందుకు న్యాయసేవాధికార సంస్థలను ఆశ్రయించవచ్చని ఆమె పేర్కొన్నారు. ట్రాన్స్‌జెండర్లను వేధించిన వారికి చట్టపరంగా శిక్షించే అవకాశం ఉందని, వీటిని దృష్టిలో ఉంచుకొని ట్రాన్స్‌జెండర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను సమీప పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, లేదంటే న్యాయసేవా సంస్థలను ఆశ్రయించి న్యాయ సహాయం పొందాలని జిల్లా జడ్జి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.సాయికుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వలుస సుధీర్, న్యాయవాది తీగల జీవన్‌గౌడ్, మాస్ కమ్యూనిటీ నుంచి లైలా, మరో 70 మంది ట్రాన్స్‌జెండర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థులు ఎదిగినప్పుడే తల్లిదండ్రులకు గౌరవం



గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న విద్యార్థులు, యాజమాన్యం

హసన్‌పర్తి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు జీవితంలో గొప్పగా ఎదిగినప్పుడే తల్లిదండ్రులకు సమాజంలో మంచి గౌరవం ఉంటుందని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వరంగల్ ప్రిన్సిపాల్ భైరి ప్రభాకర్ అన్నారు. భీమారం ఎస్‌వీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం పాలిటెక్నిక్ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎస్‌వీఎస్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు అధ్యక్షతన జరిగిన గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా వర ంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ భైరి ప్రభాకర్ హాజరయ్యారు. విశిష్ట అతిథులుగా డాక్టర్ ఎర్రబెల్లి వెంకటేశ్వర్‌రావు హాజరై మాట్లాడారు. సమాజంలో సాంకేతిక విద్యతోనే ఉపాధిరంగంలో మంచి అవకాశాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా రాణించాలన్నారు. అనంతరం ఎస్‌వీఎస్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు మాట్లాడుతూ.. సాంకేతిక విద్యాశాఖ, రాష్ట్ర సాంకేతిక ఎడ్యుకేషన్, ట్రైనింగ్ బోర్డు నిర్ణయం మేరకు కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించి ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశామని తెలిపారు. ఎస్‌వీఎస్ విద్యాసంస్థలో చదివి ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు విప్రో లాంటి పలు ఎంఎన్‌సీ కంపెనీల ఇంటర్వ్యూలకు ఎంపికై ఉద్యోగాలు పొందడం హర్షనీయ మన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎస్‌టెట్ సెక్రటరీ ఎ.పుల్లయ్య, ప్రొఫెసర్ ఏకే.రాథోడ్, ఎం.రంజిత్, ఎం.నోవత్న, ప్రిన్సిపాళ్లు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆపరేషన్ ముస్కాన్ టీమ్‌కు సీపీ అభినందనలు



ఏహెచ్‌టీయూ సీఐ శ్యాంసుందర్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న సీపీ

వరంగల్ క్రైం, సెప్టెంబర్ 20(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ ముస్కాన్ 11వ విడతను విజయవంతం చేసి 177 మంది చిన్నారులను వెట్టిచాకిరి నుంచి విముక్తి కలిగించిన పోలీస్ అధికారులతో ఇతర ప్రభుత్వ శాఖల అధికారులను శనివారం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. అందరి సమన్వయంతో ఆపరేషన్ ముస్కాన్ సక్సెస్ అయిందని, రానున్న రోజుల్లో రెస్క్యూ చేయబడ్డ పిల్లలు బాలకార్మికులుగా మారకుండా పునరావాస కార్యక్రమాలు చేపట్టాలన్నారు. బాలకార్మిక రహిత సమాజమే అందరి లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ, జనగాల జిల్లాల చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్స్ వసుధ, అనిల్ చందర్‌రావు, ఉప్పలయ్య, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్, హనుమకొండ బాల రక్షా భవన్ కో-ఆర్డినేటర్ అవంతి, మూడుజిల్లాల బాలల సంరక్షణ విభాగం అధికారులు ఉమ, రవికాంత్, ప్రవీణ్‌కుమార్, కార్మికశాఖ అధికారులు వినోద్‌కుమార్, కుమారస్వామి, చైల్డ్ హెల్ప్‌లైన్ కో-ఆర్డినేటర్స్ కల్పన. భాస్కర్, రవికుమార్, షేర్ ఎన్జీఓ, స్కోప్ ఎన్జీఓ కోఆర్డినేటర్లు శిరీష, మనోజ్, ముస్కాన్ 11వ విడత డివిజన్ ఇంచార్జీ ఎస్సైలు రాజన్‌బాబు, రవికుమార్, సతీష్, చాంద్‌పాషా, రమేశ్, సిద్దయ్య, ఏహెచ్‌టీయు ఎస్సై సుధాకర్, భాగ్యలక్ష్మీ, హెడ్‌కానిస్టేబుల్ సముద్దీన్, కానిస్టేబుల్ శ్రీనివాస్, రామారావు, హోంగార్డు పాషా తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు చేయూత పెన్షన్ అందించాలి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల కోసం ప్రకటించిన చేయూత పెన్షన్ వెంటనే అందజేయాలని ఎంఆర్‌పీఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్ మాదిగ డిమాండ్ చేశారు. మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు గ్రామపంచాయితీలు, మునిసిపల్ కార్పొరేషన్‌ల ముట్టడి కార్యక్రమంలో భాగంగా శనివారం గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వికలాంగులు పెద్ద ఎత్తున హాజరై నినాదాలు చేశారు. ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో కార్యాలయాన్ని ముట్టడించారు. కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించగా మట్టెవాడ పోలీసులు విషయం తెలుసుకుని నిరసనకారులను శాంతింపజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ.. వికలాంగులకు రూ.6వేల పెన్షన్ పెంచాలని, అదే విధంగా వృద్ధులకు, వితంతువులకు ఎన్నికల ముందు ఇచ్చిన రూ.4వేల హామీ వెంటనే అమలు చేయాలన్నారు. విషయం తెలుసుకున్న కమిషనర్ వినతిపత్రాన్ని స్వీకరించి వికలాంగుల సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళతానని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వేల్పుల సూరన్న, వికలాంగుల హక్కుల పోరాట సమితి తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి చంద్రశేఖర్, ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు కన్నెబోయిన ప్రమోద్, రాజు పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు



షైన్ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

బాలసముద్రం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రంలోని శ్రీనివాస్ గురుకుల్ పాఠశాలలో శనివారం ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థినులు, ఉపాధ్యాయులు అంతా కలిసి బతుకమ్మను పేరుస్తూ పాటలు పాడుతూ బతుకమ్మ విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ చిదురాల సోమరత్నం మాట్లాడుతూ.. నేటి యువతరానికి ఇలాంటి పండుగల విశిష్టతలను, విలువలను తెలియజేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు ఉందని అన్నారు. కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించినందుకు పాఠశాల ప్రిన్సిపాల్ యుగంధర్‌ను ఉపాధ్యాయులు వినయ్, మధు, విజయ్, రజినీకాంత్, ప్రసాద్, హఫీజా, సదానందం, మహేష్, అనూష, గీత, రాధిక, రజనీ, లావణ్య, శిరీష, దివ్య, కల్యాణిలను కరస్పాండెంట్ సోమరత్నం అభినందించారు.



ఏకశిల పాఠశాలలో బతుకమ్మ సంబరాలు

షైన్ కళాశాలలో..

హనుమకొండ బాలసముద్రంలోని షైన్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను విద్యార్థులు ఉత్సాహంగా జరుపుకున్నారు. విద్యా సంస్థల చైర్మన్ మూగుల కుమార్ యాదవ్, డైరెక్టర్లు మూగుల రమ, అరూరి కవిత, మూగుల రమేష్ యాదవ్ బతుకమ్మ పండుగ విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు మారబోయిన రాజు గౌడ్, పి.శ్రీనివాస్‌గౌడ్, రాజ్‌కుమార్, సబిత, ప్రశాంత్, అధ్యాపక బృందం, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

షైన్ పాఠశాలలో..

రాంనగర్: రాంనగర్‌లోని షైన్ ఉన్నత పాఠశాలలో శనివారం బతుకమ్మ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం సంప్రదాయ దుస్తులతో తరలివచ్చి తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి కోలాటాలు ఆడారు. ఈ సందర్భంగా షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రకృతిని, పూలను పూజించే సంప్రదాయం కేవలం తెలంగాణ ప్రజలకు సొంతమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రగతిరెడ్డి, డైరెక్టర్స్ ఎ.కవిత, మూగల రమ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఏకశిల పాఠశాలలో..

రెడ్డికాలనీ: రెడ్డికాలనీలోని ఏకశిల కాన్సెప్ట్ స్కూల్‌లో బతుకమ్మ ఉత్సవాలను శనివారం నిర్వహించారు. విద్యార్థినులు రకరకాల పూల తో బతుకమ్మలను సుందరంగా పేర్చి పాఠశాల ఆవరణలో బతుకమ్మ ఆట ఆడారు. ఈ సందర్భంగా ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. బతుకమ్మ పండగ ప్రాముఖ్యతను, దాని నేపథ్యా న్ని, వివిధ రకాల పూలను, వాటి వినియోగం వెనుక ఉన్న విశిష్టతను వివరించి విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ స్వప్నరెడ్డి, ఉపాధ్యాయులు శోభ, జయ, హరిత, పావని, విజయలక్ష్మి, సుకన్య, విద్యార్థులు పాల్గొన్నారు.

గౌతమి హైస్కూల్‌లో..

వడ్డెపల్లి: హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని గౌతమి హైస్కూల్‌లో ముందస్తు బతుకమ్మ సంబరాలను శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులను ధరించి బతుకమ్మలను భక్తి ప్రపత్తులతో పేర్చారు. ఉయ్యాల పాటలతో ఆద్యంతం అలంరింపజేశాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ టి.రాజేశ్వర్‌రావు, కరస్పాండెంట్ టి.శ్రీలత, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.





శ్రీనివాస్ గురుకుల్‌లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



షైన్ పాఠశాలలో కోలాటం ఆడుతున్న ఉపాధ్యాయినులు



గౌతమ్ హైస్కూల్‌లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

విశ్వవ్యాలీ స్కూల్‌లో..

హనుమకొండ(ఆంధ్రజ్యోతి): హనుమకొండ జవహర్‌కాలనీలోని విశ్వవ్యాలీ ప్రీప్రైమరీ స్కూల్‌లో శనివారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం నుంచి దసరా సెలవులు కావడంతో పాఠశాలల్లో బతుకమ్మ సంబరాలను ఒక రోజు ముందే జరుపుకున్నారు. ఇందు లో భాగంగా విద్యార్థులు ఆడి పాడారు.

విశ్వవ్యాలీ స్కూల్‌లో బతుకమ్మలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు



లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎంపీ డాక్టర్ కడియం కావ్య

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

హనుమకొండ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎంతో మంది పేదల ఆరోగ్యాలకు సీఎంఆర్‌ఎఫ్ పథకం భరోసా కల్పిస్తున్నదని, ఎక్కడా కూడా పేదలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనద్దనే సదుద్దేశంతో ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలుపరుస్తున్నదని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. శనివారం హనుమకొండ కనుకదుర్గ కాలనీలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో 17 మంది లబ్దిదారులకు రూ.6,87,500 విలువైన చెక్కులను సీఎం సహాయ నిధి చెక్కులను ఎంపీ అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

చైతన్య మహిళా సంఘం సదస్సును జయప్రదం చేయాలి

వడ్డెపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో ఈ నెల 24న నిర్వహించే చైతన్య మహిళా సంఘం (సీఎంఎస్) రాష్ట్ర స్థాయి సదస్సును జయప్రదం చేయాలని సీఎంఎస్ రాష్ట్ర కో కన్వీనర్ శ్రీదేవి, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిమంజరి పిలుపునిచ్చారు. హనుమకొండ పబ్లిక్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎంఎస్ ఆవిర్భావ సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ప్రజా సంఘాల నేతలతో కలిసి శనివారం వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భారత్ బచావో రాష్ట్ర నేత వెంగళరెడ్డి, తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర నేత జనగాం కుమారస్వామి, సైంటిఫిక్ స్టడీ ఫోరం రాష్ట్ర నేత చారువాక, సీఎంఎస్ వరంగల్ జిల్లా కన్వీనర్ కళ, ప్రజా సంఘాల నాయకులు జ్యోతిరమణి, రమ, శివ, మహేష్, జ్యోతి పాల్గొన్నారు.

పూల వ్యర్థాలతో కంపోస్ట్ తయారు చేసేలా చర్యలు

- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్
- నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటన

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పూల వ్యర్థాలతో కంపోస్ట్ ఎరువులు తయారు చేసేలా చర్యలు చేపట్టాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అన్నారు. శనివారం హనుమకొండ పరిధిలోని పెట్‌పార్క్‌తో పాటు పబ్లిక్ గార్డెన్ మార్కెట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. చెత్త సేకరణ వాహనాలకు టైం షెడ్యూల్ ఏర్పాటు చేయాలన్నారు. చెత్తను సేకరించే విధంగా స్ట్రీంలైన్ చేయాలన్నారు. వీధి వ్యాపారులు వ్యాపారం పూర్తయిన తర్వాత అక్కడ మిగిలిన చెత్తను అక్కడే వదిలి వెళ్లిపోకుండా గార్బేజ్‌లో వేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. డ్రైన్‌ల నుంచి వెలికితీసిన చెత్తను 24 గంటలలోపు అక్కడి నుంచి డంపింగ్ యార్డ్‌కు తరలించాలన్నారు. బతుకమ్మ పండుగకు మహిళలు పెద్దఎత్తును పూలను సేకరిస్తారని, పూల వ్యర్థాలను ప్రత్యేక వాహనాల ద్వారా అక్కడి నుంచి తరలించాలన్నారు. బాలసముద్రంలో మార్కెట్‌లో పెద్దమొత్తంలో వెలువడే కూరగాయల వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేయకుండా టౌన్‌ప్లానింగ్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, వెటర్నరీ అధికారి డాక్టర్ గోపాల్‌రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్న అనిల్‌కుమార్‌తో పాటు జవాన్‌లు పాల్గొన్నారు.



బాలసముద్రం పూల మార్కెట్ వద్ద తనిఖీలు చేస్తున్న కమిషనర్

ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ మహాసభలు

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ ద్వితీయ మహాసభలు హనుమకొండ రాంనగర్‌లోని సుందరయ్య భవన్‌లో శనివారం కోలాహలంగా ప్రారంభమయ్యాయి. మహా సభల ప్రారంభ కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో రవాణారంగంలో 6కోట్ల మంది, రాష్ట్రంలో 25లక్షల మంది కార్మికులు పని చేస్తున్నా, వీరిగురించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదని ధ్వజమెత్తారు. ప్రైవేటు రంగంలో పనిచేస్తున్న ట్రాన్స్‌పోర్టు కార్మికులు సామాజిక బాధ్యతను నెరవేరుస్తూ ప్రభుత్వానికి పరోక్షంగా సహాయం చేస్తున్నారని గుర్తు చేశారు.

కార్మికుల సంక్షేమం విస్మరించి ఇన్సూరెన్స్, టాక్సీల పేరుతో వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభు త్వం మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం కల్పించటం వలన ఆటో కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు యేటా రూ.12వేల అందిస్తామని హామీ ఇచ్చి నేటికీ అది నెరవేర్చడం లేదన్నారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం యాప్‌ల పేరుతో కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు.

సీపీఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 2019లో మోటార్ వాహనాల చట్టం తీసుకవచ్చి యాక్సిడెంట్ చేసిన కార్మికులకు జైలు, రూ.10లక్షల జరిమానా, లైసెన్సు రద్దు చేయాలని నిబంధన పెట్టి కార్మిలకు ఉసురు పోసుకుంటోందని మండిపడ్డారు. రైల్వే స్టేషన్ల ముందు ఉన్న ఆటో అడ్డాలను ఊరి బయటకు మార్చాలని ఒత్తిడి తెస్తోందన్నారు. రవాణా రంగ కార్మికుల సంక్షేమం కోసం నూతనంగా బోర్డును ఏర్పాటు చేయాలని మహా సభలో ఏకగ్రీవ తీర్మానం చేశామని తెలిపారు. అనంతరం ఈ మహా సభలో 27మందితో కూడిన నూతన కమిటీని నియమించామన్నారు. ఈ సమావేశంలో సంపత్, భానునాయక్, రాజు, లక్ష్మయ్య, రాజన్న, రవీందర్‌తో పాటు 4మండలకు చెందిన 31మంది ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

సెలవుల్లో హాస్టల్స్‌ను తెరిచి ఉంచాలి

- కేయూలో విద్యార్థుల నిరసన

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పోటీ పరీక్షల దృష్ట్యా వర్సిటీలోని హాస్టల్స్‌ను తెరిచి ఉంచాలని కేయూ విద్యార్థులు ఆందోళనలకు దిగారు. ఈ మేరకు శనివారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంను వర్సిటీ పరిపాలన భవనంలో కలిశారు. తమకు పోటీ పరీక్షలున్నాయని, దసరా సెలవులకు హాస్టల్స్ మూసివేస్తే పరీక్షలకు సన్నద్ధం అయ్యేందుకు ఇబ్బందులు ఎదురవుతాయని నివేదించారు. హాస్టల్స్‌ను తెరిచి ఉంచాలని డిమాండ్ చేశారు. దీంతో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం శనివారం మధ్యాహ్నం కేయూ సెనెట్ హాల్‌లో ప్రిన్సిపాల్స్ విభాగాధిపతులు సమావేశం నిర్వహించారు. విద్యార్థులను ఖాళీ చేయాల్సిందేనని వర్సిటీ ఉన్నతాధికారులు పోలీసులకు సమాచారం అందించారు. విద్యార్థులకు ఐడీ కార్డుల్లేకుండా క్యాంపస్‌లోకి అనుమతించకూడదని, నాన్ బోర్డర్లును ఖాళీచేయాల్సిందేని వర్సిటీ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ప్రిన్సిపాల్స్, విభాగాధితుల సమావేశంలో క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, కృష్ణవేణి, అమరవేణి, హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, విభాగాధిపతులు డాక్టర్ సంకినేని వెంకట్, డాక్టర్ చిలివేరు రాజ్‌కుమార్, డాక్టర్ మామిడి లింగయ్య, జాయింట్ డైరెక్టర్లు డాక్టర్ శ్రీనివాస్, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల నిరసన ఆందోళన దృష్ట్యా కేయూ పోలీసులు వర్సిటీ పెట్రోలింగ్ చేశారు. విద్యార్థులకు సర్దిచెప్పారు.



రిజిస్ట్రార్ రామచంద్రంతో మాట్లాడుతున్న విద్యార్థులు

సూసైడ్ నోట్ కలకలంపై తనిఖీలు

- జిరాక్స్ కాపీలతో ఉపాధ్యాయుల పరిశీలన
- ఇన్‌స్పెక్టర్ ఆదేశాలతో మహిళా కానిస్టేబుళ్ల విచారణ
- కళాశాలలో పనిచేయని సీసీ కెమెరాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హసన్‌పర్తి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎర్రగట్టుగుట్ట క్రాస్‌రోడ్డులోని తెలంగాణ బాలికల గురుకుల కళాశాలలో ఓ విద్యార్థిని సూసైడ్ నోట్ శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నలుగురు విద్యార్థినులు మూడు రోజుల కిందట సూసైడ్ చేసుకునేందుకు నిర్ణయించుకున్నారని, వీరిలో గుర్తు తెలియని విద్యార్థిని ఒకరు సూసైడ్ నోట్ రాసి కళాశాల యూడీసీ టెబుల్‌పై ఉంచినట్లు ప్రచారం జరిగింది. ఈ విషయంపై శనివారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'టీఎస్‌ఆర్‌జేసీలో సూసై డ్ నోట్ కలకలం' అనే కథనంతో ప్రచురితమైంది. దీంతో హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు ఆదేశాల మేరకు ఇద్దరు మహిళా కానిస్టేబుళ్ళను గురుకుల కళాశాలకు పంపించి విచారణ జరిపారు. అయినప్పటికీ సూసై డ్ నోట్ రాసిన విద్యార్థులవివరాలను తెలుసుకోలేకపోయారు. ఇంగ్లీష్ మీడియం విద్యార్థినులు తెలుగులో సూసైడ్ నోట్ రాయడంతో కళాశాల ప్రిన్సిపాల్ సూసైడ్ నోట్ ప్రతులను ప్రతీ అధ్యాపకుడికి అందజేసి విద్యార్థినులను తనిఖీ చేయించారు. అయినా అసలు విషయం రాబట్టలేక పోయినట్లు సమాచారం. ఈ విషయంలో పోలీసు సిబ్బంది సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిచేందుకు సిద్ధపడ్డారు. సీసీ కెమెరా ఫుటేజీల పరిశీలన కోసం ప్రయత్నం చేయడంతో నమ్మలేని నిజాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది.

విద్యార్థినుల రక్షణ కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయడం లేదని తెలిసింది. అక్కడ పనిచేస్తున్న సిబ్బంది ప్రిన్సిపాల్‌తో సహా అందరు రాత్రి తొమ్మిదయ్యిందంటే కళాశాల విడిచి ఇంటికి వెళ్తున్నట్లు ఆరోపణలున్నాయి. రాత్రి వేళలో ఒక్క వాచ్‌మన్ పర్యవేక్షణలోనే బాలికల గురుకుల కళాశాల నిర్వహణ కొనసాగుతున్నట్లు సమాచారం. బాలికల కళాశాలలో విద్యార్థినుల రక్షణ కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో పాటు వారి పర్యవేక్షణ చూడాల్సిన ప్రిన్సిపాల్‌తో సహా బోధన, బోధనేతర సిబ్బంది స్థానికంగా ఉండకపోవడం గుర్తు తెలియని సూసైడ్ నోట్ కలకలం వెలుగులోకి వచ్చినట్లు ప్రచారం జరు గుతోంది. ఈ విషయంపై ప్రిన్సిపాల్ ఇందుమతిని వివరణ కోరగా.. పిల్లలెవరూ సూసైడ్ నోట్ రాయలేదని ప్రమాణం చేసి చెప్పారని తెలిపారు.

సండే సెలబ్రిటీ



ఐదున్నర దశాబ్దాలుగా తెలుగువారిని తన నటనతో ఆకట్టుకుంటున్న సహజ నటి **జయసుధ**. ఆమె తొలిసారి హీరోయిన్‌గా నటించిన 'లక్ష్మణరేఖ' విడుదలయి 50 ఏళ్లు అయిన సందర్భంగా తన నటనా ప్రస్థానాన్ని 'నవ్య'తో పంచుకున్నారు.

హీరోయిన్‌లపై ఆ వివక్ష ఇంకా ఉంది

54 ఏళ్లు ఎక్కడా విరామం లేకుండా నటించటం ఒక రికార్డు. వెనక్కితిరిగి చూస్తే ఎలా అనిపిస్తోంది?

'ఇంత త్వరగా కాలం గడిచిపోయిందా?' అనిపిస్తోంది. మీరు అన్నది నిజమే. 54 ఏళ్లగా విరామం లేకుండా నటిస్తూనే ఉన్నా. మా పెద్ద అబ్బాయి కడుపులో ఉన్నప్పుడు- ఏడో నెలలో కూడా నటించా. వాడు పుట్టిన మూడో నెల నుంచి నటించటం మొదలుపెట్టా! ఒక విధంగా చెప్పాలంటే నేను మెటర్నిటీ లీవ్ కూడా పూర్తిగా తీసుకోలేదు. ఒక విధంగా ఇది నా అదృష్టం అనుకోవాలి.

హీరోయిన్ అవుతానని అనుకున్నారా?

నాకు చిన్నప్పటి నుంచి ఆటలంటే ఆసక్తి ఉండేది. క్రికెట్ ఆడేదాన్ని. క్రికెటర్ అవ్వాలనేది నా కోరిక. మా ఆంటీ విజయనిర్మల సినిమాల్లోకి వచ్చి స్థిరపడ్డారు. నాకు 12 ఏళ్లు ఉన్నప్పుడు- "పండంటి కాపురం' సినిమాలో ఒక పాత్ర ఉంది. సుజాత (పూర్వాశ్రమంలో నా పేరు) చేస్తే బావుంటుంది" అని మా నాన్నగారు నిడదవోలు వెంకట్రావుగారిని ఆమె అడిగారు. అది నాకు ఇష్టం లేదు. కానీ "సొంత ప్రొడక్షనే కదా... చేస్తే ఏం పోతుంది" అని అందరూ అభిప్రాయపడ్డారు. అలా నా సినిమా ప్రస్థానం మొదలైంది. ఆ తర్వాత మూడేళ్లకు 'లక్షణ రేఖ'లో హీరోయిన్‌గా అవకాశం వచ్చింది. ఇక్కడ ఒక విషయం చెప్పాలి. నాకు మొదటి నుంచి కెమెరా అంటే బెరుకు లేదు. నటన సహజంగానే వచ్చింది. మొదటి కొన్ని సినిమాల్లో నాకు భాషా సమస్య ఉండేది. నేను పుట్టి పెరిగింది చెన్నైలో కాబట్టి కొంత తమిళ యాస ఉండేది. తెలుగు చదవటం రాదు. అంతేకాదు, నాకు డైలాగ్స్ బట్టీపట్టడం రాదు. దాసరిగారు రెండు, మూడు పేజీల డైలాగ్స్ రాసేవారు. వాటిని విని చెప్పేసేదాన్ని. అయినా నా డబ్బింగ్ నేనే చెప్పుకొనేదాన్ని. అయితే గ్రాంథిక భాషలో ఉండే డైలాగ్స్ విషయంలో ఇబ్బంది ఉండేది. ఎన్టీఆర్ గారు డైరక్ట్ చేసిన 'శ్రీ తిరుపతి వేంకటేశ్వర కల్యాణం' సినిమాలో ఆ ఇబ్బంది వచ్చింది. ఎన్టీఆర్ గారు- "లక్ష్మీదేవి ఫ్రెంచి మాట్లాడుతున్నట్టు ఉంది" అని సరదాగా అనేవారు. డబ్బింగ్ చెప్పటానికి ఎక్కువ రోజులు సమయం లేదు. దాంతో ఆ సినిమాలో నా పాత్రకు డబ్బింగ్ చెప్పించారు. నాకు వేరేవాళ్లు డబ్బింగ్ చెప్పిన సినిమా అదొక్కటే!

నేను కొన్ని గ్లామరస్ పాత్రలు చేశాను. నన్ను, కమల్‌హాసన్‌ను- నీతూసింగ్, రిషీకపూర్‌లతో పోల్చేవారు. వాళ్లు ధరించిన మాదిరి కాస్ట్యూమ్స్‌ను మేం వేసుకొనేవాళ్లం. ఇక నా దృష్టిలో గ్లామర్ అంటే జీనత్ అమన్. ఆమె ఫిగర్ అలాంటిది. ఆమెకు ఎలాంటి దుస్తులు వేసినా వల్గర్‌గా ఉండేది కాదు. ఇక బికినీల లాంటివి నేను చాలా తక్కువ సినిమాల్లో ధరించా. 'యుగంధర్' (హిందీలో 'డాన్') సినిమాలో వేసుకోవాల్సి వచ్చింది. తెలుగులో నేను చేసిన పాత్రను హిందీలో జీనత్ అమన్ చేసింది. అలాంటి దుస్తులు ధరించాలన్నా నేను పెద్దగా ఇబ్బంది పడేదాన్ని కాదు. ఎందుకంటే చిన్నప్పుడు నేను స్విమ్మర్‌ను. స్విమ్మింగ్ చేసేటప్పుడు చీర కట్టుకోరు కదా! సినిమాలో కూడా అంతే! ఇక డైలాగ్స్, కాస్ట్యూమ్స్ విషయంలో ఇబ్బంది ఉంటే డైరక్టర్‌లకు చెప్పకుండా మాతో నటించే హీరోలకు చెప్పేవాళ్లం. వారు వెళ్లి మా పేరు చెప్పకుండా - "ఈ దుస్తులు బాగుంటాయా?","ఈ డైలాగ్ బావుందా?" అని డైరక్టర్‌లను అడిగేవారు. డైలాగ్స్‌లో ఏదైనా తేడా ఉంటే అందరికన్నా ముందే ఏఎన్నాఆర్ పసిగట్టేసేవారు.



మొదట్లో ప్రతి ఏడాది పది, పన్నెండు సినిమాలు చేసేవారు. కష్టమయ్యేదా?

మొదటి నాలుగేళ్లు చాలా కష్టపడ్డా! రోజుకు ఐదు షిఫ్టులు చేసేదాన్ని. ఉదయం మూడున్నరకు వెళ్లి నిద్రపోయి, ఉదయం ఆరింటికి షూటింగ్‌కి బయలుదేరి వెళ్లిపోయేదాన్ని. విపరీతమైన నిద్ర వచ్చేది. అప్పుడప్పుడు నిద్ర రాకుండా అమ్మ పొగలు కక్కుతున్న కాఫీ కప్పు నాముందు ఉంచేది. కాఫీ వాసన చూసిన తర్వాత నిద్ర కొద్దిగా పోయేది. 'ఆక్రందన', 'పక్కింటి అమ్మాయి', 'యుగంధర్' సినిమాలైతే కేవలం సాయంత్రం 6-9 కాల్‌షీట్‌లో పనిచేసి పూర్తిచేశా. ఆ తర్వాత నాన్నతో అంత కష్టపడనని చెప్పాను. కొద్దికాలానికి... సాయంత్రం 6 గంటల తరువాత పనిచేయనని చెప్పేశాను!

చిన్నతనంలోనే పెద్ద వయసున్న పాత్రలు వేశారు కదా... ఎలా అనిపించేది?

'జ్యోతి', 'గోపాలరావుగారి అమ్మాయి', 'పక్కింటి అమ్మాయి', 'ఆమె కథ'- ఇలా అన్నీ టైటిల్ రోల్స్ చేసేదాన్ని. ఈ సినిమాలన్నీ హీరోయిన్ ప్రధానమైనవే! అన్నీ నాకు ముప్పై ఏళ్లలోపు వచ్చినవే! వాటి గురించి నేను పెద్దగా ఆలోచించలేదు. నేను చేసిన 350 సినిమాల్లో ఓ పది, ఇరవై నాకు ఇష్టం లేకుండా చేసినవి ఉండచ్చు. స్క్రిప్టులు అన్నీ నేనే వినేదాన్ని. ఇక్కడ ఒక విషయం చెప్పాలి. షూటింగ్‌లో ఉన్నప్పుడు పాత్రలో ఉంటాను. అయిపోయిన వెంటనే మామూలు ప్రపంచంలోకి వచ్చేస్తాను. ఇది నాకు చాలా సహజంగా జరిగిపోతుంది. అందువల్ల మానసికంగా పెద్ద ఇబ్బంది అనిపించేది కాదు.

> **చిన్నప్పుడు మా ఇంట్లో బీటిల్స్ లాంటి ఇంగ్లీషు పాటలు మాత్రమే వినేవాళ్లం. నాన్నా ఇంగ్లీషు సినిమాలు చూసేవారు. అమ్మ హిందీ సినిమాలు మాత్రమే చూసేవారు.**

ఇంత కష్టపడుతున్నాను కదా... 'సినిమాలు మానేద్దామా!' అని ఎప్పుడూ అనిపించలేదా?

మూడేళ్ల తర్వాత మానేద్దామనుకున్నాను. నాన్న- "నీకు చదువురాలేదు. క్రికెటర్ అవ్వాలనుకుంటే పరిస్థితులు ఎలా ఉంటాయో తెలియదు. లేకపోతే పెళ్లి చేసుకోవాలి. నటిస్తే తప్పేముంది?" అన్నారు. ఆంటీ కూడా "మొదలైంది కాబట్టి కొనసాగిద్దాం" అన్నారు. కుటుంబంలో ఉన్నవారందరూ నేను నటిస్తేనే బెటర్ అనుకున్నారు. పెళ్లి అయిన తర్వాత మానేద్దామనుకున్నా. కానీ నితిన్‌కి కూడా సినిమాలు మాత్రమే తెలుసు. ఆయన డైరక్టర్‌గా మారితే మానేద్దామనుకున్నా. అది కుదరలేదు. 60 ఏళ్లు వచ్చిన తర్వాత మానేద్దామనుకున్నా. కానీ నాకు 59 ఏళ్లు ఉన్నప్పుడు నితిన్ చనిపోయారు. అదొక షాక్! ఆ సమయంలో 'శతమానం భవతి' సినిమా షూటింగ్ పూర్తయింది. ఆ సినిమా ప్రమోషన్స్‌కు వెళ్లాల్సి వచ్చింది. అలాగే అయిపోతోంది. నాకు ఒక సముద్రం ఒడ్డున ఇల్లు కట్టుకొని, ఉదయాన్నే వాక్‌కు వెళ్తూ, మధ్యాహ్నం లైబ్రరీకి వెళ్తూ జీవించాలని ఉంటుంది. అప్పుడప్పుడు 'నా జీవితం ఇలా ముందే రాసి ఉందేమో?' అనుకుంటాను.


> **నాకు చీరలంటే చాలా ఇష్టం. చీరల ఎగ్జిబిషన్‌లు నడుపుతూ ఉంటా. అమ్మాయిలకు చీర కన్నా అందమైన కాస్ట్యూమ్ మరేదీ ఉండదు. నా చిన్నతనంలో చాలా వేగంగా చీర కట్టేసుకొనేదాన్ని. కానీ ఈ మధ్యకాలంలో చీరకట్టుకోవటం మానేశాను. ప్యాంట్, షర్ట్‌లు చాలా సౌలభ్యంగా అనిపిస్తున్నాయి.**



ఇండస్ట్రీ పురుష ఆధిపత్యంలోనే ఉంటుంది కదా... ఇంత కాలం ఎలా ఉండగలిగారు?

భానుమతిగారు బలమైన వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి. సావిత్రి గారు తన వ్యక్తిగత జీవితాన్ని సరిగ్గా నడుపుకోలేకపోయారు. వాణిశ్రీగారు, జమునగారు.. వీరందరూ ఒకప్పుడు ఇండస్ట్రీని శాసించినవారే! తమ టర్మ్‌లో జీవించినవారే! నా దగ్గరకు వచ్చేసరికి - కథలు, స్క్రిప్టుల విషయంలో నేను ఎప్పుడూ రాజీ పడేదాన్ని కాదు. మా సమయంలో హీరోయిన్ ఆధారిత సినిమాలు అనేకం వచ్చేవి. హీరోలు కూడా అలాంటి పాత్రలు అంగీకరించేవారు. నేను, జయప్రద, శ్రీదేవి- మేము ముగ్గురం చాలా కాలం తెలుగు సినీ రంగాన్ని ఏలాం. ఆ తర్వాత జయప్రద, శ్రీదేవి బాలీవుడ్‌కు వెళ్లిపోవటంతో వారి రోల్స్‌ను కూడా నేనే చేసేదాన్ని. అయితే హీరో, హీరోయిన్‌లను చూసే విధానంలో అప్పుడు తేడా ఉంది. అది ఇప్పటికీ కొనసాగుతోంది. హీరో ఆరాధన కొనసాగుతూనే ఉంటుంది. 150 మంది పనిచేస్తూ ఉంటే 20 మంది మాత్రమే మహిళలు ఉంటారు. ఇప్పుడు మరింతగా పెరిగిపోయింది. ఇప్పుడు హీరోయిన్... హీరోకు తోకలాగ ఉంటోంది. రూ.100 కోట్లు తీసుకునే హీరోయిన్లు ఎవ్వరు లేరు కదా!

ఆ రోజుల్లో సోషల్ మీడియాలేదు కాబట్టి బతికిపోయేవాళ్లం. ఎల్లో జర్నలిజం ఉండేది కానీ ఏవైనా రూమర్స్ రాస్తే వెళ్లికొట్టేవారు. ఆ సమయంలో కాగడాశర్మ అనే ఆయన చాలా ఫేమస్. ఆయన ఇలాంటివి రాసేవారు. అయినా అవేవీ నా దగ్గరకు వచ్చేవి కావు. ఒకసారి ఏదో ఫంక్షన్‌లో ఒక వ్యక్తి వచ్చి నా పక్కన కూర్చున్నారు. ఆయన ఎవరో నాకు తెలియదు. "నేను కాగడాశర్మని..." అని పరిచయం చేసుకున్నారు. నేను అప్రయత్నంగా - "మీరేనా... ఎందుకండీ... అందరి గురించి అంత బ్యాడ్‌గా రాస్తారు..." అన్నాను! "అలా రాయకపోతే ఎవరు చదువుతారమ్మా" అన్నాడాయన. ఇండస్ట్రీలో ఉన్న హెయిర్‌డ్రెస్సర్స్ గ్యాసిప్ మాట్లాడుకుంటూ ఉండేవారు.



- సీవీఎల్‌ఎన్ ప్రసాద్

వేడుక

పూల జాతర మొదలైంది
నేడు ఎంగిలిపూల బతుకమ్మ

తెలంగాణ గ్రామీణ సంస్కృతికి అద్దంపట్టే, ప్రకృతితో మమేకమయ్యే సంబరం... బతుకమ్మ పండుగ. ఈ వేడుకలు ప్రతి యేటా భాద్రపద అమావాస్య... అంటే మహాలయ అమావాస్య (పెత్రామాస) రోజున ప్రారంభమవుతాయి. ఈ సంబరాల్లో బతుకమ్మలను రోజుకో పేరుతో కొలుస్తారు. మొదటి రోజున ఎంగిలి పూల బతుకమ్మ అలంకరణ కోసం ముందురోజే రకరకాల పువ్వులు కోసుకొని తీసుకొచ్చి, నీళ్ళలో వేస్తారు. మర్నాడు వాటితో బతుకమ్మను అలంకరిస్తారు. అందుకే 'ఎంగిలిపూల బతుకమ్మ' అంటారు. పూలతో చక్కగా బతుకమ్మను పేర్చి, తమలపాకులు ఉంచి, పసుపుతో తయారు చేసిన బతుకమ్మను దానిపై పెట్టి పూజలు చేస్తారు. ఈ తొమ్మిది రోజులూ రకరకాల ప్రసాదాలను బతుకమ్మకు నివేదిస్తారు.

ఈ రోజు నైవేద్యం:
నువ్వులు, నూకలు, బియ్యం పిండి, బెల్లం



"మీ వయసుకు ఇలాంటి దుస్తులు వేసుకోవటం సబబేనా?" అని ఎవరైనా అడిగితే ఏం చేస్తారు? అది కూడా లక్షలమంది చూసే ఇంటర్వ్యూలో... కొందరైతే- "వీడితో మనకెందుకు..." అని వదిలేస్తారు. కానీ సినీ పరిశ్రమలో పుట్టి పెరిగిన **మంచు లక్ష్మి** అలా ఊరుకోలేదు. తనను అలా ప్రశ్నించిన వెబ్‌సైట్ జర్నలిస్టును క్షమాపణలు చెప్పమని అడిగారు. అందుకు ఆ జర్నలిస్ట్ అంగీకరించకపోతే ఫిల్మ్ ఛాంబర్‌కు ఫిర్యాదు చేశారు. అయినా మహిళను కాబట్టే తనకు న్యాయం జరగటం లేదంటున్నారు లక్ష్మి. కొద్ది రోజులుగా తాను అనుభవిస్తున్న వ్యథను ఆమె.. 'నవ్య'తో పంచుకున్నారు.

క్షమాపణ కోరడం కూడా తప్పేనా?



> **భయపడను...**
> చాలామందికి సినిమా పరిశ్రమ గ్లామరస్‌గానే కనిపిస్తుంది. దాని వెనక వేరే కోణాలెన్నో ఉన్నాయి. మేము ప్రతి రోజూ పొట్టనిండా తిండి కూడా తినలేం. పగలనక, రాత్రనక ఎంత కష్టపడతామో చాలామందికి తెలియదు. నేను ఫిర్యాదు చేసిన తర్వాత కూడా నాకు అనేక మంది ఫోన్ చేశారు. "శభాష్ లక్ష్మీ! నువ్వు పోరాడు..." అన్నారు. ఈ పోరాటం చాలా కష్టమైనదని నాకు కూడా తెలుసు. నా ఫిర్యాదు వైరల్ అయిన వెంటనే - నా ఫోటోలను మార్ఫింగ్ చేసి, అశ్లీలమైన పోస్టులు పెట్టిస్తున్నారు. ఇలాంటి చిల్లర వేషాలకు నేను భయపడను. నాకు న్యాయం జరిగేదాకా పోరాడతాను."


"నేను తెలుగు సినీ పరిశ్రమలో పుట్టాను. పెరిగాను. పరిశ్రమ తీరుతెన్నులు నాకు బాగా తెలుసు. ఇండస్ట్రీలో పురుషాధిక్యం ఉంటుందని కూడా తెలుసు. కానీ నా అస్థిత్వాన్ని, నా స్వేచ్ఛను హరించి, నన్ను కంచెలలో బంధించాలంటే మాత్రం భరించలేను. ఎందుకంటే అది నా వ్యక్తిత్వం కాదు. ఈ సమాజంలో మహిళల పట్ల వివక్ష అన్ని రకాలుగానూ ఉంటుంది. కానీ అది బయటకు కనిపించదు. మహిళలు బయటకు వెళ్లాలంటే లక్ష రకాలుగా ఆలోచిస్తారు. "నేను వేసుకొనే దుస్తులు బావున్నాయా? ఎవరైనా ఏదైనా కామెంట్ చేస్తారా?"- ఇలాంటి ఆలోచనలు ఎన్నో! గతవారం నా సినిమా 'దక్ష' ప్రమోషన్స్‌లో భాగంగా 'గ్రేటాంధ్ర' అనే వెబ్‌సైట్‌లో పనిచేసే మూర్తి అనే ఒక జర్నలిస్టుకు ఇంటర్వ్యూ ఇచ్చాను. ఆయన వయసులో చాలా పెద్దవారు. తన ఇంటర్వ్యూలలో అవతలి వ్యక్తులను అవమానిస్తూ ఉంటారు. ఇటీవలే తేజ సజ్జాను కూడా అవమానించారు. తేజ నాకు చిన్నప్పటి నుంచి తెలుసు. ఆయన మాటలకు నేను కూడా హర్ట్ అయ్యా! బురద మీద రాయి వేస్తే అది మన మొహం మీదే చిమ్ముతుందంటారు. దీన్ని ఇప్పటిదాకా నేను నమ్మేదాన్ని. అందుకే నేను స్పందించలేదు. నన్ను చేసిన ఇంటర్వ్యూలో నా వయసు గురించి, నేను వేసుకున్న దుస్తులు మీద కామెంట్ చేశారు. ఆయనకు ఆ ఇంటర్వ్యూలోనే సమాధానం చెప్పాను. "పొరపాటైపోయింది.. ఏదో ఫ్లోలో వచ్చేసింది..." అంటారేమో అనుకున్నా. కానీ ఆయన - "ఇదంతా అలవాటే. వైరల్ అయిందా? లేదా" అని నవ్వారు. ఆ మాటలకు నేను చాలా హర్ట్ అయ్యా! 'ఒక మహిళను అంత చులకనగా చూస్తారా? ఆమెకు తనకు నచ్చిన దుస్తులు వేసుకొనే స్వేచ్ఛ కూడా లేదా? ఒకవేళ తనకు నచ్చిన దుస్తులు వేసుకుంటే పరిహసిస్తారా?' అనే ఆలోచనలు నన్ను వెంటాడుతూనే ఉన్నాయి. ఆ ఇంటర్వ్యూ విడుదలయిన వెంటనే సినిమా ఇండస్ట్రీలో అనేకమంది నాకు కాల్స్ చేశారు. నాకు మద్దతుగా నిలుస్తామన్నారు. ఆయనపై ఫిర్యాదు చేయమన్నారు.

స్పందన లేదు...

ఆయన మాట్లాడిన వెకిలి మాటలకు క్షమాపణలు చెప్పించమని కోరుతూ ఫిల్మ్‌ఛాంబర్‌కు, 'మా' అసోసియేషన్‌కు ఫిర్యాదు పంపించాను. కానీ ఎటువంటి స్పందన లేదు. పైగా "ఏ మూర్తి?" అని అడిగారు. ఆ వివరాలను కూడా పంపాను. బహిరంగంగా ఒక వ్యక్తి నన్ను అవహేళన చేస్తే... దాని రికార్డులు కూడా ఉంటే ఎవ్వరూ స్పందించటానికి ముందుకు రాకపోవటం ఆశ్చర్యంగా అనిపించింది. 'ఇదే ఒక హీరోకి జరిగితే పరిశ్రమ ఇలాగే స్పందిస్తుందా?' అనిపించింది. 'నా కోసం నేను నిలబడకపోతే ఇంకెవరు నిలబడతారు' అనిపించింది. ఇంకో విషయం కూడా ఇక్కడ చెప్పాలి. నన్ను ఇంటర్వ్యూ చేసిన వెబ్‌సైట్ కూడా క్షమాపణలు చెప్పలేదు. కనీసం 'మేము చింతిస్తున్నాం' అనే మాట కూడా పబ్లిష్ చేయలేదు. పైగా "ఆ ఫిర్యాదు ఎందుకు? ఇక్కడితో వదిలేయ్" అని అనేక ఫోన్లు వచ్చాయి. సోషల్ మీడియా విస్తృత ప్రచారంలోకి వచ్చిన తర్వాత వెబ్‌సైట్ల పేరుతో అనేకమంది రకరకాల దందాలు చేస్తున్నారు. బయట ప్రపంచంలోకి వచ్చి - "మేము ఈ వార్త రాశాం" అని చెప్పుకొనే ధైర్యం కూడా ఉండదు. మా చేతుల ఫోటోలు, కాళ్ల ఫోటోలు, నడుముల ఫోటోలు వేసుకొని బతుకుతున్న వెబ్‌సైట్లు ఎన్నో ఉన్నాయి. మామీద గాసిప్స్ రాసి బతికేవాళ్లు ఎందరో ఉన్నారు. వాళ్లందరినీ బాగుచేయాలనుకోవటం లేదు. కానీ నన్ను బహిరంగంగా అవమానించినప్పుడు- క్షమాపణ కోరటం కూడా తప్పేనా? 'మన సమాజంలో పురుషాధిక్యత ఇంత వేళ్లూనుకుందా?' అనిపిస్తోంది. నన్ను అవమానించిన వ్యక్తి ఇంట్లో మహిళలు ఎంత దుర్భర పరిస్థితిలో బతుకుతున్నారో? అనిపిస్తోంది.



Dawn PICTURES
RED GIANT MOVIES
INBAN UDHAYANIDHI PRESENTS
WUNDERBAR FILMS
SVM
SRI VEDAKSHARA MOVIES
DHANUSH
ఇడ్లీ కొట్టు
1ST OCT 2025
IN CINEMAS WORLDWIDE
WRITTEN & DIRECTED BY
DHANUSH
A GV PRAKASH MUSICAL
DIRECTOR OF PHOTOGRAPHY KIRAN KOUSHIK EDITOR PRASANNA GK ACTION PETER HEIN ART JACKI
DANCE CHOREOGRAPHER SATHISH COSTUME DESIGNER KAVYA SRIRAM STILLS THENI MURUGAN COSTUMER NAGU MAKE UP B RAJA
PUBLICITY DESIGNER KABILAN PRO VAMSI SHEKAR MARKETING HEAD MANOJ MADDY VFX SUPERVISOR PRAVEEN D
PRODUCTION CONTROLLER D.RAMESH KUCHIRAYAR EXECUTIVE PRODUCER SREYAS SRINIVASAN
PRODUCED BY AAKASH BASKARAN - DHANUSH
TELUGU THEATRICAL RELEASE BY CHINTHAPALLI RAMARAO(BE)



DVV
SMT. D PARVATHI PRESENTS
FIRING WORLDWIDE
25 SEP 25
THEY CALL HIM
OG
WRITTEN & DIRECTED BY SUJEETH
DVV DANAYYA KALYAN DASARI
RAVI K CHANDRAN (ISC) MANOJ PARAMAHAMSA (ISC) NAVIN NOOLI
A S PRAKASH DARSHAN JALAN & NEELANCHAL KUMAR GHOSH
HARISH PAI SATHYANARAYANA GUGGILLA SOMARAJU PVV
ASHWIN MANI MALLESH T RAGHAV TAMMAREDDY MANIKANTA RONGALA
UDAY ALLA ARUN THEVAR LOKESH SRINIVASAN KISHORE SARELLA
A THAMAN S MUSICAL
DODGE
BMY 0893
OG Concert
TODAY
LB STADIUM, HYD
5:00 PM ONWARDS
SONY MUSIC
NETFLIX

ఎంగిలిపూల బతుకమ్మ ఉయ్యాలో!

నేటి నుంచి బతుకమ్మ పండుగ ఉత్సవాలు

- వరంగల్‌లో ప్రారంభ వేడుకలు.. పాల్గొననున్న మంత్రులు జూపల్లి, కొండా సురేఖ, సీతక్క
- ఆడపడుచుల ఔన్నత్యానికి ప్రతీక: రేవంత్
- కళాకారులకు 'యంగ్ ఫిల్మ్ మేకర్స్ చాలెంజ్'
- తొలి బహుమతి 3 లక్షలు.. పోస్టర్ ఆవిష్కరణ

హైదరాబాద్, సిద్దిపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ సంబురాలకు వేళైంది. మహాలయ అమావాస్య సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం నుంచి పల్లె పల్లెలో.. వాడ వాడలా తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ ఆటాపాటలే కనిపించనున్నాయి. సకల జనులు, సబ్బండ వర్ణాలు కలిసి ఏకత్వస్ఫూర్తిని చాటేలా బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది. ప్రారంభ వేడుకలు వరంగల్‌లోని వేయి స్తంభాల గుడి వద్ద జరుగుతాయి. అక్కడ ప్రారంభ వేడుకల్లో సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పాల్గొంటారు. రాష్ట్రంలోని ఆడబిడ్డలకు సీఎం రేవంత్ రెడ్డి బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ అనేది పూలను పూజిస్తూ, ప్రకృతిని ఆరాధించే పండుగ అని, ఇది ఆడపడుచుల ఔన్నత్యానికి ప్రతీక అని ఆయన అన్నారు. సామూహిక జీవన విధానానికి, కష్ట సుఖాలను కలిసి పంచుకునే ప్రజల ఐక్యతకు ఈ పండుగ నిదర్శనమన్నారు. ఎంగిలిపూల నుంచి సద్దుల బతుకమ్మ వరకు తొమ్మిది రోజులపాటు పండుగను ఆట పాటలతో వైభవంగా జరుపుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని, అందరూ ఆనందంగా ఆరోగ్యంగా ఉండాలని గౌరమ్మను రేవంత్ ప్రార్థించినట్లుగా సీఎంవో ఓ ప్రకటన విడుదల చేసింది. మంత్రులు జూపల్లి, కొండా సురేఖ, కోమటిరెడ్డి.. ఆడబిడ్డలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. సినిమాటోగ్రఫీ శాఖ ఆధ్వర్యంలో ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎఫ్‌డీసీ) ద్వారా నిర్వహిస్తున్న 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ చాలెంజ్' పోస్టర్‌ను ఆ శాఖ మంత్రి కోమటిరెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, కళారూపాలు, ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై వీడియోలను రూపొందించి యువ కళాకారులు తమలోని సృజనాత్మకతను ప్రపంచానికి చాటాలని, బహుమతులు గెలుచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్‌రాజును మంత్రి ప్రత్యేకంగా అభినందిస్తూ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంపికైన విజేతల్లో.. ప్రథమ బహుమతిగా రూ. 3లక్షలు, ద్వితీయ బహుమతిగా రూ. 2 లక్షలు, తృతీయ బహుమతిగా రూ.లక్ష అందించనున్నారు. కన్సోలేషన్ బహుమతి కిందఐదుగురికి రూ.20వేల చొప్పున ఇస్తారు. లఘు చిత్రాలయితే 3 నిమిషాలు, పాటలయితే 5 నిమిషాల నిడివి మించకూడదని తెలిపారు. ఎంట్రీలను youngfilmmakerschallenge@gmail.comకు లేదా 8125834009 అనే వాట్సాప్ నంబర్‌కు గానీ పంపాలని తెలిపారు. ఎంట్రీలను పంపించేందుకు గడువు ఈ నెల 30 అని వెల్లడించారు. కాగా, అన్ని జిల్లాకేంద్రాల్లో 30న సద్దుల బతుకమ్మ ఉత్సవాలను నిర్వహించాలని సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు చింతమడకకు కవిత

బతుకమ్మ వేడుకల కోసం తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత ఆదివారం కేసీఆర్ స్వగ్రామమైన సిద్దిపేట రూరల్ మండలం చింతమడక గ్రామానికి రానున్నట్లు గ్రామస్థులు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు శివాలయం, పట్టాభి సీతారామచంద్రాస్వామి గుడిలో బతుకమ్మతో దర్శనం చేసుకొని, గుడి ముందున్న మైదానంలో బతుకమ్మ ఆడనున్నారు.



బతుకమ్మ ఎక్కడ 'తల్లీ'?

ఓ విగ్రహం చేతిలో బతుకమ్మ లేదు.. మరో విగ్రహం చేతిలో బతుకమ్మ ఓ పక్కకు ఒరిగిపోయింది. కేసీఆర్ సొంత గ్రామమైన సిద్దిపేట జిల్లా చింతమడకలో ఆయన సీఎంగా ఉన్నప్పుడు ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాల పరిస్థితి ఇది. ఆదివారం బతుకమ్మ సంబురాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆ పల్లెలో తెలంగాణ తల్లి విగ్రహాల దయనీయ స్థితిపై గ్రామస్థులు చర్చించుకుంటున్నారు.

- ఆంధ్రజ్యోతి, సిద్దిపేట రూరల్

లోక్‌సత్తాతో పాటు 9 రాజకీయ పార్టీల రద్దు

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): లోక్‌సత్తాతోపాటు రాష్ట్రంలో గుర్తింపు లేని 9రాజకీయ పార్టీలను రద్దు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (ఎస్ఈవో) సుదర్శన్ రెడ్డి తెలిపారు. చట్టపరమైన నిబంధనలు పాటించనందు వల్లే ఎన్నికల సంఘం జాబితా నుంచి ఆ పార్టీల పేర్లు తొలగిస్తున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రద్దయిన పార్టీల్లో లోక్‌సత్తా, ఆల్ ఇండియా ఆజాద్ కాంగ్రెస్ పార్టీ, ఆల్ ఇండియా బీసీఓబీసీ పార్టీ, బీసీ భారత దేశం పార్టీ, భారత్ లేబర్ ప్రజా పార్టీ, మహాజన మండలి పార్టీ, తెలంగాణ ప్రగతి సమితి, తెలంగాణ ఇండిపెండెంట్ పార్టీ ఉన్నాయి. నివేదికలు, లెక్కలు సమర్పించక పోవడంతో ఆ పార్టీలను రద్దు చేసినట్లు తెలిపారు.



నర్మెట్టలో నిర్మిస్తున్న పామాయిల్ ఫ్యాక్టరీ దేశానికే దిక్సూచి

- పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి
- త్వరలో సీఎం చేతుల మీదుగా ప్రారంభం: తుమ్మల

నంగునూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్టలో నిర్మిస్తున్న పామాయిల్ ఫ్యాక్టరీ దేశానికే దిక్సూచి అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రూ.300 కోట్లతో ఆధునిక వసతులతో నిర్మిస్తున్న ఫ్యాక్టరీని ఆయన శనివారం సందర్శించారు. ఫ్యాక్టరీ పెండింగ్ పనులను వెంటనే చేపట్టాలని అధికారులు ఆదేశించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. త్వరలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఫ్యాక్టరీ ప్రారంభం కానున్నదని తెలిపారు. ఇది తెలంగాణకు ప్రధాన కేంద్రంగా ఉంటుందని, రాష్ట్రంలోని ఏ జిల్లా నుంచి అయినా మెరుగైన రవాణా సదుపాయం ఉంటుందని చెప్పారు. ముడి ఆయిల్ రిఫైనరీ ఇక్కడే చేయాలనేది సీఎం సంకల్పమని పేర్కొన్నారు. కల్తీ లేని వంట నూనె కావాలంటే ఇక నర్మెట్ట గ్రామంలో దొరుకుతుందన్నారు. ఫ్యాక్టరీ వ్యర్థాలతో నాలుగు యూనిట్ల కరెంట్ ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ ఫ్యాక్టరీ ద్వారా వచ్చే ఆదాయం మొత్తం రైతులకే అందించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఆయిల్ పామ్ తోటలు సాగు చేసేందుకు ముందుకు వచ్చేలా అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. ఆయిల్ పామ్ పంట టన్నుకు రూ.25 వేలు తగ్గకుండా రావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

ఉద్యోగం రాలేదని యువతి ఆత్మహత్య

గంభీరావుపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎంత ప్రయత్నించినా ఉద్యోగం రావడం లేదనే మనస్తాపంతో ఓ యువతి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం రాజుపేటకు చెందిన అల్లె ప్రియాంక (24)బీటెక్ పూర్తి చేసింది. హైదరాబాద్‌లోనే ఉంటూ రెండేళ్లుగా ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్న ఫలితం లేకపోయింది. ఇదే విషయాన్ని తల్లిదండ్రులతో తరచూ చెప్తూ బాధపడుతుండేది. బతుకమ్మ పండగ కోసం రాజుపేటకు వచ్చిన ప్రియాంక.. శుక్రవారం ఇంట్లో దూలానికి ఉరి వేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ప్రియాంకను దుబ్బాకలోని ఆసుపత్రికి తరలించినా.. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోర్టు కేసుల పర్యవేక్షణకు కేంద్రీకృత వ్యవస్థ

- రెవెన్యూ, హోం, విద్యాశాఖల్లో అమలుకు ప్రతిపాదన

హైదరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోర్టు కేసుల పర్యవేక్షణకు నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) రూపొందించిన కోర్టు కేస్ మానిటరింగ్ సిస్టమ్ (సీసీఎంఎస్)ను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. తొలుత ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని రెవెన్యూ, హోం, విద్యా శాఖల్లో అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేసులను పర్యవేక్షించడానికి వీలుగా ప్రత్యేక డ్యాష్ బోర్డును అందుబాటులోకి తీసుకురానుంది. పెండింగ్ కేసుల పర్యవేక్షణ, యంత్రాంగాన్ని బలోపేతం చేయడం ద్వారా కేసులను నిరంతరం సమీక్షించేందుకు ఈ విధానం దోహదపడతుందని ప్రభుత్వం భావిస్తోంది. బిహార్‌లో ఈ విధానం ఇప్పటికే విజయవంతం కావడంతో ఇక్కడా దీన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం వివిధ శాఖలకు సంబంధించి కోర్టు కేసులు సుమారు 40 వేల వరకు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. అత్యధికంగా రెవెన్యూ, విద్య, హోం, వైద్యం, పరిశ్రమల శాఖలకు సంబంధించినవే ఉంటున్నాయి. రోజువారీ పని ఒత్తిడి వల్ల సకాలంలో ఆయా శాఖల తరుపున స్పందించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ లోపాన్ని సరిదిద్ది ఇక నుంచి ప్రతి కేసును సమీక్షించేలా సీసీఎంఎస్‌ను అందుబాటులోకి తెస్తోంది. దీని ద్వారా కేసుల విచారణకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ఆయా శాఖాధిపతులకు హెచ్చరికల రూపంలో అందుతాయి. తద్వారా కౌంటర్ అఫిడవిట్ల దాఖలకు, సమ్మతి గడువులను తెలుసుకునే వీలు కలుగుతుంది. వ్యక్తిగత కేసుల పురోగతిని ట్రాక్ చేయడానికి కార్యదర్శులు, న్యాయ శాఖ అధికారులకు డ్యాష్ బోర్డును అందుబాటులోకి తెస్తారు. సీసీఎంఎస్‌తో అన్ని విభాగాలను అనుసంధానం చేస్తారు. అడ్వకేట్ జనరల్, ప్రభుత్వ ప్లీడర్ల కార్యాలయాలతోనూ, హైకోర్టు సమాచార వ్యవస్థతోనూ సీసీఎంఎస్‌ను అనుసంధానిస్తారు. దీనికి ఐటీ విభాగం సహాయ సహకారాలను అందించనుంది. న్యాయ, రెవెన్యూ, హోం శాఖ కార్యదర్శుల నేతృత్వంలోని కమిటీ ఇచ్చిన సిఫార్సు మేరకు ప్రభుత్వం ఈ వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

నేను బీఆర్ఎస్‌లోనే ఉన్నా..

- చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్న
- ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తాను బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నానని, చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రజాప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నానని ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. శనివారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలు మారే చరిత్ర ఎవరిది..? ముందుగా పార్టీలు మారింది ఎవరు..? అనేది ప్రజలకు తెలుసునన్నారు. పార్టీలు అన్ని అయిపోయాయని, ఇక మిగిలింది ఎంఐఎం, సీపీఐ మాత్రమే మిగిలాయి అంటూ చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు కేఎస్ రత్నంను ఉద్దేశించి కాలె యాదయ్య ఎద్దేవా చేశారు. గతంలో పార్టీలు మారింది కూడా నియోజకవర్గ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసమేనని చెప్పారు. ఇప్పుడు మీది ఏ పార్టీ అని విలేకరులు ప్రశ్నించగా.. తాను బీఆర్ఎస్ పార్టీలో ఉన్నానని సమాధానం ఇచ్చారు. చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి తెచ్చిన నిధులతో ఏ హోదాతో గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే రత్నం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. చేవెళ్ల నియోజకవర్గంలో అభివృద్ధి ఏమిటో చూపించేందుకు "నేను సిద్ధమేనని.. నీవు సిద్ధమా" అని రత్నంకు ఆయన సవాలు విసిరారు.

చర్చల తర్వాతే పార్టీ

- తండ్రి పార్టీ నుంచి సస్పెన్షన్‌కు గురైన మొదటి కూతురిని నేనే కావొచ్చు
- కాంగ్రెస్‌లో చేరే ఆలోచన లేదు
- రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకోకుంటే సీఎం, మంత్రుల ఇళ్లను ముట్టడిస్తాం
- ఆల్మట్టి ఎత్తు పెంచితే కృష్ణా నదిలో క్రికెట్ ఆడాల్సిందే: కవిత



హైదరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): టీఆర్ఎస్ స్థాపించే ముందు వందల మందితో కేసీఆర్ చర్చలు జరిపారని, ప్రస్తుతం తానూ అదే చేస్తున్నానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. కార్యకర్తలు, నాయకులతో చర్చించిన తర్వాతే పార్టీ ఏర్పాటుపై నిర్ణయం ఉంటుందని పేర్కొన్నారు. నిత్యం వందలాది మది వచ్చి తనను కలుస్తున్నారని, తనతో టచ్‌లో ఉన్న బీఆర్ఎస్ నేతల జాబితా చాలా పెద్దదని చెప్పారు. చరిత్రలో తండ్రి పార్టీ నుంచి సస్పెండ్ అయిన మొదటి కూతుర్ని బహుశా తానే అయి ఉండొచ్చని అన్నారు. ఈ మేరకు శనివారం జాగృతి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా, హరీశ్ రావు, సంతోష్ రావు సీక్రెట్ మీడియా తనపై మూకుమ్మడిగా దాడి చేస్తున్నాయని ధ్వజమెత్తారు. అందరూ తననే లక్ష్యంగా చేసుకుంటున్న విషయాన్ని జనం కూడా పరిశీలిస్తున్నారని చెప్పారు. "కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన ఫైళ్లు నీటిపారుదల శాఖ అధికారులు, మంత్రి సంతకాలు పెట్టకుండా, నేరుగా పెద్ద సారు దగ్గరికే వెళ్తున్నాయని, ఇది తర్వాతి కాలంలో ఇబ్బందులకు దారితీయొచ్చని 2016లోనే కేటీఆర్‌ను హెచ్చరించా. నేను అన్నట్లే ప్రాజెక్టు విషయంలో ప్రతి నిర్ణయం కేసీఆర్‌దేనని హరీశ్‌రావు పీసీ ఘోష్ కమిషన్‌కు చెప్పారు" అని కవిత పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో చేరే ఆలోచన తనకు లేదని, ఆ పార్టీ పెద్దలు కూడా ఎవరూ తనను సంప్రదించలేదని వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి పదే పదే తన పేరు ఎందుకు తీస్తున్నారో తెలియదని, ఒక వేళ ఆయనే కాంగ్రెస్ నుంచి బయటికి వెళ్తున్నారేమోనని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఎమ్మెల్సీ పదవికి సంబంధిత ఫార్మాట్‌లోనే రాజీనామా చేశానని, ఆమోదించకుండా మండలి చైర్మన్ ఎందుకు ఆలస్యం చేస్తున్నారో తెలియదని పేర్కొన్నారు. తీన్మార్ మల్లన్న పార్టీ ఏర్పాటు చేయడంపై స్పందిస్తూ.. ప్రజాస్వామ్యంలో ఎవరైనా పార్టీ పెట్టుకోవచ్చని, ఎంత మంది జై బీసీ అంటే అంత మంచిదని అభిప్రాయపడ్డారు. 42శాతం బీసీ రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకోకుంటే సీఎం, మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తును పెంచేందుకు కర్ణాటక ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని, అదే జరిగితే.. కృష్ణా నదిలో తెలంగాణ వాళ్లు క్రికెట్ ఆడుకోవాల్సిందేనని అన్నారు. చింతమడకలో బతుకమ్మ వేడుకలకు వెళ్లడం వెనుక రాజకీయమేమి లేదన్నారు. పండుగ వేళ ఇచ్చే చీరలను ఇందిరమ్మ పేరుతో కాకుండా బతుకమ్మ పేరుతో ఇవ్వాలని సూచించారు.

యువత వల్లే హెచ్‌సీయూ భూములకు రక్షణ

- జెన్-జీ శక్తిని తక్కువగా అంచనా వేయొద్దు: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమంలో యువత సాగించిన క్రియాశీల ఉద్యమం వల్లే కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల హెచ్‌సీయూ భూములకు రక్షణ ఏర్పడిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సోషల్ మీడియాలో యువత సాగించిన ఉద్యమం, సుప్రీం కోర్టు అనుకూల తీర్పు వల్ల భూములను విక్రయించే ప్రయత్నాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం విరమించుకున్నదని తెలిపారు. యువత ఆకాంక్షలను పాలకులు విస్మరిస్తే.. ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. శనివారం ముంబైలో జరిగిన 'ఎన్‌డీటీవీ యువ-2025.. ది ముంబై చాప్టర్' సదస్సులో కేటీఆర్ మాట్లాడారు. దేశ యువత ఆకాంక్షలు ఆకాశాన్ని తాకుతుంటే, పాలకుల ఆలోచనలు పాకిస్థాన్, బంగ్లాదేశ్ చుట్టూనే తిరుగుతున్నాయని విమర్శించారు. ప్రజల మౌలిక భావోద్వేగాలను రెచ్చగొడుతూ మందిర్-మసీదు, ఎవరు ఏం తింటున్నారు? ఎవరేం కట్టుకుంటున్నారన్న అంశాలపై ప్రజల దృష్టిని మళ్లించడంలో మోదీ విజయం సాధించారని వ్యాఖ్యానిచారు. చైనా, జపాన్, అమెరికా వంటి పశ్చిమ దేశాలతో పోటీపడాలే తప్ప, మనకన్నా వెనుకబడిన దేశాలతో పోల్చుకుని సంతృప్తిచెందడం సరికాదని పేర్కొన్నారు. ప్రస్తుత యువతరం(జెన్-జీ) శక్తిని తక్కువ అంచనా వేయద్దని పాలకులను హెచ్చరించారు.

ఎవరా ఐఏఎస్ అధికారి?

- బ్లాక్‌మనీ మార్పునకు ఆఫర్‌పై 'ఆంధ్రజ్యోతి' కథనంతో కలకలం
- రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ అంశంపై చర్చ
- సచివాలయంలో అందరి నోటా ఇదే మాట

హైదరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఓ ఐఏఎస్ అధికారి బ్లాక్ మనీ వ్యవహారంపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనం రెండు తెలుగు రాష్ట్రాల్లో కలకలం రేపింది. ఎవరా ఐఏఎస్? అంటూ అందరూ ఆరా తీసే ప్రయత్నం చేశారు. తెలంగాణ సచివాలయంలో ఉద్యోగులు ఇదే విషయంపై పెద్ద ఎత్తున చర్చించుకున్నారు. తన వద్ద రూ.50 కోట్ల బ్లాక్‌మనీ ఉందని, ఎవరైనా వైట్‌గా మార్చే మార్గం చెబితే రూ.కోటి ఇస్తానంటూ వ్యాపారులకు ఆ ఐఏఎస్ అధికారి ఆఫర్ ఇచ్చారని పేర్కొంటూ 'రూ.50 కోట్ల బ్లాక్‌మనీ ఉంది.. మారుస్తారా?' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో శనివారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. అయితే దీనిపై కొంత మంది సీనియర్ ఐఏఎస్‌లు ఎవరికి వారే భుజాలు తడుముకుంటూ గుసగుసలాడుకున్నారు. కీలక శాఖల్లో చక్రం తిప్పుతున్న పలువురు అధికారులు తమపైనే ఈ కథనం వచ్చిందని ఆందోళనకు గురయ్యారు. కాగా, ఈ విషయంపై నిఘా వర్గాలు ఆరా తీసినట్లు తెలిసింది. నల్లధనం మార్పునకు ప్రయత్నించిన అధికారి, అందుకు సహకరించిన వ్యక్తుల గురించి వివరాలు సేకరించేందుకు రంగంలోకి దిగాయి. ఏపీలో పనిచేస్తున్న ఐఏఎస్ అధికారులు సైతం.. నల్లధనం మార్పిడి కోసం ప్రయత్నించిన అధికారి ఎవరని తెలంగాణలో వారికి తెలిసిన అధికారులకు వాట్సాప్ సందేశాలు పెట్టి వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేసినట్లు సమాచారం.

'ఎన్జీవో'లను ఎందుకు వేధిస్తారు?

- లైసెన్సు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారేం?
- సొంత తనిఖీ, పర్యవేక్షణ వ్యవస్థలున్నాయి
- జమాఖర్చులు ఎప్పుడైనా పరిశీలించొచ్చు
- అయినా ఎందుకు ఇబ్బంది పెడుతున్నారు?
- కేంద్రంపై సుప్రీంకోర్టు సీరియస్
- రెండు ఎన్జీవోలపై కేంద్ర హోంశాఖ ఉత్తర్వులను
- రద్దు చేసిన మద్రాస్ హైకోర్టు తీర్పు ధ్రువీకరణ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 20 : విదేశీ నిధుల (నిరోధక) చట్టం ప్రకారం నమోదైన ఎన్జీవోల లైసెన్సులను రెన్యువల్ చేయకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. సాంకేతిక అంశాలను కారణాలుగా చూపించి రెండు ఎన్జీవోలకు రెన్యువల్‌ను నిరాకరించడంపై తీవ్రంగా స్పందించింది. దీనిపై కేంద్రం వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను కొట్టి వేస్తూ, మద్రాస్ హైకోర్టు తీర్పును కోర్టు ధ్రువీకరించింది. విదేశీ నిధులు పొందుతున్న ఎన్జీవోలు ఇటీవలి సంవత్సరాల్లో కఠినమైన తనిఖీ ప్రక్రియకు గురవుతున్నాయి. తరచూ రెన్యువల్ సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ సమయంలో వెలువడిన సుప్రీంకోర్టు తీర్పు కేంద్రానికి ఈ విషయంలో స్పష్టమైన సంకేతాలు అందించింది. చెన్నై కేంద్రంగా పనిచేస్తున్న రెండు ఎన్జీవోలు.. ఎలెన్ శర్మ మెమోరియల్ ట్రస్ట్, శర్మ సెంటర్ ఫర్ హెరిటేజ్ ఎడ్యుకేషన్... విద్య, ఆరోగ్యం, చారిత్రక వారసత్వం తదితర అంశాలపై స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్నాయి. తమ లైసెన్సులను క్రమబద్ధీకరించాలంటూ 2021లో అవి ఇచ్చిన అప్లికేషన్‌లను ఆ ఏడాది డిసెంబరులో కేంద్ర హోం శాఖ తిరస్కరించింది. అయితే, కేంద్రం ఆదేశాలను ఈ ఏడాది జూన్‌లో మద్రాస్ హైకోర్టు రద్దుచేసింది. నాలుగు వారాల్లోగా ఆసంస్థల లైసెన్సులను పొడిగించాలని ఆదేశించింది. విదేశీ నిధులను ఆ సంస్థలు దుర్వినియోగం చేసినట్టు గానీ, మళ్లించినట్టుగానీ ఆధారాలు లేవని తెలిపింది. కేవలం ప్రక్రియపరమైన కొన్ని లోపాలు మాత్రమే ఉన్నాయని, ఆ మాత్రానికే ఆ సంస్థలను ఇబ్బందిపెట్టడం సరికాదని స్పష్టం చేసింది. దీనిపై కేంద్రం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. కేంద్రం వేసిన పిటిషన్‌ను న్యాయమూర్తులు విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన బెంచ్ శుక్రవారం విచారించింది. తమకు తోసిన రీతిలో ఎన్జీవోలు స్వచ్ఛంద సేవ చేసుకోవడంవల్ల మీకొచ్చిన ఇబ్బంది ఏమిటని కేంద్రాన్ని బెంచ్ సూటిగా ప్రశ్నించింది. సొంత తనిఖీ, పర్యవేక్షణ వ్యవస్థలను కలిగి, జమాఖర్చులను ఎప్పుడయినా పరిశీలించే అధికారం కలిగి ఉండి కూడా ఎందుకని ఆ సంస్థలను మూసివేయాలని భావిస్తున్నారంటూ... కేంద్రం తరపున హాజరైన అడిషనల్ సొలిసిటర్ జనరల్ అర్చన పాఠక్ దవేను బెంచ్ ప్రశ్నించింది. పోనీ, తప్పుడు పనులు చేస్తున్నట్టుగానీ, నిధులను దుర్వినియోగం చేస్తున్నట్టు గానీ ఆ సంస్థలపై ఆరోపణలు ఉన్నాయా అని నిలదీసింది. అయితే, చట్ట నిబంధనలను ఉల్లంఘించిన కారణంగా ఆ సంస్థల లైసెన్సును పొడిగించలేదని, వాటి పత్రాలను నిశితంగా తనిఖీ చేయడానికి ప్రభుత్వానికి తగిన వ్యవధి కావాలని దవే వాదించారు. ఇందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. విషయాలను సంక్లిష్టంగా మార్చొద్దని, సదరు ఎన్జీవోలపై వేధింపులను నిలిపివేసి హైకోర్టు ఉత్తర్వులను వెంటనే అమలుచేయాలని స్పష్టం చేసింది.

ఏడాది బిడ్డను నేలకేసి కొట్టిన తండ్రి

మద్యం మత్తులో భార్యతో గొడవపడి ఘాతుకం

తీవ్రగాయాలతో ఆ చిన్నారి దుర్మరణం.. సూర్యాపేటలో ఘోరం.. నిందితుడి అరెస్టు



మృతిచెందిన భవిజ్ఞ (ఫైల్)

సూర్యాపేట క్రైం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తలుగా తాము గొడవ పడుతుంటే మధ్యలో ఏడాది బిడ్డ ఏం నేరం చేసింది? అనే స్పృహ కూడా లేకుండా పోయిందా దుర్మార్గుడికి! మద్యం మత్తులో భార్యతో గొడవపడి.. తానేం చేస్తున్నాననే విచక్షణమరిచి ఇంట్లో ఓ పక్కన ఉన్న కన్నబిడ్డను చేతుల్లోకి తీసుకొని నేలకేసి బలంగా కొట్టాడు. అంతటి తీవ్ర ఘాతాన్ని తట్టుకొని ఆ లేత ప్రాణం ఎలా బతకగలదు? తీవ్రగాయాలతో ప్రాణాలొదిలింది. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఈ ఘటన స్థానికులను తీవ్ర కలవరపాటుకు గురిచేసింది. సీఐ వెంకటయ్య వెల్లడించిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలం డి-కొత్తపల్లి గ్రామానికి చెందిన గైగొళ్ల వెంకటేశ్ వ్యవసాయ పనులు చేస్తుంటాడు. రెండేళ్ల క్రితం ఏపీలోని పల్నాడు జిల్లా సిరిగిపాడు గ్రామానికి చెందిన నాగమణితో వివాహ మైంది. వీరికి పాప భవిజ్ఞ (1) పుట్టింది. కొన్ని నెలల నుంచి భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. రెండునెలల క్రితం భర్తతో గొడవపడి నాగమణి పుట్టింటికి వెళ్లింది. పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడుకొని నెల క్రితం నాగమణిని వెంకటేశ్ కాపురానికి తెచ్చుకున్నాడు. నిత్యం తాగి ఇంటికొచ్చే వెంకటేశ్, ఆ మత్తులో భార్యతో గొడవపడుతుండేవాడు. వారం క్రితం సూర్యాపేటలోని ప్రియాంక కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని భార్య, పాపతో ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి వెంకటేశ్ మద్యం మత్తులో భార్యతో గొడవపడ్డాడు. ఆ సమయంలో భవిజ్ఞ ఏడుస్తుండటంతో ఆవేశంలో వెంకటేశ్ పాప కాళ్లు పట్టుకొని నేలకేసి కొట్టాడు. ఈ ఘటనలో చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. నాగమణి వెంటనే పాపను స్థానికుల సాయంతో ఆస్పత్రికి తీసుకెళ్లింది. అక్కడ చికిత్స పొందుతూ భవిజ్ఞ ప్రాణాలు విడిచింది. వెంకటేశ్‌పై కోపంతో రగిలిపోయిన స్థానికులు, బంధువులు అతడిపై దాడి చేసేందుకు ప్రయత్నించారు. పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. నాగమణి ఫిర్యాదు మేరకు ఘటనపై కేసు నమోదు చేశారు.

రూ.వంద లంచం కేసులో ఆర్టీసీ ఉద్యోగికి విముక్తి

- 39 ఏళ్ల అనంతరం నిర్దోషిగా ప్రకటించిన ఛత్తీస్‌గఢ్ హైకోర్టు

బిలాస్‌పూర్, సెప్టెంబరు 20: లంచం కేసులో శిక్ష పడ్డ అవిభాజ్య మధ్య ప్రదేశ్ ఆర్టీసీ ఉద్యోగి ఒకరికి ఛత్తీస్‌గఢ్ హైకోర్టు విముక్తి కలిగించింది. రూ. వంద లంచం తీసుకున్నారంటూ రాయ్‌పూర్‌లో బిల్ అసిస్టెంట్‌గా పనిచేసిన జగదీశ్వర్ ప్రసాద్ అవధియా (ప్రస్తుతం 83 ఏళ్లు)కు 2004లో కింది కోర్టు ఏడాది జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించగా ఆయన నిర్దోషి అంటూ తాజాగా హైకోర్టు తీర్పు ఇచ్చింది. కేసు నమోదైన 39 ఏళ్ల అనంతరం ఆయనకు ఊరట లభించింది. 1981-85 నాటి పెండింగ్ బిల్లులను పాస్ చేయడానికి రూ.100 లంచం అడుగుతున్నారని అశోక్ కుమార్ వర్మ అనే ఉద్యోగి 1986 అక్టోబరు 24న లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. లోకాయుక్త దర్యాప్తు బృందం వర్మకు రసాయినాలు పూసిన రెండు రూ.50 నోట్లను ఇచ్చి అవధియాకు అందజేయాలని సూచించింది. ఆ నోట్లను తీసుకుంటుండగా అవధియాను పట్టుకొని కేసు పెట్టింది. విచారణ జరిపిన కింది కోర్టు శిక్ష విధించింది. దీనిపై ఆయన హైకోర్టులో అప్పీలు చేశారు. ఉన్నతాధికారులు ఆమోదిస్తే తప్ప తనకు సొమ్ము చెల్లించే అధికారం ఉండదని తెలిపారు. తనను అనవసరంగా ఇరికించారని చెప్పారు. తగిన ఆధారాలు చూపించడంతో ఏకీభవించిన ధర్మాసనం కేసును కొట్టివేసింది. తనకు ఇంకా పోరాడే శక్తి లేదని, ఇప్పటికైనా పింఛను ఇప్పించాలని అవధియా ప్రభుత్వాన్ని కోరారు.

విద్యార్థిపై గంజాయి బ్యాచ్ దాడి!

- అడ్డగించి డబ్బులివ్వాలని డిమాండ్
- ఇవ్వకపోవడంతో మూకుమ్మడి దాడి.. దెబ్బతిన్న ప్లీహము
- 4 రోజులైనా నిందితులను అరెస్టు చేయని పోలీసులు
- మహబూబ్‌నగర్ జిల్లాలో ఘటన



దాడిలో గాయపడ్డ సాయికుమార్

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పాలమూరులో గంజాయి బ్యాచ్ రెచ్చిపోయింది. గంజాయి మత్తులో ఓ విద్యార్థిపై పిడిగుద్దులు కురిపించడంతో బాధితుడి ప్లీహము దెబ్బతింది. జిల్లాలోని భూత్పూర్ మండలం అన్నాసాగర్‌కు చెందిన రైతు చిన్న నర్సింహులు కుమారుడు సాయికుమార్(19) నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా మూడో సంవత్సరం చదువుతున్నాడు. రోజూ గ్రామం నుంచి రాకపోకలు సాగిస్తుంటాడు. 16న కాలేజీ నుంచి ముగ్గురుస్నేహితులతో కలిసి వెళుతుండగా అక్కడ గంజాయి తాగుతున్న ఐదారుగురు పోకిరీలు సాయికుమార్‌ను అడ్డుకొని డబ్బులు డిమాండ్ చేశారు. తన దగ్గర లేవని సాయి చెప్పడంతో రూ.40, రూ50 అయినా లేవా? అంటూ అతడిని ఇష్టానుసారంగా కొట్టారు. తీవ్రగాయాలైన సాయి, ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు విషయం చెప్పాడు. వెంటనే వారు, అతడిని నగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. రక్తస్రావం జరుగుతుండటంతో స్కానింగ్ చేయగా ప్లీహము పూర్తిగా దెబ్బతిన్నట్లు తేలింది. ఆపరేషన్ చేసి ప్లీహము తొలగించారు. ప్రస్తుతం విద్యార్థి ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డాడు. అయితే ప్లీహము నుంచే రోగనిరోధక శక్తి వస్తుందని, ఆ అవయవం లేకపోవడంతో ఏడాదికోసారి రోగనిరోధక శక్తి ఇంజెక్షన్, ప్రతి ఐదేళ్లకోసారి బూస్టర్ డోస్‌ను సాయికుమార్ తీసుకోవాల్సి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఘటనపై అదేరోజు పోలీసులకు ఫిర్యాదు చేసినా నిందితులను అదుపులోకి తీసుకోకపోవడం గమనార్హం. దాడికి పాల్పడ్డ నిందితులు నేతల వద్ద పైరవీలు చేసుకుంటున్నారన్న ప్రచారం సాగుతోంది.

పోషించే సామర్థ్యం ఉంటేనే బహుభార్యత్వం వర్తింపు

- ముస్లింల వివాహాలపై కేరళ హైకోర్టు స్పష్టీకరణ
- యాచకుడి రెండో భార్య కేసుపై తీర్పు

కొచ్చి, సెప్టెంబరు 20: భార్యలను పోషించే శక్తి ఉన్నప్పుడు మాత్రమే ముస్లిం పురుషులు పలువురు మహిళలను వివాహమాడడానికి అవకాశం ఉంటుందని కేరళ హైకోర్టు తెలిపింది. ఖురాన్, ముస్లిం చట్టాలు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని పేర్కొంది. ఆర్థిక స్తోమత లేకుండా ఇద్దరు, ముగ్గురిని వివాహం చేసుకుంటామంటే అంగీకరించబోమని తెలిపింది. పాలక్కాడ్ జిల్లాకు చెందిన ఓ యాచకుని 39ఏళ్ల రెండో భార్య దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ స్పష్టత ఇచ్చింది. తన భర్త యాచన, ఇతర మార్గాల ద్వారా నెలకు రూ.25వేలు సంపాదిస్తున్నాడని, అందువల తనకు నెలకు రూ.10వేలు భరణం చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరింది. తనను కొడుతుండడంతో పాటు, మూడో భార్యను తీసుకొస్తానంటూ బెదిరిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. 46ఏళ్ల ఆ యాచకుడు తనకు విడాకులు ఇచ్చాడని, మొదటి భార్యతో నివసిస్తున్నాడని తెలిపింది. తొలుత ఈ వినతిని ఫ్యామిలీ కోర్టు కొట్టివేసింది. హైకోర్టులో అప్పీలు చేయగా జస్టిస్ కె.వి.కున్హికృష్ణన్ ధర్మాసనం విచారణ జరిపింది. అంధుడైన భర్త తరచూ కొడుతున్నాడంటే నమ్మలేమని పేర్కొంది. భర్త యాచకుడు కావడంతో భరణం చెల్లించాలని ఆదేశించలేమని పేర్కొంది. పోషించే సామర్థ్యం ఉన్నవారికే బహుభార్యాత్వం వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఆమెకు అన్న వస్త్రాలను కల్పించే బాధ్యతను తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. వివాహాలపై అవగాహన కలిగించాలని ముస్లిం మత పెద్దలకు సూచించింది.

ఐటీ రిఫండ్ ఇంకా రాలేదా!

అయితే వీటిని ఓసారి పరిశీలించండి..

ఈ నెల 16తో ఆదాయ పన్ను (ఐటీ) రిటర్న్‌ల ఫైలింగ్ ముగిసింది. దాదాపు ఏడు కోట్ల మందికిపైగా తమ రిటర్న్‌లు ఫైల్ చేశారు. వీరిలో చాలా మంది రిఫండ్స్ కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నారు. జూన్-జూలైలో రిటర్న్ ఫైల్ చేసినా ఇంకా మాకు రిఫండ్ అందలేదని చాలా మంది ఫిర్యాదు చేస్తున్నారు. మరోపక్క ఐటీ రిటర్న్‌ల ప్రాసెసింగ్, ఈ-వెరిఫికేషన్ శరవేగంగా చేస్తున్నట్టు ఐటీ శాఖ చెబుతోంది. అయినా రిఫండ్స్ ఎందుకు ఆలస్యమవుతున్నాయో తెలుసుకుందాం.



ఆలస్యానికి కారణాలు

ఐటీ రిటర్న్ ఫైల్ చేసి ఈ-వెరిఫికేషన్ పూర్తయిన నాలుగు నుంచి ఐదు వారాల్లో రిఫండ్ మొత్తం ఆయా వ్యక్తుల బ్యాంకు ఖాతాల్లో పడాలి. ఈ గడువులోగా రిఫండ్ రాకపోతే ఈ కింది విషయాలు కారణమై ఉంటాయి. అవేమిటంటే..

- ఐటీ శాఖ వద్ద ఉండే టాక్స్‌పేయర్ ఇన్ఫర్మేషన్ సమ్మరీ (టీఐఎస్), యాన్యువల్ ఇన్ఫర్మేషన్ సమ్మరీ (ఏఐఎస్), ఫామ్ 26ఏఎస్‌లోని సమాచారానికి, ఫైల్ చేసిన రిటర్న్‌లోని సమాచారం మధ్య తేడాలు
- ఐటీ శాఖ నుంచి ఏమైనా నోటీసులు, రివ్యూల సమాచారం వచ్చినప్పుడు
- బిజినెస్ ఆదాయం, మూలధన లాభాలు, అనేక తగ్గింపులు (డిడక్షన్స్) ఉన్నప్పుడు
- రిఫండ్ మొత్తం రూ.50,000 కంటే ఎక్కువగా ఉన్నప్పుడు
- టీడీఎస్ డేటాలో తేడాలు.
- రిటర్న్‌ల్లోని వివరాలను పూర్తి స్థాయిలో పరిశీలించాల్సిన అవసరం ఏర్పడినప్పుడు
- బ్యాంకు ఖాతాను ముందుగా వ్యాలిడేట్ చేయకపోవడం
- బ్యాంకు ఖాతాలోని పేరు, పాన్ కార్డుపై ఉన్న పేరులో తేడా
- తప్పుడు ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఉన్నప్పుడు
- ఐటీఆర్‌లో పేర్కొన్న బ్యాంకు ఖాతా క్లోజ్ చేసినప్పుడు
- పాన్ కార్డును ఆధార్‌తో అనుసంధానం చేయకపోవటం

చెక్ చేయడం ఎలా?

మన రిఫండ్ ఎందుకు ఆలస్యమవుతుందనే విషయాన్ని ఈ కింది పద్దతిలో చెక్ చేసుకోవచ్చు.

- పాన్ నంబర్, పాస్‌వర్డ్ ద్వారా incometax.gov.in వెబ్‌సైట్‌లోకి లాగిన్ కావాలి. ఇందుకోసం ఇప్పటికే మీ పాన్ నంబర్‌ను మీ ఆధార్ నంబరుతో అనుసంధానం చేసి ఉండాలి. ఒకవేళ చేసి ఉండకపోతే, ఇదే వెబ్‌సైట్‌లోని 'లింక్ నౌ' బటన్ ఆప్షన్ ద్వారా అనుసంధానించాలి.
- లాగిన్ అయిన తర్వాత టాప్ మెనూలో ఉన్న నౌ యువర్ రిఫండ్ స్టేటస్‌పై క్లిక్ చేయాలి.
- ఇప్పుడు ఈ-ఫైల్ ట్యాబ్‌లోకి వెళ్లి 'ఇన్‌కమ్‌ట్యాక్స్ రిటర్న్స్' ట్యాబ్ మీద క్లిక్ చేసి 'వ్యూ ఫైల్డ్ రిటర్న్స్' ఆప్షన్‌ను ఎంచుకోవాలి.
- ఇప్పుడు కోరుకున్న అసెస్‌మెంట్ సంవత్సరానికి సంబంధించి మీ రిఫండ్ స్టేటస్ స్క్రీన్‌పై కనిపిస్తుంది.

ఐటీఆర్ స్టేటస్ రకాలు

సబ్‌మిటెడ్ అండ్ పెండింగ్ ఫర్ ఈ-వెరిఫికేషన్ అని వస్తే: రిటర్న్ ఫైల్ చేసినా ఈ-వెరిఫికేషన్ పూర్తి కాకపోవడం లేదా సెంట్రల్ ప్రాసెసింగ్ సెంటర్ (సీపీసీ)కు వెరిఫై చేసిన మీ రిటర్న్ ఇంకా అందలేదని అర్థం.

సక్సెస్‌ఫుల్లీ ఈ-వెరిఫైడ్ అని వస్తే: మీ రిటర్న్ ఈ-వెరిఫై చేయబడింది. అయితే రిటర్న్‌లోని విషయాలను ఇంకా ప్రాసెస్ చేయలేదు అని అర్థం.

ప్రాసెస్డ్: మీరు దాఖలు చేసిన రిటర్న్ విజయవంతంగా ప్రాసెస్ చేయబడింది అని అర్థం.

డిఫెక్టివ్: మీరు ఫైల్ చేసిన రిటర్న్‌లో కీలకమైన కొన్ని వివరాలు లేకపోవడం లేదా తేడాలు ఉన్నాయని అర్థం.

ఇలాంటి సందర్భాల్లో నిర్ణీత కాలవ్యవధిలోగా ఈ లోపాలను సవరించి మళ్లీ రిటర్న్ ఫైల్ చేయాలని ఐటీ శాఖ సెక్షన్ 139 (9) కింద నోటీసులు జారీ చేస్తుంది. ఆ నోటీసులకు స్పందించకపోతే మీ ఐటీ రిటర్న్‌ను చెల్లనిదిగా భావించి ప్రాసెస్ చేయరు.

కేసు ట్రాన్స్‌ఫర్డ్ టు అసెసింగ్ ఆఫీసర్: మీ రిటర్న్‌లోని కొన్ని విషయాల్లో ఏమైనా తీవ్రమైన తేడాలు ఉంటే సీపీసీ ఆ రిటర్న్‌లు అసెసింగ్ అధికారికి బదిలీ చేస్తుంది. అప్పుడు అసెసింగ్ అధికారి అడిగిన వివరాలు సబ్‌మిట్ చేస్తే సరిపోతుంది.

ఆలస్యంగానూ రిటర్నుల ఫైలింగ్

లేటు ఫీజుతో సాధ్యమే

ఈ నెల 16తో ఐటీ రిటర్న్‌ల గడువు ముగిసింది. డెడ్‌లైన్‌ను ఒక రోజు పొడిగించినా కొంతమంది ఇంకా తమ రిటర్న్ ఫైల్ చేయలేదు. అయితే వీరు లేటు ఫీజుతో తమ రిటర్న్ ఫైల్ చేయడానికి ఈ ఏడాది డిసెంబరు 31 వరకు గడువు ఉంది.

పెనాల్టీ ఎంత?

- వార్షికాదాయం రూ.5 లక్షల వరకు ఉంటే రూ.1,000
- వార్షికాదాయం రూ.5 లక్షలకు మించితే రూ.5,000

ఎదురయ్యే పరిణామాలు వడ్డీ భారం..

నిర్ణీత గడువులోగా ఐటీ రిటర్న్ ఫైల్ చేయకుండా, ఆలస్యంగా చేస్తే, చెల్లించాల్సిన పన్ను బకాయిలపై వడ్డీ పడుతుంది.

క్యారీ ఫార్వర్డ్ ప్రయోజనాలు కోల్పోవడం..

రిటర్న్ ఆలస్యంగా ఫైల్ చేసినా పూరించని తరుగుదల, ఇంటి అమ్మకాలపై వచ్చే నష్టాలకు మాత్రమే క్యారీ ఫార్వర్డ్ ప్రయోజనం లభిస్తుంది. మిగతా నష్టాలకు ఆశలు వదులుకోవాల్సిందే

రిఫండ్స్ ఆలస్యం..

ఇప్పటికే రిటర్న్ ఫైల్ చేసి రెండు మూడు నెలలు గడిచినా కొందరికి రిఫండ్స్ అందలేదు. గడువు ముగిశాక ఫైల్ చేసే రిటర్న్‌ల రిఫండ్స్ మరింత ఆలస్యం అవుతాయి.

మరింత స్క్రూటినీ..

ఆలస్యంగా ఫైల్ చేసే ఐటీ రిటర్న్‌లను ఐటీ శాఖ మరింత కూలంకషంగా స్క్రూటినీ చేసే అవకాశం ఉంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



21వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	560
వరంగల్	542	గోదావరి	550
చిత్తూరు	578	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	115	విజయవాడ	130
వరంగల్	115	గుంటూరు	132
కరీంనగర్	115	ఒంగోలు	132
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	120
కర్నూలు	115	నెల్లూరు	125
విశాఖపట్నం	134	అనంతపురం	125
గోదావరి	130		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,12,150 ▲	1,02,800 ▲	1,45,000 ▲
విజయవాడ	1,14,100 ▲	1,08,000 ▲	1,34,500 ▲
విశాఖపట్నం	1,12,150 ▲	1,02,800 ▲	1,45,000 ▲
రాజమండ్రి	1,12,150 ▲	1,02,800 ▲	1,34,700 ▲
ప్రొద్దుటూరు	1,14,400 ▲	1,05,250 ▲	1,35,000 ▲
ముంబై	1,09,775 ▼	1,00,554 ▼	1,28,000 ▲

తగ్గిన ఏసీలు, డిష్‌వాషర్ల ధరలు

రూ.4,500, రూ.8,000 వరకు తగ్గించిన కంపెనీలు

న్యూఢిల్లీ: రూమ్ ఎయిర్ కండీషనర్లు (ఏసీలు), డిష్‌వాషర్స్ ధరలను గణనీయంగా తగ్గించినట్లు ఎలక్ట్రానిక్స్, గృహోపకరణ తయారీ సంస్థలు ప్రకటించాయి. ఈ ఉత్పత్తులపై జీఎస్‌టీని ప్రభుత్వం 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించటంతో ఆ మేరకు పన్ను ప్రయోజనాలను వినియోగదారులకు బదిలీ చేసినట్లు కంపెనీలు వెల్లడించాయి. రూమ్ ఏసీ ధరలను గరిష్ఠంగా రూ.4,500 వరకు, డిష్‌వాషర్స్ ధరలను రూ.8,000 వరకు తగ్గించినట్లు కంపెనీలు వెల్లడించాయి. ఈ నెల 22 నుంచి తగ్గించిన ధరలు అమల్లోకి వస్తాయని తెలిపాయి. ధరల తగ్గింపుతో పండగ సీజన్‌లో విక్రయాల్లో రెండంకెల వృద్ధి చేసే నమోదు చేసే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఏసీ, డిష్ వాషర్స్ తయారీ కంపెనీలైన వోల్టాస్, డైకిన్, గోద్రెజ్ అప్లయెన్సెస్, పానాసోనిక్, హాయర్ వంటి ప్రధాన బ్రాండ్లు ఇప్పటికే సవరించిన జాబితాను విడుదల చేశాయి.

ఎంత తగ్గాయంటే..

వోల్టాస్ ఫిక్స్‌డ్ స్పీడ్ విండో ఏసీ ధరను రూ. 42,900 నుంచి రూ. 39,590కి, ఇన్వర్టర్ విండో ఏసీ ధరను రూ. 46,990 నుంచి రూ. 43,290కి తగ్గించగా, డైకిన్ ఒక టన్ను 5 స్టార్ ఇన్వర్టర్ ఏసీ ధర రూ. 20,500 నుంచి రూ. 18,890కి తగ్గించింది. ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ తన ఎంట్రీ లెవెల్ 1 టన్ను 3 స్టార్ ఇన్వర్టర్ స్ప్లిట్ ఏసీని రూ. 32,890గా నిర్ణయించగా, 2 టన్నుల మోడల్ ధరను రూ. 55,490కి తగ్గించింది. హాయర్ 1.6 టన్నుల గ్రావిటీ ఇన్వర్టర్ ఏసీ ధరను రూ. 46,085గా సవరించింది. గోద్రెజ్ అప్లయెన్సెస్ క్యాసెట్, టవర్ ఏసీల ధరలను రూ. 8,550 నుంచి రూ. 12,450 వరకు తగ్గించింది.

డిష్‌వాషర్ విభాగంలో: బీఎస్‌హెచ్ హోమ్ అప్లయెన్సెస్ తన ఎంట్రీ లెవెల్ డిష్‌వాషర్ ధరను రూ.49,000 నుంచి రూ.45,000కి తగ్గించగా, ప్రీమియం మోడల్ ధరను రూ. 1,04,500 నుంచి రూ. 96,500కి తగ్గించింది. వోల్టాస్- బెకో తన ఎంట్రీ లెవెల్ మోడల్ ధరను రూ.25,900 నుంచి రూ. 23,390కి కుదించింది.

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జీఎస్‌టీ 2.0 సంస్కరణలు ఈ నెల 22 నుంచి అమల్లోకి రానున్నాయి. గూడ్స్, సర్వీసెస్‌కు సంబంధించి ఇప్పటికే తగ్గించిన రేట్లకు అనుగుణంగా నోటిఫికేషన్లు జారీ చేయటం జరిగింది. అంతేకాదు పన్ను తగ్గింపు ప్రయోజనాలను కచ్చితంగా వినియోగదారులకు బదిలీ చేయాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలిచ్చింది. ఈ సందర్భంగా ఉత్పత్తిదారులు, వ్యాపారస్తులు పాటించాల్సిన నియమ నిబంధనలేమిటో చూద్దాం.

జీఎస్‌టీ 2.0..

వ్యాపారులు ఇవి తెలుసుకోండి



రాంబాబు గొండాల

మొదటిది, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ)కి సంబంధించినది. ఇంతకు ముందు 28 శాతంలో ఉన్న వస్తువులను 18 శాతానికి, 12 శాతంలో ఉన్న వస్తువులు 5 శాతానికి తగ్గించిన సంగతి తెలిసిందే. ఇక్కడ చాలా మందికి వచ్చే సందేహం ఏమిటంటే సెప్టెంబరు 21 నాటికి ఉన్న స్టాక్ మీద ఎక్కువ శాతంలో ఐటీసీ తీసుకోవటం జరిగింది. అంటే 28 శాతం లేదా 12 శాతంలో. అలాంటప్పుడు రేటు తగ్గిన మేరకు ఐటీసీని రివర్స్ చేయాల్సిన అవసరం ఉందా? జీఎస్‌టీ నిబంధనల మేరకు ఒక సరఫరా మీద పన్ను చెల్లిస్తున్నప్పుడు ఐటీసీకి అర్హులు. దీనికి పన్ను శాతానికి సంబంధం లేదు. కాబట్టి ఇప్పటికే తీసుకున్న క్రెడిట్ ఐటీసీ నియమ నిబంధనల మేరకు ఉంటే ఎలాంటి సమస్య లేదు.

ఇకపోతే, కొన్ని వస్తువులు పూర్తిగా పన్ను మినహాయింపులోకి చేరాయి. అంటే, వీటికి సంబంధించిన ఇన్‌పుట్ మీద ఇప్పటికే ఐటీసీ పొంది ఉంటారు. కానీ, 22 వ తేదీ నుంచి వీటి అమ్మకాలపై ఎలాంటి పన్ను వర్తించదు. కాబట్టి ఇలాంటి ఉత్పత్తులకు సంబంధించి 21 తేదీ నాటికి మిగిలి ఉన్న స్టాక్ మీద ఐటీసీ రివర్స్ చేయాలి. చాలా సందర్భాల్లో ఉన్న స్టాక్‌కు సరిపడా ఐటీసీ బ్యాలెన్స్ ఉండదు. ఎందుకంటే ఐటీసీని ఎప్పటికప్పుడు ట్యాక్స్ చెల్లింపు కోసం వాడుతుంటారు. అలాంటప్పుడు క్యాష్ లెడ్జర్ ద్వారా తగ్గిన మేరకు చెల్లించాలి. కొన్ని సందర్భాల్లో ఉన్న స్టాక్ కంటే ఎక్కువ ఐటీసీ బ్యాలెన్స్ ఉంటుంది. అలాంటప్పుడు స్టాక్‌కు సరిపోను ఐటీసీ రివర్స్ చేయటంతో పాటుగా మిగిలినది కూడా రివర్స్ చేయాలి.

అదే ఉత్పత్తిదారులకైతే స్టాక్‌లో ఉన్న ఇన్‌పుట్స్‌తో పాటుగా సెప్టెంబరు 21 నాటికి తయారీలో ఉన్న ఇన్‌పుట్స్ అంటే సెమీ ఫినిష్, ఫినిష్ స్టేజీలో ఉన్న ఇన్‌పుట్స్ మొత్తాన్ని పరిగణనలోకి తీసుకుని సరిపడా ఐటీసీ రివర్స్ చేయాలి. అలాగే క్యాపిటల్ గూడ్స్ మీద క్రెడిట్ తీసుకుని ఉంటే దాని జీవితకాలం 20 త్రైమాసికాలు (5 సంవత్సరాలు)గా భావించి, మిగిలిన కాలానికి సరిపోను ఐటీసీ రివర్స్ చేయాలి. ఇకపోతే, రేటు తగ్గింపునకు సంబంధించి సవరించిన ధరల జాబితా (ప్రైస్ లిస్ట్)ను ఉత్పత్తిదారులు.. డీలర్లు, రిటైలర్స్‌కు తప్పక పంపాలి. ఇది కొనుగోలుదారులకు అందుబాటులో ఉండేట్లు తగు జాగ్రత్తలే తీసుకోవాలి. అలాగే ఇంకొక ముఖ్య సందేహం ఏమిటంటే.. ఒకవేళ ఇప్పటికే అమ్ముడుపోయిన సరుకుకు సంబంధించి క్రెడిట్ నోట్‌ను సెప్టెంబరు 22 తర్వాత జారీ చేయాల్సి వస్తే.. ఏ రేటు పరిగణనలోకి తీసుకోవాలి? క్రెడిట్ నోట్ అనేది ఇంతకు ముందు జారీ చేసిన ఇన్వాయిస్‌కు సంబంధించి ఇస్తున్నారు కాబట్టి, ఇన్వాయిస్‌లో ఉన్న రేటును పరిగణనలోకి తీసుకోవాలి. అంటే పాత రేటు ప్రకారమే ఇవ్వాలి.

ఏది ఏమైనా తగ్గించిన పన్ను ప్రయోజనాలను వినియోగదారులకు చేర్చాలని ప్రభుత్వం భావిస్తోంది. కాబట్టి వ్యాపారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. అవసరాన్ని బట్టి తమ అకౌంటింగ్ సాఫ్ట్‌వేర్‌లో తగు మార్పులు చేసుకోవటంతో పాటు సెప్టెంబరు నెలకు సంబంధించిన రిటర్నులను జాగ్రత్తగా పరిశీలించి దాఖలు చేయాలి. ఒకటే ప్రొడక్ట్ అమ్మే వారికి పెద్ద సమస్య ఉండకపోవచ్చు కానీ, వివిధ రకాల ఉత్పత్తులు అమ్ముతూ వాటిలో కొన్ని మినహాయింపులోకి వచ్చినప్పుడు ఐటీసీ రివర్స్ చేయటం జాగ్రత్తగా చేయాల్సి ఉంటుంది.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

ఫైనల్‌కు సాత్విక్ జోడీ



చైనా మాస్టర్స్

షెన్‌జన్ (చైనా): చైనా మాస్టర్స్‌లో భారత స్టార్ డబుల్స్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి జంట ఫైనల్‌కు దూసుకెళ్లింది. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీస్‌లో సాత్విక్-చిరాగ్ జంట 21-17, 21-14తో మలేసియా జోడీ ఆరోన్ చియా-సో వు ఇక్‌పై గెలిచింది. ఆదివారం జరిగే టైటిల్ పోరులో కొరియాకు చెందిన ప్రపంచ చాంపియన్, టాప్ సీడ్ కిమ్ వోన్/సియో సెంగ్‌తో సాత్విక్ జంట తలపడనుంది.

బంగ్లా'సూపర్'బోణీ

శ్రీలంకపై విజయం

దుబాయ్: ఆసియాకప్ సూపర్-4 తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్ ఉత్కంఠ విజయాన్నందుకుంది. ఓపెనర్ సైఫ్ హసన్ (61), తౌహీద్ హ్రిదయ్ (58) కీలక అర్ధసెంచరీలతో రాణించారు. అయితే చివరి ఓవర్‌లో రెండు వికెట్లు కోల్పోయి తడబడినా.. ఐదో బంతికి సింగిల్ తీసి ఊపిరిపీల్చుకుంది. ఫలితంగా శనివారం శ్రీలంకతో జరిగిన ఈ మ్యాచ్‌లో బంగ్లా 4 వికెట్లతో నెగ్గింది. ముందుగా శ్రీలంక 20 ఓవర్లలో 7 వికెట్లకు 168 పరుగులు సాధించింది. షనక (64 నాటౌట్), కుశాల్ మెండిస్ (34) రాణించారు. లంక ఓపెనర్లు కుశాల్, నిస్సాంక (22) తొలి వికెట్‌కు 44 పరుగులు జోడించారు. ఆ తర్వాత బ్యాటర్లు విఫలమవగా.. చివర్లో షనక ఎదురుదాడితో స్కోరు 160 దాటింది. షనక, కెప్టెన్ అసలంక (21) ఐదో వికెట్‌కు 57 రన్స్ జోడించారు. ముస్తాఫిజుర్ 3, మెహదీ హసన్2 వికెట్లు తీశారు. ఛేదనలో బంగ్లా 19.5 ఓవర్లలో 6 వికెట్లకు 169 పరుగులు చేసి గెలిచింది. సైఫ్ హసన్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

ఒత్తిడిని అధిగమించి: బంగ్లా ఛేదనలో తొలి ఓవర్‌లోనే ఓపెనర్ తన్‌జీద్ డకౌటైనా.. మరో ఓపెనర్ సైఫ్ భారీ సిక్సర్లతో బౌలర్లను సులువుగా ఎదుర్కొన్నాడు. కెప్టెన్ లిట్టన్ దాస్ (23) జతగా రెండో వికెట్‌కు 59, మూడో వికెట్‌కు హ్రిదయ్‌తో కలిసి 54 రన్స్ జోడించి విజయానికి బాటలు వేశాడు. 14వ ఓవర్‌లో సైఫ్ వెనుదిరిగాక హ్రిదయ్ బాధ్యతను తీసుకున్నాడు. అయితే విజయానికి 10 రన్స్ దూరంలో అతను అవుటయ్యాక మ్యాచ్‌లో హైడ్రామా నెలకొంది. ఆఖరి ఓవర్‌లో 5 రన్స్ అవసరమవగా, జకెర్ (9) తొలి బంతికే ఫోర్ బాదాడు. తర్వాత 3 బంతుల్లో పరుగులేమీ రాకుండా 2 వికెట్లు కోల్పోవడంతో ఉత్కంఠ తారస్థాయికి చేరింది. కానీ ఐదో బంతికి సింగిల్ రావడంతో బంగ్లా సంబరాల్లో మునిగింది.

సంక్షిప్త స్కోర్లు

శ్రీలంక: 20 ఓవర్లలో 168/7 (షనక 64 నాటౌట్, మెండిస్ 34; ముస్తాఫిజుర్ 3/20, మెహదీ హసన్ 2/25).
బంగ్లాదేశ్: 19.5 ఓవర్లలో 169/6. (సైఫ్ హసన్ 61, హ్రిదయ్ 58; హసరంగ 2/22).

భారత్‌ను ఆపతరమా?

నేడు పాకిస్థాన్‌తో పోరు

- బరిలోకి బుమ్రా
- ఒత్తిడిలో దాయాది
- ఆసియా కప్ సూపర్-4



సూర్యకుమార్

రాత్రి 8 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో

దుబాయ్: ఊహించినట్టుగానే మరోసారి ఆసియా కప్‌లో చిరకాల ప్రత్యర్థులు భారత్-పాకిస్థాన్ తలపడబోతున్నాయి. షేక్ హ్యాండ్ వివాదం ఇంకా సద్దుమణుగక ముందే ఇరు జట్ల మధ్య ఆదివారం సూపర్-4 మ్యాచ్ జరుగనుంది. దీంతో మైదానంలో ఈసారి ఎలాంటి పరిస్థితులు చోటు చేసుకుంటాయో అనే ఉత్కంఠ అభిమానుల్లో నెలకొంది. కానీ గ్రూప్ మ్యాచ్ తరహాలోనే కచ్చితంగా భారత ఆటగాళ్లు ప్రత్యర్థికి కరచాలనం ఇవ్వకపోవచ్చు. ఇక.. టోర్నీలో అజేయంగా ఉన్న భారత్ ఎప్పటిలాగే ఆధిపత్యం చూపాలనుకుంటోంది. అయితే ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో మన బౌలర్లు పెద్దగా ప్రభావం చూపలేదు. బుమ్రా, వరుణ్‌ల విశ్రాంతి కారణంగా జట్టులోకి వచ్చి పేసర్లు అర్ష్‌దీప్, హర్షిత్‌లను ఒమన్ బ్యాటర్లు సులువుగా ఎదుర్కొన్నారు. దీంతో పాక్‌తో ఆదివారం నాటి మ్యాచ్‌కు స్టార్ పేసర్ బుమ్రాతో పాటు స్పిన్నర్ వరుణ్‌ను రంగంలోకి దించనున్నారు. దుబాయ్ పిచ్ స్పిన్నర్లకు అనుకూలం కావడంతో కుల్దీప్, వరుణ్, అక్షర్ కీలకం కానున్నారు. అయితే ఒమన్‌తో మ్యాచ్‌లో గాయపడిన అక్షర్ ఫిట్‌నెస్‌పై స్పష్టత లేదు. అతను ఆడలేని పక్షంలో సుందర్‌కు చాన్స్ దక్కవచ్చు. బ్యాటింగ్‌లో ఓపెనర్ గిల్, హార్దిక్, దూబే పుంజుకోవాల్సి ఉంది. శాంసన్ హాఫ్ సెంచరీతో ఫామ్ చాటుకున్నా అతడి ఆటలో దూకుడు కనిపించలేదు. వన్‌డౌన్‌లో కెప్టెన్ సూర్య తిరిగి ఆడనున్నాడు.

తుది జట్లు (అంచనా):

భారత్: అభిషేక్, గిల్, సూర్యకుమార్ (కెప్టెన్), తిలక్ వర్మ, శాంసన్, దూబే, హార్దిక్, అక్షర్/సుందర్, వరుణ్, కుల్దీప్, బుమ్రా.

పాక్: ఫర్హాన్, సయీమ్, హరీస్, ఫఖర్ జమాన్, సల్మాన్ ఆఘా (కెప్టెన్), హసన్ నవాజ్, మహ్మద్ నవాజ్, ఖుష్దిల్ షా, షహీన్ అఫ్రీది, హరీస్ రౌఫ్, అబ్రార్ అహ్మద్.



సల్మాన్ ఆఘా

గెలుపే ధ్యేయంగా..

అనిశ్చితి ఆటతీరుకు మారుపేరుగా నిలిచే పాకిస్థాన్ జట్టు తీవ్ర ఒత్తిడి మధ్య బరిలోకి దిగనుంది. భారత్‌తో చివరి మ్యాచ్‌లో ఘోర పరాభవంతో పాటు కరచాలనం రూపంలో ఎదురైన అవమానం కూడా వారిలో కసిని రేపే అవకాశం ఉంది. అందుకే ఈ మ్యాచ్‌లో ఎలాగైనా గెలిచి తీరాలనే పట్టుదల సల్మాన్ ఆఘా సారథ్యంలోని పాక్ జట్టులో కనిపిస్తోంది. అటు అంచనా పెట్టుకున్న బ్యాటర్లు భారత స్పిన్‌ను ఎదుర్కోవడంలో విఫలమవుతున్నారు. ఓపెనర్ సయీమ్ అయూబ్ హ్యాట్రిక్ డకౌట్లతో కొనసాగుతుండగా, అతను బౌలర్‌గా ఆరు వికెట్లు తీయడం సానుకూలాంశం. పేసర్ హరీస్ రౌఫ్‌ను బరిలోకి దించవచ్చు. బ్యాటింగ్‌లో చెలరేగుతున్న పేసర్ హషీన్ అఫ్రీది పవర్‌ప్లేలో ప్రభావం చూపితే భారత్‌కు ఇబ్బంది తప్పదు.

తలుపులు మూసేసి.. ఫోన్లు ఆఫ్ చేసి..

పాకిస్థాన్‌తో మ్యాచ్ కోసం తమ జట్టు ఎలాంటి ఒత్తిడి లేకుండా బరిలోకి దిగుతుందని కెప్టెన్ సూర్యకుమార్ స్పష్టం చేశాడు. దాయాదితో రెండోసారి తలపడేందుకు ఎలా సిద్ధమవుతున్నారన్న ప్రశ్నకు సమాధానంగా.. 'తలుపులను మూసివేసి.. మొబైల్స్‌ను ఆఫ్ చేసి ప్రశాంతంగా నిద్రపోవాలని మా ఆటగాళ్లకు చెబుతాను. బయటి నుంచి మంచి సలహాలను స్వీకరిస్తే సరిపోతుంది' అని తెలిపాడు. అయితే ప్రెస్ మీట్‌లో సూర్యకుమార్ ఒక్కసారి కూడా పాక్ పేరును ప్రస్తావించకపోవడం గమనార్హం. స్టేడియం నిండిన సందర్భంలో ప్రేక్షకులకు వినోదం అందించేందుకు అదే సరైన సమయంగా భావిస్తానని సూర్య చెప్పాడు. మరోవైపు పాక్‌తో తొలి మ్యాచ్‌లో వివాదానికి గురైన రెఫరీ ఆండీ పైక్రాఫ్టే ఈసారి కూడా నియమించే అవకాశం ఉంది.

పాక్ జట్టుకు 'మోటివేషన్'

దుబాయ్: భారత్‌తో మ్యాచ్ అంటేనే పాకిస్థాన్ జట్టు ఒత్తిడిలో కూరుకుపోతోందట. పైగా ప్రస్తుత జట్టులో యువ క్రికెటర్లు ఎక్కువ మంది ఉన్నారు. వారంతా టీమిండియాతో పోరులో ఒత్తిడిని తట్టుకోలేకపోతున్నారని, మానసికంగా డీలా పడుతున్నారని భావిస్తున్న పాకిస్థాన్ క్రికెట్ బోర్డు.. డా.రహీల్ అహ్మద్ అనే మోటివేషనల్ స్పీకర్ సేవలను తీసుకుంటోంది. ఆసియా కప్‌లో పాక్ గ్రూపు మ్యాచ్‌లు ముగిశాక అతడు జట్టుతో చేరినట్టు సమాచారం. ఇప్పటికే జట్టుకు ఓ దఫా కౌన్సెలింగ్ కూడా ఇచ్చాడట.

మనమ్మాయిలు పోరాడినా..


ఆస్ట్రేలియాదే సిరీస్

మూడో వన్డేలో భారత్ ఓటమి



స్మృతీ మంధాన (125)

కొద్దిలో చేజారిన 413 పరుగుల ఛేదన



మూనీ (138)

శతక్కొట్టిన బేత్ మూనీ | మంధాన సూపర్ సెంచరీ దీప్తి మెరుపు ఇన్నింగ్స్

ముంబై: ఆస్ట్రేలియాపై వన్డే సిరీస్ చేజిక్కించుకొని చరిత్ర సృష్టించే అవకాశాన్ని భారత మహిళలు త్రుటిలో కోల్పోయారు. శనివారం జరిగిన నిర్ణాయక మూడో వన్డేలో 43 పరుగులతో హర్మన్ సేన ఓటమి చవిచూసింది. 413 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో స్మృతీ మంధాన (63 బంతుల్లో 17 ఫోర్లు, 5 సిక్సర్లతో 125) సూపర్ సెంచరీ, దీప్తీ శర్మ (58 బంతుల్లో 5ఫోర్లు, 2 సిక్సర్లతో 72) మెరుపు బ్యాటింగ్‌కు తోడు హర్మన్‌ప్రీత్ (52) అర్ధ శతకంతో మన జట్టు లక్ష్యాన్ని చేరేలా కనిపించింది. కానీ వారి నిష్క్రమణ తర్వాత భారత పోరాటం 47 ఓవర్లలో 369 రన్స్ వద్దే ముగిసింది. అంతకుముందు ఆసీస్ 47.5 ఓవర్లలో 412 రన్స్‌కు ఆలౌటైంది. బేత్ మూనీ (75 బంతుల్లో 23 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 138) శతక్కొట్టగా, జార్జియా (81), పెర్రీ (68) అర్ధ శతకాలు చేశారు. ఈ గెలుపుతో మూడు వన్డేల సిరీస్‌ను ఆసీస్ 2-1తో దక్కించుకుంది. భారత్‌పై ఆసీస్‌కిది 11వ ద్వైపాక్షిక సిరీస్ విజయం. మూనీ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా, స్మృతి 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచారు.

కోహ్లీ రికార్డ్ బ్రేక్

50 బంతుల్లో సెంచరీ చేసిన స్మృతీ మంధాన.. వెటరన్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (52 బంతుల్లో 100)ని అధిగమించి వన్డేలలో వేగవంతమైన శతకం చేసిన భారత బ్యాటర్‌గా కొత్త రికార్డు నెలకొల్పింది. అలాగే మహిళల వన్డేలలో వేగవంతమైన సెంచరీ (50 బంతుల్లో 100) చేసిన రెండో బ్యాటర్‌గానూ స్మృతి నిలిచింది. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మెగ్‌లానింగ్ (45 బంతుల్లో) టాప్‌లో ఉంది.

సంక్షిప్తస్కోర్లు

ఆస్ట్రేలియా: 47.5 ఓవర్లలో 412 ఆలౌట్ (బేత్ మూనీ 138, జార్జియా వోల్ 81, ఎలీస్ పెర్రీ 68, గార్డ్‌నర్ 39, అరుంధతి 3/86, దీప్తీశర్మ 2/78, రేణుకా సింగ్ 2/79).

భారత్: 47 ఓవర్లలో 369 ఆలౌట్ (మంధాన 125, దీప్తి 72 హర్మన్ 52, స్నేహ్‌రాణా 35, కిమ్ గార్త్ 3/69, మేఘన్ 2/53).

అందుకే పింక్ జెర్సీ..

చివరి వన్డేలో భారత మహిళలు పింక్ జెర్సీతో బరిలో దిగారు. రొమ్ము కేన్సర్‌పై మహిళల్లో అవగాహన కల్పించేందుకే ఈ జెర్సీ ధరించినట్టు బీసీసీఐ తెలిపింది. 'మహిళలు రొమ్ము కేన్సర్‌ను తిప్పికొట్టేందుకు సిద్ధంగా ఉండాలని ఈ జెర్సీ సూచిస్తుంది. నెలవారీ పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఆ మహమ్మారిని సమర్థంగా ఎదుర్కొందాం' అని కెప్టెన్ హర్మన్‌ప్రీత్ పిలుపునిచ్చింది.

హాల్.. అదుర్స్

హెప్టాథ్లాన్‌లో స్వర్ణం కైవసం



ప్రపంచ అథ్లెటిక్స్

టోక్యో: ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో మహిళల హెప్టాథ్లాన్ స్వర్ణాన్ని అమెరికాకు చెందిన అన్నా హాల్ సొంతం చేసుకుంది. ఏడు పోటీల ఈ ఈవెంట్‌లో మొత్తం 6,888 పాయింట్లు సాధించిన ఆమె కెరీర్‌లో తొలిసారి ప్రపంచ టైటిల్ అందుకుంది. తద్వారా దిగ్గజ హెప్టాథ్లెట్ జాకీ జాయ్‌నర్ కెర్సీ తర్వాత వరల్డ్ టైటిల్ కైవసం చేసుకున్న అమెరికా అథ్లెట్‌గా 24 ఏళ్ల అన్నా రికార్డు నెలకొల్పింది. కేట్ ఓ కానర్ (ఐర్లాండ్), తాలియా బ్రూక్స్ (అమెరికా) రజత, కాంస్య పతకాలు నెగ్గారు.

అన్నూరాణి, గుల్వీర్ విఫలం: భారత అథ్లెట్లు గుల్వీర్ సింగ్, అన్నూరాణి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో విఫలమయ్యారు. పురుషుల 5వేల మీటర్ల పరుగులో గుల్వీర్, మహిళల జావెలిన్ త్రోలో అన్నూరాణి ఫైనల్‌కు చేరలేకపోయారు. హీట్-2లో తలపడిన గుల్వీర్ 13ని.42.34సె.లో గమ్యం చేరి తొమ్మిదో స్థానంలో నిలిచాడు. రెండు హీట్లలో తొలి ఎనిమిది స్థానాల్లో నిలిచిన వారు ఫైనల్‌కు అర్హత సాధిస్తారు. ఐదోసారి వరల్డ్ అథ్లెటిక్స్ బరిలో దిగిన 33 ఏళ్ల అన్నూరాణి గ్రూప్ 'ఏ' క్వాలిఫికేషన్‌లో 55.18 మీ. దూరం ఈటెను విసిరి 15వ స్థానం సాధించింది. ఓవరాల్‌గా 29వ స్థానం దక్కించుకుంది.

ఉత్కంఠ పోరులో పట్నా విజయం

జైపూర్: చివరి నిమిషం వరకు హోరాహోరీగా సాగిన పోరులో పట్నా పైరేట్స్ విజయం సాధించింది. ప్రొ కబడ్డీ లీగ్‌లో శనివారం జరిగిన మ్యాచ్‌లో పట్నా 33-30తో దబాంగ్ ఢిల్లీపై గెలిచింది. అంకిత్ కుమార్ సూపర్-10 సాధించాడు. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 38-36తో తమిళ్ తలైవాస్‌పై నెగ్గింది. కెప్టెన్ అర్జున్ దేశ్వాల్ 13 పాయింట్లతో పోరాడినా తలైవాస్‌ను గెలిపించలేక పోయాడు.

‘సీతారామ’ భూసేకరణ పూర్తి చేయాలి

- ఎన్జీటీ స్టే తొలగేలా చర్యలు తీసుకోవాలి
- అధికారులకు ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రులు ఉత్తమ్, తుమ్మల, పొంగులేటి ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సీతారామ ఎత్తిపోతల పథకంలోని ప్రధాన కాల్వ భూసేకరణ ప్రక్రియకు ప్రతిబంధకాలన్నీ తొలగించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు అధికారులను ఆదేశించారు. శనివారం సచివాలయంలో సీతారామ ఎత్తిపోతల పథకం/సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టుపై సమీక్ష చేశారు. హెడ్ రెగ్యులేటరీ నుంచి పాలేరు దాకా ప్రధాన కాలువ పనులను సత్వరం చేపట్టాలని, భూసేకరణకు ఉన్న ఇబ్బందులన్నీ పరిష్కరించాలని నిర్దేశించారు. ఇక సీతమ్మసాగర్ పర్యావరణ అనుమతి ఎక్కడిదాకా వచ్చిందని ఆరా తీశారు. జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్జీటీ) స్టేను తొలగించేలా కృషి చేసి, తక్షణమే పర్యావరణ అనుమతి సాధించి, ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జల విద్యుత్ కేంద్రం కోసం జెన్‌కో డిజైన్లు/డ్రాయింగ్‌లు అందించిందా..? అని మంత్రులు ప్రశ్నించగా.. సిద్ధమవుతున్నాయని అధికారులు చెప్పారు. తక్షణమే అవసరమైన డిజైన్లను తెప్పించుకోవాలని మంత్రులు సూచించారు. ఉమ్మడి ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లోని 7 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించడానికి నిర్దేశిత వ్యవధిలోగా పనులు చేపట్టాలన్నారు. "నాలుగేళ్లుగా భూసేకరణ అంటూ పనులు జాప్యం చేస్తున్నారు. భూసేకరణలో సమస్యలేమున్నాయో నీటిపారుదల శాఖ మంత్రికైనా చెప్పారా..? భూసేకరణలో ప్రతిబంధకాలు తొలగించకపోతే ప్రధాన కాలువ పనులు ఎలా పూర్తవుతాయి..? ఇంకెన్ని రోజులు భూసేకరణ సమస్యలంటూ పనులు పెండింగ్‌లో పెడతారు..?" అని మంత్రి పొంగులేటి అధికారులపై మండిపడ్డారు.

ప్రతి 20-25 కి.మీ.కు ఒక డయాలసిస్ కేంద్రం

- రోగి ఒక్కరే వెళ్లి తిరిగి వచ్చేలా ఉండాలి: దామోదర

హైదరాబాద్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మూత్రపిండాల వైఫల్య బాధితులు రక్తశుద్ధి కోసం పదుల కిలోమీటర్ల దూరం ప్రయాణించి, గంటల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉండకూడదని, రాష్ట్రంలో ప్రతీ 20-25 కిలోమీటర్లకు ఒక డయాలసిస్ కేంద్రం ఉండాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రోగులతో పాటు వారి కుటుంబ సభ్యులు రక్తశుద్ధి కేంద్రాల చుట్టూ తిరిగి ఇబ్బంది పడే పరిస్థితి రావొద్దని, పేషెంట్ ఒక్కరే వెళ్లి గంటల వ్యవధిలోనే తిరిగి ఇంటికొచ్చేలా కేంద్రాలు అందుబాటులో ఉండాలని సూచించారు. దీనికి అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ఇప్పటికే ఉన్న కేంద్రాల్లో అవసరమైనచోట యంత్రాల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో కొత్త డయాలసిస్ సెంటర్ల ఏర్పాటుపై మంత్రి శనివారం ఆరోగ్య శ్రీ ట్రస్ట్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. కాగా, మంత్రి రాజనర్సింహను ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ ప్రతినిధులు కలిశారు. ఆరోగ్యశ్రీ సేవలను యథావిధిగా కొనసాగిస్తామని, సర్కారుకు సహకరిస్తామని వారు మంత్రికి తెలిపారు.

దేవుడి భూములను కాపాడాలి: కొండా సురేఖ

హైదరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అన్యాక్రాంతం అవుతున్న దేవుడి భూములపై కోర్టుల్లో న్యాయపోరాటం చేసి కాపాడటంలో జాప్యం ఎందుకు జరుగుతోందని ప్రభుత్వ న్యాయవాదుల్ని మంత్రి కొండా సురేఖ ప్రశ్నించారు. ఇక్కడ తన ముందు వాదించినట్లు కోర్టుల్లో ఎందుకు వాదించలేకపోతున్నారని అన్నారు. దేవాదాయ శాఖ న్యాయవాదుల పనితీరుపై మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయంలోని తన కార్యాలయంలో దేవాదాయ శాఖ ప్రభుత్వ న్యాయవాదులు, ఉన్నతాధికారులతో మంత్రి కొండా సురేఖ శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎవరైనా దేవాదాయ శాఖ భూముల జోలికి వస్తే వారిపై పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేయాలని అధికారులకు మంత్రి స్పష్టం చేశారు. తాను దేవాదాయ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి రెండు సంవత్సరాలు అయిందని, ఇప్పటికీ కేసులు ఏం గెలిచామో తెలియడం లేదన్నారు. దేవాదాయ భూములు కాపాడటంతో ప్రభుత్వ న్యాయవాదులదే కీలకపాత్ర అని చెప్పారు.

రాష్ట్రంలో నేడు, రేపు భారీ వర్షాలు

రాష్ట్రంలో ఆది, సోమవారాల్లో కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. అలాగే చాలా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఆదివారం రాష్ట్రంలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. సోమవారం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ సహా 18 జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది.

పాత పింఛను అమలు చేయాల్సిందే:స్థితప్రజ్ఞ

ఉద్యోగులకు పాత పింఛను పథకాన్ని అమలు చేయాల్సిందేనని 'నేషనల్ మూమెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్'(ఎన్ఎంవోపీఎస్) ప్రధాన కార్యదర్శి స్థిత ప్రజ్ఞ డిమాండ్ చేశారు. జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో 'నేషనల్ మూమెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్' ఆధ్వర్యంలో శనివారం బహిరంగ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయుల కర్మచారి మహా సమ్మేళన్ బహిరంగ సభలో స్థిత ప్రజ్ఞ మాట్లాడారు. జార్ఖండ్ రాష్ట్రం 2022లో సీపీఎస్ రద్దు చేసి నేడు పాత పింఛను విధానం అమలు చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ఇదే ఎన్ఎంవోపీఎస్ సభలో ఇచ్చిన హామీని నెరవేర్చారన్నారు.

ఐఐటీ-జేఈఈ విద్యార్థులకు శుభవార్త!

- కటాఫ్ మార్కులు, ర్యాంకులు, సీట్ల కేటాయింపుపై బుక్‌లెట్ విడుదల

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ-జేఈఈ 2026కు సిద్ధమవుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రుల అవగాహన కోసం అభీష్టా ఎడ్యుగ్రామ్ సంస్థ ఒక డిజిటల్ బుక్‌లెట్‌ను రూపొందించింది. ఈ బుక్‌లెట్‌లో 2025 జేఈఈ ర్యాంకులు, దేశవ్యాప్తంగా ఐఐటీలలో సీట్ల కేటాయింపు, కటాఫ్ మార్కులు, రిజర్వేషన్ల వారీగా ఓపెనింగ్, క్లోజింగ్ ర్యాంకుల విశ్లేషణతో పాటు ఐఐటీల్లో అందుబాటులో ఉన్న కోర్సుల (బ్రాంచీలు) వివరాలు ఉన్నాయి. 144 పేజీల బుక్‌లెట్ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంది. దీన్ని వాట్సాప్ (98490 16661) ద్వారా పొందవచ్చు లేదా Edugram360.com వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఎడ్యుగ్రామ్ తెలిపింది.

హెచ్‌సీయూ ఎన్నికల్లో ఏబీవీపీ సత్తా

- ఏడేళ్ల తర్వాత విద్యార్థి ఎన్నికల్లో గెలుపు
- ప్రెసిడెంట్‌గా తెలుగు విద్యార్థి పాలెపు శివ

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం(హెచ్‌సీయూ) విద్యార్థి సంఘం ఎన్నికల్లో ఏబీవీపీ(అఖిల భారత విద్యార్థి పరిషత్) సత్తా చాటింది. శుక్రవారం జరిగిన ఎన్నికలలో యూనియన్ అధ్యక్ష పదవితో పాటు వైస్ ప్రెసిడెంట్, జనరల్ సెక్రటరీ తదితర పదవులను గెలుచుకుంది. ఈ విజయంతో దాదాపు ఏడేళ్ల తర్వాత హెచ్‌సీయూపై ఏబీవీపీ జెండా రెపరెపలాడనుంది. ఏబీవీపీ కూటమి తరపున తెలుగు విద్యార్థి పాలెపు శివ విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికవ్వగా, దేబేంద్ర ఉపాధ్యక్ష పదవిని దక్కించుకున్నారు.

ప్రధాని బహుమతుల వేలంలో చేర్యాల పెయింటింగ్, కాకతీయ కళాతోరణాలకు చోటు

చేర్యాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దేశ, విదేశ పర్యటనల్లో భాగంగా ప్రధాని మోదీకి ఆహ్వానితులు, అభిమానులు అందజేసిన బహుమతులను వేలం వేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ వేలంలో తెలంగాణ నుంచి చేర్యాల నకాశీ పెయింటింగ్, కాకతీయ కళా తోరణం, ఇతర వెండి కళాకృతులకు చోటు లభించింది. ఈ మేరకు పీఎం మెమెంటోస్ పోర్టల్‌లో ఆ బహుమతులను అధికారులు ప్రదర్శించారు. ఆన్‌లైన్ ద్వారా జరిగే వేలంలో ఆయా బహుమతులను సొంతం చేసుకోవచ్చని సూచించారు.

ట్రంప్ నిర్ణయంతో షాక్

- తెలుగు టెకీల ఆవేదన వర్ణనాతీతం
- కేంద్రం అమెరికాతో చర్చలు జరపాలి
- హెచ్-1బీ వీసా ఫీజు పెంపుపై సీఎం
- వీసా ఫీజు పెంపుతో రాష్ట్రంపై ప్రభావం
- కేంద్రానికి లేఖ రాస్తాం : మంత్రి దుద్దిళ్ల

హైదరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): హెచ్-1బీ వీసాల అంశంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జారీ చేసిన ఉత్తర్వులు అన్ని వర్గాలను దిగ్భ్రాంతికి గురి చేశాయని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. భారత్- అమెరికా మధ్య ఎన్నో ఏళ్లుగా ఉన్న సంబంధాల నేపథ్యంలో ట్రంప్ తీసుకున్న నిర్ణయం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని అభిప్రాయపడ్డారు. అమెరికాకు ఎంతో కాలంగా సేవలందిస్తున్న ఐటీ ఉద్యోగులు, నిపుణుల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో స్పందించాలని కోరారు. తెలుగు టెకీల ఆవేదన వర్ణనాతీతమన్న సీఎం రేవంత్.. సమస్యను పరిష్కరించేందుకు కేంద్రం ఓ ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్ యుద్ధ ప్రాతిపదికన సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. హెచ్-1బీ వీసాల అంశంపై స్పందించిన సీఎం రేవంత్ ఈ మేరకు ఎక్స్‌లో ఓ పోస్టు చేశారు. ఇక, హెచ్-1బీ వీసా ఫీజు పెంపు నిర్ణయంతో తెలంగాణపై తీవ్ర ప్రభావం ఉంటుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఏటా విదేశాల నుంచి భారత్‌కు వచ్చే మొత్తం నిధులు(రెమిటెన్స్)ల్లో 8.1 శాతం వాటా కలిగిన తెలంగాణ.. రెమిటెన్స్‌ల్లో దేశంలో నాలుగో స్థానంలో ఉందని తెలిపారు. ట్రంప్ నిర్ణయం వల్ల దేశంలో అత్యధికంగా నష్టపోయే రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటనే విషయాన్ని తెలియజేస్తూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని శ్రీధర్ బాబు వెల్లడించారు. ట్రంప్ నిర్ణయాల వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ నష్టపోతున్నా ప్రధాని నరేంద్ర మోదీ స్పందించకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సచివాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అమెరికా అధ్యక్షుడి ఆలోచన తీరు ఆయన ప్రియ మిత్రుడు మోదీకే బాగా తెలుసంటూ శ్రీధర్‌బాబు ఎద్దేవా చేశారు. 2024-25లో భారత్‌కు రికార్డు స్థాయిలో 135.46 బిలియన్ డాలర్ల రెమిటెన్స్ రాగా, ఇందులో అమెరికా వాటా 27.7 శాతమని తెలిపారు. ట్రంప్ తాజా నిర్ణయం వల్ల ఆ రెమిటెన్సులు తగ్గి మన విదేశీ మారక ద్రవ్య నిల్వలపై ప్రభావం పడుతుందని చెప్పారు. ఈ విషయాలు తెలిసినా ముందస్తుగా అమెరికాతో సంప్రదింపులు జరిపి సమస్యను పరిష్కరించేందుకు కేంద్రం చొరవ చూపలేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రధాని మోదీ, విదేశాంగ మంత్రి మేల్కోని అమెరికాతో చర్చలు జరపాలని శ్రీధర్ బాబు కోరారు.

స్థానిక ఎన్నికలపై ముందుకెలా?

(మొదటిపేజీ తరువాయి)



తమ అభిప్రాయాలు తెలిపిన మంత్రులు.. తుది నిర్ణయాన్ని మాత్రం ముఖ్యమంత్రికే వదిలేశారు. దీనిపై ఒకటి రెండు రోజుల్లోనే సీఎం తుది నిర్ణయం తీసుకోవచ్చని తెలుస్తోంది. మరోవైపు సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధ్యర్యంలో స్థానిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి ముఖ్య సమావేశం జరగనున్నట్లు తెలిసింది. దీంతో స్థానిక ఎన్నికల విషయంలో వేగం పెంచే దిశగానే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందా.. అన్న చర్చ మొదలైంది. బీసీలకు స్థానిక సంస్థలు, విద్య, ఉపాధి రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అసెంబ్లీలో ఆమోదించి కేంద్రానికి పంపిన బిల్లులు ఇంకా ఆమోదం పొందని విషయం తెలిసిందే. దీంతో రాష్ట్రంలో రిజర్వేషన్ల ఖరారు వ్యవహారం తేలడంలేదు. దాంతో స్థానిక ఎన్నికల నిర్వహణలో జాప్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలో మంత్రులతో జరిపిన సమావేశంలో.. సుప్రీం కోర్టులో తీర్పు రిజర్వులో ఉన్న అంశంతోపాటు పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలకు వెళ్లడం, లేదా జీవోలు విడుదల చేసి అధికారికంగా 42 శాతం రిజర్వేషన్ కల్పించి ఎన్నికలకు వెళ్లడమనే మూడు అంశాలపై చర్చించారు.

చిత్తశుద్ధితో ధైర్యంగా ముందుకెళదాం..

'బీసీ రిజర్వేషన్లు, స్థానిక సమరంపై ఎలా ముందుకెళ్దాం? ఏం చేద్దాం?' అంటూ సీఎం రేవంత్ రెడ్డి.. మంత్రుల అభిప్రాయం కోరారు. దీనిపై కొందరు మంత్రులు మాట్లాడుతూ, "రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లులను ఇక్కడ గవర్నర్, అక్కడ రాష్ట్రపతి ఆమోదించలేదు. అలాగని తిరస్కరించనూ లేదు. అదే సమయంలో కేంద్రం వాటిని ఆమోదించేలా చర్యలు తీసుకుంటుందా అన్నదీ తెలియదు. అందుకే బిల్లును ఆమోదించే వరకు పోరాటం చేద్దాం" అన్నట్లు తెలిసింది. రిజర్వేషన్ల వ్యవహారం అధికారికంగా తేలాకే ఎన్నికలకు వెళ్లాలనే అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేసినట్లు సమాచారం. మరి కొందరు మంత్రులు మాత్రం పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ ఎన్నికలకు వెళదామని అనడంతో.. దీనిపై తలెత్తే న్యాయపరమైన సమస్యలపై చర్చించినట్లు తెలిసింది. ఇందుకోసం న్యాయనిపుణుల సలహాలు తీసుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం. మొత్తమ్మీద స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కల్పించే విషయంలో చిత్తశుద్ధితో ధైర్యంగా ముందుకెళదామని మంత్రులు అన్నట్లు తెలిసింది. దీనిపై ప్రభుత్వం ఒకటి రెండు రోజుల్లో కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. కాగా, మంత్రులతో సీఎం నిర్వహించిన సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ ముఖ్య అధికారులు.. ఎన్నికల ప్రక్రియ, రిజర్వేషన్ల వ్యవహారాన్ని వివరించారు.

మేడారం పనులపై సాంకేతిక కమిటీ

- ఆదివాసీల సంప్రదాయాలను గౌరవిస్తాం
- పూజారుల కోరిక మేరకు ఆలయ విస్తరణ
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

ములుగు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మేడారం జాతర పనులపై సాంకేతిక కమిటీ ఏర్పాటు చేయాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. మేడారం అభివృద్ధి ప్రణాళికపై సచివాలయంలో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఆదివాసీ పూజారుల సంప్రదాయాలను గౌరవిస్తామని, వారి కోరిక మేరకు విస్తరణ పనులను చేపడతామన్నారు. సమ్మక్క-సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలను యథాతథంగా ఉంచుతామని పేర్కొన్నారు. గిరిజన సంప్రదాయాలు ఉట్టిపడేలా స్వాగత తోరణం డిజైన్లను రూపొందించాలన్నారు. కాగా, ఈ నెల 23న సీఎం రేవంత్‌రెడ్డి మేడారంలో పర్యటించనున్నారు.

కొత్త జిల్లాల్లో కోర్టు భవనాలు నిర్మించండి

- అవసరమైన సిబ్బందిని నియమించండి: హైకోర్టు సీజే
- సీజేతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ

హైదరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన జిల్లాల్లో అవసరమైన చోట్ల కోర్టు భవనాలు నిర్మించాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్‌కుమార్ సింగ్.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సూచించారు. శనివారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో సీజేతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ వ్యవస్థకు సంబంధించి మౌలిక వసతుల కల్పన, సిబ్బంది నియామకం వంటి అంశాలపై చర్చించారు. కొత్త జిల్లాల్లో కోర్టు భవనాలు నిర్మించాలని, మౌలిక వసతులు కల్పించాలని, అవసరమైన సిబ్బంది నియామకాలు చేపట్టాలని సీజే సూచించారు. వీటికి సంబంధించిన ప్రతిపాదనలను సీఎం దృష్టికి తెచ్చారు. దీంతో ఈ ప్రతిపాదనల్ని ఆచరణలోకి తెచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం రేవంత్ వివరించారు. ఈ భేటీలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, సీఎంవో ముఖ్యకార్యదర్శి శేషాద్రి, న్యాయ శాఖ కార్యదర్శి పాపిరెడ్డి, జస్టిస్ పి.సామ్ కోశి, జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి పాల్గొన్నారు.

15 రోజుల్లోగా కాళేశ్వరం బ్యారేజీల.. పునరుద్ధరణకు డిజైన్ కన్సల్టెంట్

- తక్కువ వ్యయంతో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు
- పునరుద్ధరణ పనులు చేపట్టాలి: ఉత్తమ్



హైదరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్ఏ) సిఫారసుల మేరకు కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ కోసం 15 రోజుల్లోగా డిజైన్ కన్సల్టెంట్ నియామకం పూర్తి చేయాలని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం సచివాలయంలో కాళేశ్వరం బ్యారేజీలతో పాటు ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పునరుద్ధరణ పనులపై ఆయన అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణపై ఏం చేశారని నిర్మాణ సంస్థలను ఈ సందర్భంగా మంత్రి అడిగారు. ఎన్‌డీఎస్ఏ నివేదిక ఆధారంగా.. వానాకాలానికి ముందు పరీక్షలు పూర్తయ్యాయని, వానాకాలం తర్వాత పరీక్షలు చేయాల్సి ఉందని నిర్మాణ సంస్థలు పేర్కొన్నాయి. బ్యారేజీల పునరుద్ధరణ డిజైన్ సామర్థ్యం తమ వద్ద లేదని, దీనికోసం డిజైన్ కన్సల్టెంట్‌ను నియమించాలని నిర్మాణ సంస్థలు కోరగా.. డిజైన్ కన్సల్టెంట్ నియామకం పూర్తి చేయాలని సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్(సీడీవో) చీఫ్ ఇంజనీర్‌ను మంత్రి ఆదేశించారు. మేడిగడ్డలో కాఫర్ డ్యామ్ నిర్మాణ ఖర్చును నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ సంస్థయే భరించాలని స్పష్టం చేశారు. ఇక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు సంబంధించి గత ప్రభుత్వం పక్కన పెట్టిన పనులను పునరుద్ధరించాలని నిర్ణయించామని మంత్రి చెప్పారు. తక్కువ వ్యయంతో బ్యారేజీతో పాటు కెనాల్, పంప్‌హౌస్ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. వాస్తవిక అంచనాలతో డీపీఆర్‌ను సిద్ధం చేయాలన్నారు.

మన అతిపెద్ద శత్రువు.. ఇతర దేశాలపై ఆధారపడడమే!

- ఆత్మనిర్భరతే ఏకైక పరిష్కారం: మోదీ



భావ్‌నగర్, సెప్టెంబరు 20: ఇతర దేశాలపై ఆధారపడడమే భారత్ అతిపెద్ద శత్రువు అని ప్రధాని మోదీ అన్నారు. చిప్స్(సెమీకండక్టర్) నుంచి షిప్స్ వరకు స్వదేశీ ఉత్పత్తులను అభివృద్ధి చేసుకుని ఆత్మనిర్భరతను చాటడమే దీనికి ఏకైక పరిష్కారమని తెలిపారు. శనివారం గుజరాత్‌లో పర్యటించిన ప్రధాని 'సముద్రం ద్వారా సమృద్ధి' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ.34,200 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం మోదీ మాట్లాడుతూ.. అన్ని సమస్యలకు ఏకైక పరిష్కారం.. ఆత్మనిర్భరతే నని చెప్పారు. "140 కోట్ల మంది ప్రజల భవితను విదేశీ శక్తులకు వదిలేయం. దేశ అభివృద్ధి సంకల్పం.. విదేశాలపై ఆధారపడి ఉండదు. భవిష్యత్తు తరాలను ఇతరులపై నెట్టేయం" అని ప్రధాని తేల్చి చెప్పారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పాలించిన పార్టీ.. యువత సామర్థ్యాన్ని తొక్కిపెట్టిందంటూ కాంగ్రెస్ పార్టీపై ప్రధాని విమర్శలు గుప్పించారు. 'లైసెన్స్ రాజ్'తో పరిమితులు విధించి యువతను నిర్వీర్యం చేసిందన్నారు. లైసెన్స్-కోటా కారణంగా దీర్ఘకాలిక చిక్కుముడులు ఏర్పడి, ప్రపంచ మార్కెట్‌లో ఒంటరిగా నిలిచిపోయామన్నారు. గత ప్రభుత్వాల విధానాలు.. దేశ సామర్థ్యాన్ని ఎలా దెబ్బతీశాయో చెప్పడానికి నౌకా రంగమే ప్రధాన ఉదాహరణ అని ప్రధాని మోదీ తెలిపారు. కాంగ్రెస్ హయాంలో స్వదేశీ నౌకా నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేసి, విదేశీ నౌకలను అద్దె ప్రాతిపదికన వినియోగించుకోవడం వల్ల ఏటా రూ.6 లక్షల కోట్లను విదేశీ కంపెనీలకు చెల్లించాల్సి వస్తోందన్నారు. ఈ నేపథ్యంలోనే సముద్రయాన రంగంలో వరుస సంస్కరణలు తీసుకువచ్చినట్టు ప్రధాని తెలిపారు. పెద్ద పెద్ద నౌకలకు మౌలిక సదుపాయాల హోదా కల్పించడం ద్వారా సముద్రయాన రంగాన్ని మరింత బలోపేతం చేసే చరిత్రాత్మక నిర్ణయాన్ని తీసుకున్నామని వివరించారు. "తద్వారా నౌకా నిర్మాణ కంపెనీలు బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి సులభంగా రుణాలు పొందే అవకాశం ఉంటుంది" అని ప్రధాని పేర్కొన్నారు. అంతేకాదు, వన్ నేషన్-వన్ డాక్యుమెంట్(ఒక దేశం-ఒక పత్రం), వన్ నేషన్-వన్ పోర్ట్(ఒక దేశం-ఒక నౌకాశ్రయం) విధానాన్ని అమలు చేస్తున్నామని, తద్వారా వ్యాపార, వాణిజ్యాలు అత్యంత సులభతరం అవుతాయని తెలిపారు.

యూరియా పంపిణీలో విఫలం వ్యవసాయాధికారి సస్పెన్షన్

హైదరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): యూరియా పంపిణీలో విఫలమయ్యారన్న కారణంతో కొమురంభీం-ఆసిఫాబాద్ జిల్లా వ్యవసాయాధికారిగా పనిచేస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.శ్రీనివాస్‌రావును ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులను జారీ చేసింది. శ్రీనివాస్‌రావు తన విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారని తెలిపింది.

‘మహిళా శక్తి’కి ఎన్ని కోట్లయినా ఖర్చు చేస్తాం

మహిళా సంఘాల సభ్యుల సంఖ్య పెంచుతాం.. వారి ద్వారా ఆర్టీసీకి మరో 450 బస్సులు లీజుకు..

- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం
- ఏడాదిలో రూ.21,632 కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చాం:భట్టి
- రూ.41.51 కోట్ల రుణాల పంపిణీ



మహిళా సంఘాలకు 41.51 కోట్ల చెక్కు అందజేస్తున్న భట్టి, సీతక్క, పొన్నం, వివేక్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ/యూసుఫ్‌గూడ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మహిళలను మహాలక్ష్మిలుగా చూడాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, వారు ఆర్థికంగా నిలదొక్కుకుని, శక్తిమంతులుగా ఎదిగేందుకు ఎన్ని కోట్లయినా ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. అందుకే ఇందిరా మహిళా శక్తి పథకం తీసుకొచ్చామని, ఐదేళ్లలో రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని క్యాబినెట్ చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రతి సంవత్సరం మహిళా సంఘాలకు రూ.20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందించాలని నిర్ణయించినప్పుడు ప్రతిపక్షాలు హేళన చేశాయని, వారి అంచనాలను తలకిందులు చేస్తూ మొదటి సంవత్సరమే రూ.21,632 కోట్ల వడ్డీ లేని రుణాలు అందించి రికార్డు సృష్టించామని, ఇది తమ సంకల్ప బలమని చెప్పారు. శనివారం యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, గడ్డం వివేక్, మేయర్ గద్వాల విజయలక్ష్మితో కలిసి స్వయం సహాయక సంఘాలకు మెప్మా ద్వారా రూ.41.51 కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని 8,130 మంది మహిళలు ఈ పంపిణీ ద్వారా లబ్ధి పొందుతున్నారన్నారు. రాష్ట్రంలోని పొదుపు సంఘాల్లో 63 లక్షల మంది సభ్యులుంటే... జీహెచ్ఎంసీ 30 సర్కిళ్లలోని 50,764 మహిళా సంఘాల్లో 5,09,957 మంది ఉన్నారని, ఈ సంఖ్యను గణనీయంగా పెంచుతామన్నారు. రాబోయే రోజుల్లో మహిళా సంఘాల సభ్యులు పెట్టుబడుల కోసం ఏ వడ్డీ వ్యాపారి దగ్గరకు వెళ్లాల్సిన పని ఉండదన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల పాటు వడ్డీ లేని రుణాల అంశాన్ని, మహిళా సాధికారతను గాలికి వదిలేసిందని విమర్శించారు.

తెలుగు రాష్ట్రాల నుంచే 35 వేల మంది

- ఏటా అధిక హెచ్1బీ వీసాలు సాధిస్తున్నది తెలుగు టెకీలే
- స్టూడెంట్ వీసాదారులపైనా తీవ్ర ప్రభావం

హైదరాబాద్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): హెచ్1-బీ వీసాల ఫీజును పెంచుతూ ట్రంప్ తీసుకున్న నిర్ణయంతో భారతీయుల డాలర్ డ్రీమ్స్ చెదిరిపోనున్నాయి. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల యువతపైనే అధిక ప్రభావం ఉండనుంది. అగ్రరాజ్యం ఏటా 85 వేల హెచ్1-బీ వీసాలు జారీ చేస్తుండగా.. ఇందులో 73 శాతం (62 వేలు) వీసాలు భారతీయులే దక్కించుకుంటున్నారు. ఇందులో తెలుగు రాష్ట్రాల నుంచి వెళ్లేవారి సంఖ్య దాదాపు 35 వేలుగా ఉంది. ట్రంప్ నిర్ణయంతో ఈ వీసాలపై అమెరికాకు వెళ్లే ఆశలు వదులుకోవాల్సిందేనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటివరకు అమెరికాలోని కంపెనీలు విదేశీ నిపుణులకు హెచ్1-బీ వీసాలతో కొలువులు ఇస్తున్నాయి. ముందుగా మూడేళ్ల కాలానికి జారీ చేసి.. ఆ తర్వాత కొనసాగిస్తున్నాయి. స్థానికులతో పోలిస్తే తక్కువ జీతాలే వస్తున్నా.. కొలువుల కోసం విదేశీయులు భారీగా వెళ్లేవారు. ముఖ్యంగా అమెరికాలోని ఐటీ, వైద్య రంగాల్లో విదేశీ నిపుణుల్లో 73 శాతం భారతీయులే. ఇప్పటివరకు కొత్తగా వచ్చిన హెచ్1-బీ వీసాదారులకు అమెరికాలోని కంపెనీలు ఏడాదికి సరాసరి లక్ష డాలర్ల జీతం ఇస్తున్నాయి. తాజా నిబంధనలతో ఏడాదికి కనీసం 1.50 లక్షల డాలర్ల వేతనం చెల్లించాలని ట్రంప్ సూచించారు. సుంకాలపై భారత్-అమెరికా మధ్య విభేదాలు తీవ్రస్థాయిలో ఉన్న నేపథ్యంలో భారతీయ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకునే ట్రంప్ ఈ నిర్ణయంతో పొమ్మనలేక పొగబెట్టారని అక్కడి తెలుగు సంఘాలు పేర్కొంటున్నాయి.

ఉన్నత చదువులపైనా ప్రభావం



భువనేష్, అమెరికా తెలుగు అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు

ట్రంప్ నిర్ణయంతో హెచ్1-బీ వీసాదారులపైనే కాదు.. ఉన్నత విద్య కోసం వెళ్లే వారిపైనా తీవ్ర ప్రభావం పడనుంది. ప్రతి ఏటా దాదాపు లక్ష మంది విద్యార్థులు ఎంఎస్, ఎంబీఏ, మెడిసిన్ కోసం స్టూడెంట్ వీసా (ఎఫ్-1)పై అమెరికా వెళుతున్నారు. తాజా ఆదేశాలతో స్టూడెంట్ వీసాపై వెళ్లే వారికి అక్కడ భవిష్యత్తు ఉంటుందన్న ఆశ లేకుండా పోయిందని నిపుణులు పేర్కొంటున్నారు. ఎఫ్-1 వీసా తర్వాత కోర్సులను బట్టి విద్యార్థులకు 12-36 నెలల వరకు ఓపీటీ (ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్) గడువు ఉంటుంది. అప్పటిలోగా హెచ్1-బీ వీసా సాధిస్తే అక్కడ ఉద్యోగం చేసుకోవచ్చు. తాజా నిబంధనలతో ఓపీటీ గడువులో ఉన్నవారు పూర్తయిన వెంటనే స్వదేశానికి రావాల్సిందే. హెచ్1-బీ వీసా లక్ష్యంతోనే అనేక మంది ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లేవారు. ఇప్పుడా ఆశలు ఆవిరయ్యాయని అమెరికా తెలుగు అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు భువనేష్ 'ఆంధ్రజ్యోతి'తో పేర్కొన్నారు. ట్రంప్ ఆదేశాలపై స్థానికంగా యువతలో హర్షం వ్యక్తమవుతోందని, హెచ్1-బీ లక్ష్యంగా పెట్టుకున్న భారతీయులు ఇక అమెరికా వచ్చే అవకాశాలు లేవని అభిప్రాయపడ్డారు.

క్యాప్స్ గోల్డ్ కేసులో.. కైసా జువెలర్స్ సీజ్

- క్యాప్స్ గోల్డ్ యజమానుల ఇళ్లలో సోదాలు
- 50 లక్షల నగదు, బంగారం బిస్కెట్లు స్వాధీనం!

హైదరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి):క్యాప్స్ గోల్డ్‌పై ఐటీ శాఖ కొనసాగిస్తున్న దాడుల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. క్యాప్స్ గోల్డ్‌తో వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తూ పన్ను చెల్లింపుల్లో అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించిన సికింద్రాబాద్‌లోని కైసా జువెలర్స్‌ను ఐటీ అధికారులు సీజ్ చేశారు. పన్ను చెల్లింపుల్లో అక్రమాలకు సంబంధించి ఐటీ సోదాలు వరుసగా నాలుగో రోజు హైదరాబాద్‌తోపాటు మరికొన్ని ప్రాంతాల్లో జరిగాయి. క్యాప్స్ గోల్డ్ యజమానులు, బంధువుల ఇళ్లలో సోదాలు చేపట్టారు. ఈ సందర్భంగా రూ.50 లక్షల నగదు, పెద్ద మొత్తంలో బంగారం బిస్కెట్లను ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఐటీ ప్రత్యేక బృందాలు గత బుధవారం నుంచి సోదాలు నిర్వహిస్తున్నాయి. గత ఐదేళ్లుగా ఐటీ చెల్లింపులతోపాటు బంగారం అమ్మకాలు, ఆర్థిక లావాదేవీల్లో అవకతవకలను గుర్తించినట్లు తెలిసింది. బిల్లులు లేకుండా పెద్ద మొత్తంలో బంగారం అమ్మకాలు జరిగినట్లు ఐటీ విచారణలో వెల్లడైనట్లు సమాచారం. ఐటీ చెల్లింపుల్లో భారీగా వ్యత్యాసాన్ని గుర్తించిన అధికారులు... పన్నుల చెల్లింపులు, బంగారం క్రయవిక్రయాలు, బంగారం స్టాక్ రిజిస్టర్లను స్వాధీనం చేసుకున్నారు. బంజారాహిల్స్, అబిడ్స్ కేంద్రంగా ఉన్న క్యాప్స్‌గోల్డ్, కలశ ఫైన్ జువెల్స్ కార్యాలయాలు, వాసవి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఎండీ చందా శ్రీనివాస్ రావు సహా క్యాప్స్‌గోల్డ్, కలశ ఫైన్ జువెల్స్ డైరెక్టర్లు చందా అభిషేక్, చందా సుధీర్, సౌమ్యాల నివాసాల్లో గత నాలుగు రోజులుగా సోదాలు కొనసాగుతున్నాయి.

అప్పుల ఊబిలో రాష్ట్రాలు!



దశాబ్దంలో మూడురెట్లు పెరిగిన రుణభారం

» రూ.59.60 లక్షల కోట్ల అప్పులతో కుంగుబాటు: కాగ్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 20: దేశంలోని అన్ని రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి. గడిచిన దశాబ్దంలోనే రాష్ట్రాల రుణభారం ఏకంగా మూడురెట్లు పెరిగిపోవడంపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా(కాగ్) ఆందోళన వ్యక్తం చేసింది. కాగ్ తొలిసారి విడుదల చేసిన దశాబ్ద విశ్లేషణ నివేదిక ప్రకారం... 2013-14 ఆర్థిక సంవత్సరం నాటికి దేశంలోని 28 రాష్ట్రాల అప్పులు రూ.17.57 లక్షల కోట్లు ఉండగా, 2022-23 నాటికి ఈ మొత్తం రూ.59.60 లక్షల కోట్లకు చేరింది. అంటే.. పదేళ్లలో 3.3 రెట్లకు పైగా పెరిగింది. ఆయా రాష్ట్రాల బడ్జెట్‌లో ఎక్కువ మొత్తం రుణాల చెల్లింపులు, వడ్డీలకే పోతోంది. జీఎస్డీపీతో పోల్చితే 2013-14లో 16.66 శాతంగా ఉన్న రుణాలు 2022-23 నాటికి దాదాపు 23 శాతానికి పెరిగాయి. ఆయా రాష్ట్రాల ఆర్థిక శాఖ కార్యదర్శుల సమావేశంలో కాగ్ అధిపతి కె.సంజయ్ మూర్తి ఈ వివరాలు విడుదల చేశారు. కొన్ని రాష్ట్రాలు భారీగానూ, మరికొన్ని పరిమితికి లోబడి రుణాలు తీసుకుంటున్నాయి. 2023 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి.. పంజాబ్ అప్పులు-జీఎస్డీపీ నిష్పత్తి అత్యధికంగా 40.35 శాతం నమోదు చేసింది. ఆ తర్వాత స్థానాల్లో నాగాలాండ్ (37.15%), పశ్చిమబెంగాల్ (33.70%) ఉన్నాయి. ఈ నిష్పత్తి తక్కువ నమోదైన రాష్ట్రాలుగా ఒడిసా (8.45%), మహారాష్ట్ర (14.64%), గుజరాత్ (16.37%) నిలిచాయి. 2023 ఆర్థిక సంవత్సరంలో అన్ని రాష్ట్రాల మొత్తం అప్పు దేశ జీడీపీలో 22.17 శాతానికి సమానమని కాగ్ తెలిపింది. 2023లో ఆంధ్రప్రదేశ్, పంజాబ్, పశ్చిమ బెంగాల్, కేరళ, బిహార్, తమిళనాడు సహా 11 రాష్ట్రాలు తాము తెచ్చిన రుణాల్లో కొంతభాగాన్ని మూలధన వ్యయానికి బదులుగా రెవెన్యూ లోటు తీర్చడానికి ఖర్చు చేశాయి. ఏపీ, పంజాబ్‌ల్లో మూలధన వ్యయం నికర రుణాల్లో వరుసగా 26 శాతం, 17 శాతంగా మాత్రమే ఉంది. ఇక హిమాచల్‌ప్రదేశ్, హరియాణా ప్రభుత్వాలు సేకరించిన రుణాల్లో సగమే మూలధన ప్రాజెక్టులకు కేటాయించాయి. నిర్వహణ ఖర్చుల కోసం కాకుండా పెట్టుబడుల కోసమే అప్పులు సేకరించాలన్న 'గోల్డెన్ రూల్'ను ప్రభుత్వాలు ఉల్లంఘిస్తున్నాయని కాగ్ నివేదిక వెల్లడించింది.

కేంద్రానిది నిర్బంధ సమాఖ్యవాదం: కాంగ్రెస్

రాష్ట్రాల స్వాతంత్ర్యాన్ని హరించి, వాటిని మున్సిపాలిటీల స్థాయికి తగ్గించడం ద్వారా కేంద్రం నిర్బంధ సమాఖ్యవాదానికి పాల్పడుతోందని కాంగ్రెస్ ఆరోపించింది. రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయంటూ కాగ్ విడుదల చేసిన నివేదికపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రణదీప్ సుర్జేవాలా శనివారం ఎక్స్ వేదికగా స్పందించారు. దేశ సమాఖ్య విధానం ఇంతకు ముందెన్నడూ లేనంత ఒత్తిడిలో ఉందన్నారు. ఇప్పటికే రాష్ట్రాల అప్పుల భారం దశాబ్దంలో మూడు రెట్లు పెరిగిందని, ఇప్పుడు జీఎస్టీ సెస్, ఏకపక్ష సుంకాలతో అవి ఆర్థిక స్వాతంత్ర్యం కోల్పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పెరుగుతున్న అప్పులు, తగ్గుతున్న ఆదాయాలతో ఈ ప్రమాదం రెట్టింపైందని తెలిపారు. సహకార సమాఖ్యవాదం, అధికార వికేంద్రీకరణకు ముప్పు వాటిల్లుతోందని, రాష్ట్రాల అధికారాలను హస్తగతం చేసుకోవడానికి కేంద్రం ఉద్దేశపూర్వకంగా ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు.

ఆర్థికంగా బలపడితే.. జీఎస్టీ శ్లాబులను ఒకటికి తగ్గించే అవకాశం

» కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

చెన్నై, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థిక వ్యవస్థ బలపడితే జీఎస్టీ శ్లాబులను ఒకటికి తగ్గించే అవకాశముందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. మదురైలో తమిళనాడు ఆహార వ్యాపారుల సంఘం వార్షికోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... 'జీఎస్టీ పన్ను రేటు నిర్ణయించడంలో అన్ని రాష్ట్రాల పాత్ర ఉంది. కరోనా ప్రభావం కారణంగా దేశ ఆర్థిక ప్రయోజనాల దృష్ట్యా జీఎస్టీ సంస్కరణలను తీసుకురావడం ఆలస్యమయింది. ప్రస్తుత ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని పన్ను శ్లాబులను నాలుగు నుంచి రెండుకు తగ్గించాం. 378 వస్తువులను 5, 18 శాతం పన్ను పరిమితుల్లోకి తీసుకువచ్చాం. 2017లో 65 లక్షల మంది వ్యాపారులు జీఎస్టీలో చేరితే... ప్రస్తుతం ఆ సంఖ్య 1.51 కోట్లకు చేరింది. ప్రతిపక్షాలు చెబుతున్నట్లుగా జీఎస్టీ ఒక క్రూరమైన పన్ను వ్యవస్థ అయితే, అందులో చేరే వారి సంఖ్య ఎలా పెరుగుతుంది? పన్ను రేటు శ్లాబుల మదింపుతో ఆర్థిక శాఖకు చెల్లిస్తున్న సుమారు రూ.2 లక్షల కోట్లు ఇకపై ప్రజల వద్దనే ఉంటాయి' అని నిర్మల వివరించారు.

జీఎస్టీ ఫిర్యాదుల నమోదుకు ప్రత్యేక ఏర్పాటు

సవరించిన జీఎస్టీ రేట్లకు సంబంధించిన ఫిర్యాదులను రిజిస్టర్ చేయడానికి వీలుగా నేషనల్ కన్స్యూమర్ హెల్ప్‌లైన్(ఎన్‌సీహెచ్)కు చెందిన ఇన్‌గ్రామ్ పోర్టల్‌లో ప్రత్యేక కేటగిరీని కేంద్రం అందుబాటులోకి తెచ్చింది. వినియోగదారులు టోల్‌ఫ్రీ నంబరు 1915 ద్వారా హిందీ, ఇంగ్లిష్, తెలుగు సహా 17 భాషల్లో తమ ఫిర్యాదులను నమోదు చేయవచ్చు.

యూరప్‌లో ప్రధాన ఎయిర్‌పోర్ట్‌లపై సైబర్ దాడి

» లండన్, బెర్లిన్ సహా పలుచోట్ల విమానాల రాకపోకల్లో ఆలస్యం

బ్రసెల్స్, సెప్టెంబరు 20 : యూరప్ ఖండంలోని పలు ప్రధాన విమానాశ్రయాలపై శనివారం సైబర్ దాడి జరిగి పలు విమానాల రాకపోకలు ఆలస్యమవడంతోపాటు కొన్ని రద్దయ్యాయి. దీంతో పలు దేశాలకు వెళ్లాల్సిన వేలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. లండన్‌లో హీత్రూ, బెల్జియంలోని బ్రసెల్స్ జర్మనీలోని బెర్లిన్ విమానాశ్రయాలతోపాటు పలు విమానాశ్రయాల చెక్ ఇన్, బోర్డింగ్ సిస్టమ్‌లపై సైబర్ దాడి జరగడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో ఆటోమేటెడ్ చెక్-ఇన్, బోర్డింగ్ వీలుకాక.. మాన్యువల్ చెక్-ఇన్, బోర్డింగ్ మాత్రమే సాధ్యమైందని, ఫలితంగా విమానాల రాకపోకలపై తీవ్ర ప్రభావం పడిందని బ్రసెల్స్ ఎయిర్‌పోర్ట్ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యూరప్ అంతటా ఈ పరిస్థితి నెలకొందని సమస్య సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. యూరప్‌లో రద్దీగా ఉండే లండన్ హీత్రూ విమానాశ్రయ అధికారులు కూడా సైబర్ దాడిని నిర్ధారించారు. ప్రపంచ వ్యాప్తంగా పలు ఎయిర్‌లైన్లకు చెక్ ఇన్, బోర్డింగ్ సిస్టమ్‌లు అందించే 'కోలిన్స్ ఏరోస్పేస్' సాంకేతిక సమస్యలు ఎదుర్కోవడంతో ప్రయాణికుల బోర్డింగ్ బాగా ఆలస్యమవుతోందని హీత్రూ ఒక ప్రకటనలో పేర్కొంది. హీత్రూ, బెర్లిన్, బ్రసెల్స్‌లలో మొత్తం 29 విమానాల రాకపోకలు రద్దయ్యాయి. లండన్ హీత్రూ విమానాశ్రయం నుంచి సర్వీసులు నిర్వహించే ఎయిర్ ఇండియా కూడా ఈ సమస్య వల్ల అక్కడి నుంచి ప్రయాణాలు ఆలస్యమవుతాయని 'ఎక్స్'లో తెలియజేసింది. అయితే జర్మనీలో అతి పెద్దది అయిన ఫ్రాంక్‌ఫర్ట్ ఎయిర్‌పోర్ట్‌లో ఈ సమస్య లేదని, ప్రయాణికుల రాకపోకలు సజావుగా సాగుతున్నాయని ఆ ఎయిర్‌పోర్ట్ ప్రతినిధి ఒకరు చెప్పారు. కాగా యూరప్‌లో జరిగిన సైబర్ దాడితో భారత్‌లోని ఎయిర్‌పోర్ట్‌లకు ఎటువంటి ఇబ్బంది లేదని కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

ప్రేక్షకులను ఉర్రూతలూగించేలా...



నందమూరి బాలకృష్ణ నటిస్తున్న 'అఖండ 2: తాండవం' షూటింగ్ శరవేగంగా జరుగుతున్న సంగతి తెలిసిందే. తాజాగా హైదరాబాద్‌లో ఓ భారీ సెట్ నిర్మించి ఓ పాటను షూట్ చేస్తున్నారు. దాదాపు 600 మందితో అదిరిపోయేలా ఈ మాస్ పాటను చిత్రీకరిస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. ఇది సినిమాకే ప్రధానాకర్షణగా నిలవనుందని, ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తుందని చెప్పారు. భాను మాస్టర్ కొరియోగ్రఫీ అందిస్తున్నారు. బోయపాటి శ్రీను దర్శకుడు. బాలకృష్ణ కూతురు తేజస్విని సమర్పణలో రామ్ అచంట, గోపీ అచంట నిర్మిస్తున్నారు. ఎడిటర్: తిమ్మరాజు, డీఓపీ: సి.రామ్‌ప్రసాద్, సంతోష్ డీ.డెటాకే. సంగీతం: థమన్. కాగా, బాలకృష్ణ, బోయపాటి కాంబోలో ఇదివరకు వచ్చిన 'సింహా', 'లెజెండ్', 'అఖండ' సినిమాలు బ్లాక్‌బస్టర్ విజయాలు అందుకున్న విషయం తెలిసిందే.

మోహన్‌లాల్‌కు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు



మలయాళ అగ్ర కథనాయకుడు మోహన్‌లాల్‌కు అరుదైన గౌరవం దక్కింది. చిత్ర పరిపరిశ్రమలో ఆయన సేవలకు గుర్తింపుగా 2023 సంవత్సరానికిగాను ప్రతిష్ఠాత్మకమైన దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుకు ఎంపికయ్యారు. ఈనెల 23న నిర్వహించనున్న 71వ జాతీయ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవంలో మోహన్‌లాల్‌కు కేంద్ర ప్రభుత్వం దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును అందజేస్తుంది. ఈ మేరకు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ శనివారం అధికారికంగా ప్రకటించింది. మోహన్‌లాల్ అసలు పేరు మోహన్‌లాల్ విశ్వనాథ నాయర్. విలన్ పాత్రతో పరిచయమై హీరోగా ఎదిగిన ఆయన ఇప్పటి వరకూ 6 జాతీయ అవార్డులు గెలుచుకున్నారు. 2001లో పద్మశ్రీ, 2019లో పద్మభూషణ్ అవార్డులతో మోహన్‌లాల్‌ను భారత ప్రభుత్వం సత్కరించింది.

నాలుగు దశాబ్దాల సినీ ప్రస్థానంలో మోహన్‌లాల్ 400కి పైగా చిత్రాల్లో నటించారు. కేవలం మలయాళంలోనే కాకుండా తమిళ్, తెలుగు, కన్నడ, హిందీ చిత్రాల్లో కూడా నటించి ప్రేక్షకులను అలరించారు. మోహన్‌లాల్ తన 18వ ఏట చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టారు. మొదట 1978లో 'తిరనోట్టం' అనే మలయాళ చిత్రంలో నటించారు. కానీ సెన్సార్ అభ్యంతరాలతో విడుదలలో జాప్యం జరిగింది. అయితే 1980లో వచ్చిన 'మంజిల్ విరింజ పూక్కల్' చిత్రం ద్వారా తొలిసారిగా తెరపై కనిపించారు. ఇందులో ప్రతి నాయకుడి పాత్రను పోషించారు. అప్పటి నుంచి పలు చిత్రాల్లో విలన్, ద్వితీయ శ్రేణి నటుడిగా పాత్రలు పోషిస్తూ చిత్ర పరిశ్రమలో తన స్థానాన్ని నిలుపుకునే ప్రయత్నం చేశారు. అయితే 1986లో వచ్చిన 'రాజావింటే మకన్' చిత్రం ద్వారా మోహన్‌లాల్‌కు స్టార్‌డమ్ లభించింది. అక్కడి నుంచి సినీ ప్రయాణం నిర్విఘ్నంగా కొనసాగుతూనే ఉంది.

తెలుగులో: తెలుగులో మొదటిసారిగా 1994లో వచ్చిన 'గాండీవం' అనే సినిమాలో అక్కినేని నాగేశ్వరరావుకు కుమారుడిగా అతిథి పాత్రలో కనిపించారు. ఆ తర్వాత 2016లో చంద్రశేఖర్ ఏలేటి తెరకెక్కించిన 'మనమంతా' చిత్రంలో పూర్తిస్థాయిలో నటించారు. ఆ తర్వాత 'జనతా గ్యారేజ్', 'కన్నప్ప' చిత్రాల్లో మోహన్‌లాల్ నటించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.